

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 42 • పేజీలు:12+16 • వెల: రూ.5 శుక్రవారం • 12-1-2018 www.manamnews.com /manamnews



త్వరలో పార్టీ మార్పు

ఉగాది తర్వాత కార్యాచరణ

2019 ఎన్నికలే చివరివి..

ప్రస్తుతం బీజేపీలోనే: నాగం

వివరాలు 2లో..



దయతలిస్తే దద్దోజనం తింటా!

మరేం పర్లేదు.. జైల్లోనే పెట్టిస్తా


లాలూ వినతి... జడ్జి జవాబు

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి5 నుంచి ఏప్రిల్ 12దాకా

టెన్త్, ఇంటర్ పరీక్షలు

వివరాలు 7లో..



హై వోల్టేజ్!

విద్యుత్ రంగంపై ఫట్‌ఫట్... ఛట్‌ఛట్

అధికార.. ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం

చర్చకు దమ్ముందా... టీఆర్ఎస్ సవాల్

రండి తేల్చుకుందాం.. కాంగ్రెస్ బదుల్

పీసీసీ లేదా సీఎల్పీ నేతలు వస్తే సిద్ధం

పిలిచి.. పారిపోతారా?: రేవంత్ ఎద్దేవా

అసెంబ్లీలో మాట్లాడదాం... జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి):

విద్యుత్ రంగంపై పాలక టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌ల మధ్య వాగ్యుద్ధంలో 'హై వోల్టేజ్' పుడుతోంది. వచ్చే ఏడాదికి శాసనసభ ఎన్నికలు రానుండటంతో రెండు పార్టీలమధ్య సవాళ్లు... ప్రతిసవాళ్లు 'ఫట్‌ఫట్-ఛట్‌ఛట్' మంటున్నాయి. పరస్పర విమర్శలతో మిగతా 6లో..

నింగిలోకి..

నూరో ఉపగ్రహం

సిద్ధమైన పీఎస్ఎల్వీ-సి40 రాకెట్

ఇస్రో విజయాశ్వంపై భారీ ఆశలు

మరికొద్ది గంటల్లో ప్రయాణం

వెంట మరో 30 శాటిలైట్లు

ఇందులో 28 విదేశీ అతిథులు

కొత్త ఏడాదిలో తొలి ప్రయోగం

7లో..





తిరుమలలో 'మనం' పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకయ్యానాయుడు

దినదినాభివృద్ధి ప్రాప్తిరస్తు

ఉప రాష్ట్రపతి వెంకయ్య ఆశీర్వాదం

'మనం' క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుమలలో స్వామివారి దర్శనం

ఆధ్యాత్మిక కేంద్రం.. భారతదేశం

అందుకే ఇటు విదేశీయుల చూపు

కుల.. మత వివక్షను రూపుమాపాలి



తిరుపతి, జనవరి 11 (మనం న్యూస్‌బ్యూరో):

'మనం' దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమల కొండ మీద.. మిగతా 6లో..

ఇదీలోకం!



వాళ్లు మనుషులుగా ఆలోచిస్తే..
అసలు మనకు ఓటే వేయరు సార్..!

గ్రీన్ కార్డులు రయ్.. రయ్

45 శాతం పెంచాలని ప్రతిపాదన

అమెరికా ప్రతినిధుల సభలో చట్టం

ఆమోదిస్తే భారతీయులకు మేలు

1.20 లక్షల నుంచి 1.75 లక్షల కార్డులు

వాటితో అమెరికాలో శాశ్వత నివాస హోదా

సాంకేతిక నిపుణులకు మంచి అవకాశం



వాషింగ్టన్, జనవరి 11:

ప్రతిభ ఆధారిత ఇమ్మిగ్రేషన్ వ్యవస్థ, దానికితోడు ప్రతి ఏటా గ్రీన్ కార్డుల కేటాయింపును 45 శాతం మిగతా 6లో..



'పేర్లు' గాయబ్!

ఎల్‌బీనగర్‌లో 17.6 లక్షల ఓట్లు మాయం

కుత్బుల్లాపూర్‌లో 30 వేలు.. ముషీరాబాద్‌లో 50 వేలు

కాంగ్రెస్ ఆగ్రహం.. ఈసీకి ఫిర్యాదు..

చర్యలు తీసుకోకపోతే ఆందోళన: సబిత

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లో ఓటర్ల జాబితా విషయంలో కుట్రలు పన్నుతున్నారని మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. చలి గాలులు వణికిస్తాయి. గంటకు 9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 45 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి రా.9.23 తదుపరి ద్వాదశి; నక్షత్రం: విశాఖ ఉ.7.25 తదుపరి అనురాధ; వర్జ్యం: ఉ.11.53-1.40; దుర్ముహూర్తం: ఉ.9.06-9.50, మ.12.47-1.31; రాహుకాలం: ఉ.11.02-12.24; అమృతఘడియలు: రా.10.38-12.25; శుభసమయం: ఉ.10.00-10.30, మ.1.41-3.00;

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 5.56



ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్

సూక్ష్మ,చిన్న పరిశ్రమల కోసం ఏర్పాటు

ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టండి

చిన్న పరిశ్రమలకు చేయూతనివ్వండి

సూక్ష్మ పరిశ్రమలకు సాయమివ్వండి

పునరుద్ధరణకు తోడ్పాటునివ్వండి

బ్యాంకర్ల సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి):

తెలంగాణలోని చిన్న సూక్ష్మ తరహా పరిశ్రమలకు చేయూతనివ్వాలని రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి మిగతా 6లో..

సరిహద్దుకు ఆవల..

దుర్భర స్థితిలో పాకిస్థానీ హిందువులు

ప్రతిరోజూ యువతుల అపహరణ

శరణార్థులుగా భారత్‌లోకి ప్రవేశం

ఇక్కడ కూడా.. లెక్కలేనన్ని కష్టాలు

వారి కన్నీళ్లు తుడిచేందుకు ప్రయత్నం

భారత దేశ పౌరసత్వం.. ఉపాధి

వారికి బ్యాంకు ఖాతాలు కూడా..

ఇక్కడ సురక్షితంగా ఉండేలా భరోసా

వైద్యసాయం చేసేందుకు 'నిమిత్తేకం'

ఐఎస్ఐ నుంచి బెదిరింపులు

'మనం'తో డాక్టర్ ఓమేంద్ర రత్ను





(కె. రాకా సుధాకర్‌రావు)

ఆయనో డాక్టర్. వైద్యం చేస్తే వేలు రాలతాయి. కానీ.. సరిహద్దుకు అవతల వైపు పాకిస్థాన్ నుంచి హిందూ అభాగ్యుడి ఫోన్ మోగితే మిగతా 6లో..



ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురి మృతి

- మరో ఆరుగురికి గాయాలు
- వనపర్తి జిల్లా పాన్‌గల్‌లో ప్రమాదం

పాన్‌గల్, జనవరి11(మనంన్యూస్): దర్గాలో మొక్కులు తీర్చుకోవడానికి సంతోషంగా వెళ్లిన ఓ కుటుంబంలో విషాదం నెలకొంది. తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడడంతో భార్యభర్తలు సహా మరో చిన్నారి మరణించారు. మరో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలపీర్ల దర్గా సమీపంలో గురువారంనాడు చోటుచేసుకున్న ఈ ప్రమాదం వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా బొందలపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య కుటుంబం పాన్‌గల్ మండల కేంద్రం సమీపంలోని బాలపీర్ల దర్గాలో మొక్కులు తీర్చుకునేందుకు గురువారం తెల్లవారు జామున ట్రాక్టర్‌లో బయలుదేరింది. కుటుంబ సభ్యులంతా ఒక్కచేట చేరడంతో సంతోషంగా గడిపారు. పీర్ల దగ్గర మొక్కులు తీర్చుకుని, భోజనాలు చేసి తిరుగుప్రయాణమయ్యారు. దర్గా దాటి కిలో మీటర్ ప్రయాణించారో లేదో.. మలుపు తిరిగే సమయంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి వెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ నడుపుతున్న తిరుపతయ్య(40)తో పాటు, అతడి తమ్ముడి కూతురు మౌనిక(16) అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 15 మందిలో మరో ఏడుగురికి గాయాలు కాగా.. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తిరుపతయ్య భార్య తిరుపతమ్మ(36) మరణించింది. అప్పటిదాకా సంతోషంగా గడిపిన వారు అనుకోకుండా మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రేమోన్మాది అనంతప్ప అరెస్టు

- ప్రేమను నిరాకరించిందన్న కక్ష్యతోనే జానకి హత్య
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): తన ప్రేమను నిరాకరించిందన్న కోపంతో జానకి అనే యువతిని హత్య చేసిన ప్రేమోన్మాది అనంతప్పను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మూసాపేటలో జరిగిన ఈ హత్య రెండు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. తనను ప్రేమించలేదనే కక్షతోనే అనంతప్ప ఈ హత్య చేశాడని, అనంతప్పను రిమాండ్ తరలించామని కూకట్‌పల్లి ఏసీపీ భుజంగరావు విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా భుజంగరావు మాట్లాడుతూ కేపీహెచ్‌బీలోని డీ మార్ట్‌లో జానకి మూడేళ్లుగా పని చేస్తోందని, అదే సంస్థలో పని చేస్తున్న వికారాబాద్ జిల్లా మర్పల్లి గ్రామానికి చెందిన అనంతప్పతో జానకికి ఎనిమిది నెలల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. అప్పట్నుంచి అనంతప్ప జానకిని ప్రేమ పేరుతో వేదించేవాడు. విషయం తెలిసిన యాజమాన్యం జానకిని వేరే బ్రాంచీకి బదిలీ చేసింది. అయినా అనంతప్ప తీరు మారలేదు. దీనికి తోడు జానకి తన బావతో సన్నిహితంగా మాట్లాడుతుండడం చూసిన అనంతప్ప మరింత కక్ష పెంచుకున్నాడు. మంగళవారం రాత్రి జానకి గదికి వెళ్లి తనను ప్రేమించమని ఒత్తిడి చేశాడు. యువతి నిరాకరించడంతో ఆగ్రహించి కూరగాయలు కోసే కత్తితో పొడిచి, గొంతు నులిమి హత్య చేసినట్టు నిందితుడు అంగీకరించాడని ఏసీపీ తెలిపారు. హత్య చేసిన వెంటనే నిందితుడు తన సొంతూరుకు పారిపోయాడని, సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అనంతప్పను పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. ప్రేమ పేరుతో వెంట పడే వారి పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని, విషయాన్ని తల్లి దండ్రులు, పోలీసులు దృష్టికి తీసుకురావాలని ఏసీపీ సూచించారు.

అవి కూడా 'సంక్రాంతి' సెలవులేనట!

- ఇంటర్ బోర్డు అధికారుల వింత వైఖరి

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కాలేజీలకు ఈనెల 13 నుంచి 15 వరకు సెలవులు ప్రకటిస్తున్నట్టు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్‌కుమార్ బుధవారం అదేశాలు జారీ చేసిన విషయం విదితమే. కానీ వాస్తవానికి ఈ నెల 13వ తేదీ రెండో శనివారం(సాధారణ ప్రభుత్వ సెలవు దినం), 14న ఆదివారం(ఇదీ సెలవే) ఎలాగూ సెలవు దినమే.. 15న సోమవారం మాత్రమే ప్రభుత్వ సెలవు. ఈ విషయాన్ని మరిచిన ఇంటర్ బోర్డు అధికారులు మూడు రోజుల పాటు సెలవులు అన్ని ప్రకటించడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే సెలవు దినాలను సంక్రాంతి పండుగ పేరున సెలవు దినాలను చెప్పడం పట్ల అధికారుల అంతర్యమేమిటోనని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

13 నుంచి చెన్నారెడ్డి శత జయంత్యుత్సవాలు

- తెలుగు రాష్ట్రాల్లో ఏడాదిపాటు నిర్వహణ: రోశయ్య

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి శతజయంతోత్సవాలను ఈ నెల 13 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏడాది పాటు నిర్వహించనున్నట్టు శతజయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు, మాజీ గవర్నర్ కె. రోశయ్య తెలిపారు. హైదరాబాద్‌లో చెన్నారెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డితో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రానికి రెండుసార్లు సీఎంగా పని చేసిన చెన్నారెడ్డి ప్రజల సంక్షేమం కోసం ఎంతో ఆలోచించేవారని చెప్పారు. చిన్న వయసులోనే ఎంపీగా పార్లమెంటులో చెన్నారెడ్డి అడుగుపెట్టారన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. 13న జరిగే ఆయన 99వ జయంతి ఉత్సవాలకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణస్వామి హాజరుకానున్నారని తెలిపారు. శతజయం తోత్సవాలలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పాల్గొననున్నారని, తేదీలు ఖరారు కావాల్సి ఉందన్నారు. రెండు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో శతజయంతి ఉత్సవాల సందర్భంగా సదస్సులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాల నిర్వాహణకు ప్రభుత్వం ముందుకు వస్తే కలిసే చేస్తామని స్పష్టం చేశారు. శతజయంతి ఉత్సవాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉత్సవ కమిటీకి చెందిన మర్రి శశిధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నిరంజన్, కమలాకర్, శ్యాంమోహన్ పాల్గొన్నారు.

'టీఆర్టీ' సవరణ గడువు పెంపు

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్టీ) దరఖాస్తుల సవరణకు టీఎస్‌పీఎస్సీ తుది గడువును మరోసారి పెంచింది. వాస్తవానికి ఈనెల 11తో గడువు పూర్తయ్యింది. కానీ దరఖాస్తుల ఎడిట్‌లో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒక్క దరఖాస్తుకు మించి ఎడిట్ కాకపోవడంతో పాటు సర్వర్ సమస్యతో ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని టీఎస్‌పీఎస్సీ ఈ నెల 15 వరకు అవకాశం ఇస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

సర్పంచుల కోసం 'ట్రిబ్యునల్'

- క్రమశిక్షణ చర్యలపై సవాలుకు వీలు
- రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా
- ఆక్రమణలపై కఠిన చర్యలు
- పంచాయతీ సబ్ కమిటీలో చర్చ

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): సర్పంచులపై జిల్లా కలెక్టర్లు తీసుకునే క్రమ శిక్షణ చర్యలను సవాలు చేసేలా అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటుచేస్తే ఎలా ఉంటుందనే అంశంపై పంచాయతీరాజ్ బిల్లుపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ విస్తృతంగా చర్చించింది.సర్పంచ్‌లపై తీసుకునే క్రమ శిక్షణ చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ఇప్పటి వరకు ప్రభుత్వం తరుపున పంచాయతీరాజ్ శాఖ మంత్రి వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రిబ్యు నల్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయటం ద్వారా మరింత పారదర్శంగా వ్యవహరించేందుకు అవస రమైన అవకాశాలను పరిశీలించాలని అధికారులకు కమిటీ సూచించింది. గురువారం జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ మరోసారి సమావేశమైంది. ఈ సందర్భంగా చట్టానికి లోబడి ప్రజలెవరైనా వ్యవహరించకపోతే వారికి జరిమానా విధించే హక్కును కూడా సర్పంచ్ నేతృత్వంలోని పాలకవరాగ్గనికి కల్పించడంపై చర్చించారు. రోడ్డుపై చెత్త వేయటం, ఇంట్లోని మురుగునీటిని వీధుల్లోకి వదలటం, రహదార్లను ఆక్రమించటంతో పాటు అక్రమంగా నిర్మాణాలు చేపట్టటంతో సహా 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే విషయమై చర్చించారు. ఇప్పటి వరకు పంచాయతీల్లో ఆడిటింగ్ ప్రక్రియ కొంత ఆలశ్యంగా గుర్తించిన అధికారులు దానిని సరి చేసేలా చట్టంలో మార్పులు చేయాలని సబ్ కమిటీ భావిస్తున్నట్టుగా తెలిసింది. ఆర్థిక సంవత్సరం పూర్తై తొమ్మిది నెలల గడుస్తున్నా ఆడిటింగ్ ప్రక్రియ నడుస్తుండటం ఇప్పటి వరకు జరుగుతుంది. పంచాయతీలలో జరగుతున్న ఆడిటింగ్ వివరాలను ఆడిటింగ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు సబ్‌కమిటీకి తెలిపారు. ఆడిటింగ్ కాలపరిమితి తగ్గించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పంచాయతీల్లో జరుగుతున్న నిధుల వ్యయం, పన్నుల వసూళ్ల లాంటి వన్ని అప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలనే నిబంధనలను చట్టంలో పొందు పర్చాలనే అంశంపై సబ్‌కమిటీ చర్చించింది. ఇందు కోసం ప్రతి పంచాయతీలోనూ కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించాలనే అభిప్రాయాన్ని సబ్‌కమిటీ వ్యక్తం చేసింది. సరిగా పనిచేయని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలకవర్గాన్ని కట్టబెట్టే దిశగా చర్చించారు. కాగా, ముగ్గురు పిల్లలుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటూ 1995లో విధించిన నిబంధనను ఎత్తివేయాలని మంత్రి జూపల్లికి తెలంగాణ గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్ గాంధీనాయక్ విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల 'భవిత'కేదీ రక్షణ?

ఎస్కార్ట్ భత్యానికి ఎగనామం.. ప్రభుత్వం నిధులు ఇచ్చినా.. చెల్లింపులలో అధికారుల నిర్లక్ష్యం

- అలవెన్సుల్లేక దివ్యాంగుల అవస్థలు
- ప్రైవేటులో చేర్పిస్తున్న తల్లిదండ్రులు





హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): దివ్యాంగులపట్ల విద్యాశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా సర్వశిక్ష అభియాన్ కింద నిర్వహిస్తున్న భవిత కేంద్రాల్లో ఎస్కార్ట్ అలవెన్సు(దివ్యాంగులతో వచ్చిన వారికి ఇచ్చే భత్యం) విడుదలలో అధికారులు జాప్యం చేస్తున్నారు. వ్యయ ప్రయాసలకోర్చి పిల్లల్ని భవిత కేంద్రాలకు తీసుకొచ్చిన తల్లిదండ్రులకు అలవెన్సు ఇవ్వడానికి అధికారులకు చేతులు రావడం లేదు. అదేంటని ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని, సాంకేతిక సమస్యలని సాకులు చెబుతూ అలవెన్సుల విడుదలను ఆలస్యం చేస్తున్నారు. గత నవంబర్ నెలలోనే రాష్ట్ర ప్రభుత్వం 31 జిల్లాలకు సుమారు రూ.86.07 లక్షలు విడుదలచేసింది. నిధులు విడుదలై రెండు నెలలు కావొస్తున్నా.. చాలా జిల్లాల్లో ఎస్కార్ట్ భత్యాన్ని నేటికీ అందజేయలేదు. భవిత కేంద్రాలు దివ్యాంగులకు వరంగా మారుతాయని ఆశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరుగా ఉంది. పిల్లల్లో మానసిక వైకల్యం, అంధత్వం, సెరెబ్రల్‌పాల్సీ, పాక్షిక అంధత్వం, బహుళ వైకల్యం, శారీరక వైకల్యం, మాటలు రాకపోవడం వంటి పది రకాల సమస్యలను నిపుణులు గుర్తించి తర్ఫీదు అందించాలి. కానీ ఆయా సేవలకు నిపుణులు లేక దివ్యాంగుల పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారయ్యింది. దీంతో దివ్యాంగుల హాజరు తగ్గి భవిత కేంద్రాలు మూతపడుతున్నాయి.

అర్హుల గుర్తింపులోనూ అలసత్వమే..

భవిత కేంద్రాల్లో నమోదైన దివ్యాంగులలో ఎస్కార్ట్ అవసరమైన వారిని గుర్తించడంలోనూ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. మరికొన్నిచోట్ల మాత్రం ఒక్కో సెంటర్‌లో ఒక్క ఐఆర్‌పీ ఉండడం, ఆ కేంద్రం బాధ్యతలను వారే చూడాల్సి రావడం సమస్యగా మారింది. ఉదహరణకు ఒక సెంటర్‌లో 300 మంది వికలాంగులు నమోదైతే.. వారిలో ఎస్కార్ట్ భత్యం పొందేందుకు అర్హత ఉన్నవారు 150 ఉన్నప్పటికీ ప్రభుత్వం విడుదల చేసిన నిధుల దృష్ట్యా వంద మందిని మాత్రమే అర్హులుగా నిర్ణయిస్తున్నారు. వారిలోనూ ఏళ్ల తరబడి ఎస్కార్ట్ భత్యాలు అందని వారు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలానికి రెండు భవిత కేంద్రాలు

కేంద్ర ఆధ్వర్యంలో నడిచే సర్వశిక్ష అభియాన్‌లో భాగంగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా 2013-14 సంవత్సరంలో భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదట్లో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటుచేసినా... దూర ప్రాం తాల దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో మండలానికి రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఆయా రంగాల నిపుణుల ద్వారా తర్ఫీదు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకుగాను ఒక్కో కేంద్రానికి ఇద్దరు ఐఆర్‌పీ(ఇంక్లూవ్ రిసోర్స్ పర్సన్) ఉండాలి. కానీ ఎక్కడో తప్ప దాదాపు అన్ని మండలాల్లోనూ ఒక్క ఐఆర్‌పీ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.

నెలకు రూ.2500 ఎస్కార్ట్ భత్యం

దివ్యాంగులు భవిత కేంద్రాలకు వచ్చేందుకు రవాణా చార్జీలను ప్రభుత్వమే అందిస్తోంది. ఒక్కొక్కరికి నెలకు రూ.250 చొప్పున అందించాలి. మధ్యాహ్న సమయంలో పౌష్టికాహారాన్ని అందించి వారికి కడుపు నింపాలి. సాధారణ పాఠశాలకు అంగవైకల్యం కలిగిన వారిని తీసుకొచ్చేందుకు ఎస్కార్ట్ చార్జీలను ఏడాదికి రూ.2500లను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎట్టకేలకు ప్రభుత్వం రెండు నెలల క్రితం నిధులు విడుదల చేసినా.. చాలాచోట్ల నేటికీ ఎస్కార్ట్ భత్యం పంపిణీ చేయకపోవడం గమనార్హం.

భత్యం విషయమే తెలియదు..

నా కొడుకు మూడేళ్ల నుంచి భవిత కేంద్రానికి రెండు సంవత్సరాల పాటు తీసుకెళ్లాను. ఇంత వరకు ఏలాంటి రవాణా భత్యం తీసుకోలేదు. అసలు అది ఇస్తారనే విషయమూ తెలవదు. కానీ ఈ రెండేళ్లలో అప్పుడప్పుడు ఆటో ఇంటికి వచ్చి తీసుకెళ్లేది. తర్వాత రావడం మానేసింది. కూలీ పనికి పోతేనే.. కుటుంబం గడుస్తుంది. పని మానుకుని రోజూ అంతదూరం తీసుకెళ్లలేక మానేశా!

- అలివేలు, దివ్యాంగుడి తల్లి

ప్రైవేటులో జాయిన్ చేశా..

నా కుమారుడిని భవిత కేంద్రానికి తీసుకెళ్లి.. పొద్దంతా అక్కడే ఉండి తీసుకొచ్చేవాడిని. సంవత్సరం తర్వాత సాధారణ పాఠశాలకు తీసుకెళ్లాను. ఇంతవరకు ఏ భత్యం మాకివ్వలేదు. రోజూ తీసుకెళ్లడం కుదరక.. తప్పని పరిస్థితిలో తీసుకెళితే అయ్యే ఖర్చుతో ప్రైవేటుగా దివ్యాంగుల పాఠశాలలో చేర్పించాను. నెలకు రూ.3000 చెల్లిస్తున్నా.


- రాములు, దివ్యాంగుడి తండ్రి

'సబ్సిడీ' గొర్ల కొనుగోలు ముఠా అరెస్ట్

- లారీలలో తరలిస్తున్న 210 గొర్ల స్వాధీనం
- 13 మంది అరెస్ట్, పరారీలో నలుగురు




నెల్లికుదురు, జనవరి 11(మనంన్యూస్): ప్రభుత్వం సబ్సిడీపై అందించిన గొర్లను లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్న ముఠాను నెల్లికుదురు మండలంలోని బంజర బస్‌స్టాప్ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు లారీలలో తరలిస్తున్న 210 గొర్లను స్వాధీనం చేసుకున్నారు. లారీలను సీజ్ చేశారు. ఈ ముఠాకు చెందిన 13 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ నంద్యాల కోటిరెడ్డితెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తొర్రూర్ డీఎస్పీ రాజారత్నం, సి.ఐ చేరాలు, నెల్లికుదురు ఎస్సై గోదరి రాజ్‌కుమార్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ సబ్సిడి గొర్లను అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తున్నారని పక్కా సమాచారం మేరకు స్థానిక ఎస్సై గోదరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు లారీలలో తరలిస్తున్న గొర్లను పట్టుకున్నారు. కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గొర్ల వ్యాపారి ముక్కెర లింగయ్య, కేసముద్రం మండలంలోని 11మంది దగ్గర 210 సబ్సిడీ గొర్లను కొనుగోలు చేశాడు. వీటిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలం బుధవాడకు చెందిన గొర్ల వ్యాపారులు గుండెబోయిన రామదాసు, ముప్ప స్వామి, సోమయ్యలకు విక్రయించాడు. ఈ క్రమంలో జగ్గయ్యపేటకు తరలిస్తున్న గొర్లను రెండు వాహనాలను పట్టుకొని సంబంధిత ముగ్గురు వ్యాపారులను సబ్సిడీ గొర్లను విక్రయించిన లబ్దిదారులు గంట కోమురయ్య,కోడినర్సయ్య,సుంకరబోయిన యాకయ్య,జి. యాకయ్య,నారబోయిన రామచంద్రు,కోడి వెంకటేష్, వీరయ్య,పొతరాజు వెంకన్నలతో పాటు లారీ డ్రైవర్లు ఎస్‌కె.మౌలాలీ, సిరంసెట్టి సాయిబాబాలను అరెస్ట్ చేసినట్లు వివరించారు.మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు తెలిపారు. చట్టవ్యతిరేఖ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్థికంగాఎదగాలని ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే దుర్వినియోగం చేయాలని చూస్తే సహించమన్నారు.



త్వరలో పార్టీ మార్పు

- ఉగాది తర్వాత కార్యాచరణ
- 2019 ఎన్నికలే చివరివి..
- ప్రస్తుతం బీజేపీలోనే ఉన్నా: నాగం



హైదరాబాద్, జనవరి 11(మనం న్యూస్): పార్టీ మారే విషయమై ఆలోచిస్తున్నట్లు బీజేపీ నేత నాగం జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీకి నాగం గుడ్‌బై చెప్పనున్నారనే ఊహాగానాల నేపథ్యంలో నాగం గురువారం నాడు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికలే తన చివరి ఎన్నికలని ప్రకటించారు. ప్రస్తుతం తాను బీజేపీలోనే ఉన్నానని, పార్టీ మారడంపై త్వరలో నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ఉగాది తర్వాత భవిష్యత్ కార్యచరణ గురించి ప్రకటిస్తానని చెప్పారు. బీజేపీపై కార్యకర్తలు, ప్రజలు అసంతృప్తితో ఉన్నారని నాగం తన మనసులోని మాట బయటపెట్టారు. పార్టీ మారాలని కార్యకర్తలు కోరుతున్నారని చెబుతూ.. వారి అభిప్రాయం ప్రకారం నడుచుకుంటానని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద అవినీతి కుటుంబం కేసీఆర్‌దేనని విమర్శించారు. ఎన్నికల వాగ్దానాలు ఏవీ కూడా కేసీఆర్ అమలు చేయలేదని, పంచాయతి ఎన్నికలు సకాలంలో జరపాలన్నారు.

పార్టీ మారడానికి కారణలేంటీ?

కీలకనేతగా ఉన్న ప్రతాపరెడ్డిని.. పార్టీలో చేరిన నాటి నుంచి ఇప్పటివరకు క్రియాశీలకంగా వినియోగించకోలేకపోవడంతో తనకూ అదే పరిస్థితి తప్పదని నాగం భావిస్తున్నట్లు సమాచారం.ప్రతిరోజూ నేతలపై, ప్రభుత్వంపై మీడియాలో విరుచుకుపడే నాగం.. బీజేపీ తీర్థం పుచ్చుకున్న నాటి నుంచి కెమెరా కంటికి చిక్కడం లేదు. సీనియర్ నేత కావడంతో.. బీజేపీలో తనకు మరింత గుర్తింపు వస్తుందని భావించిన నాగంకు పార్టీలో అనూహ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. టీఆర్ఎస్ సర్కారును, కేసీఆర్‌ను తన పదునైన మాటలతో ఇరుకుపెట్టాలనుకున్న నాగంకు.. బీజేపీ కళ్లెం వేసింది. పార్టీలో ఉన్నా.. ప్రయోజనం లేకపోయిందని నాగం భావించారు. దీనికితోడు సీనియర్ల తీరు, తనకు తగినంత ప్రాధాన్యం ఇవ్వకపోవడం ఆయనకు నచ్చలేదు. ఈ కారణాలతోనే పార్టీలో కొనసాగాలా? వద్దా? అనే విషయంలో కొంతకాలంగా సందిగ్ధంలో ఉన్నారు. గురువారం చేసిన వ్యాఖ్యలతో పార్టీ మారబోతున్నట్లు స్పష్టం అయింది. కాగా, బీజేపీకి నాగం గుడ్‌బై చెబితే తనతో పాటే మరికొందరు నేతలు రాజీనామా చేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు వినబడుతున్నాయి.

పయనమెటు?

పార్టీలో కొనసాగాలా వద్దా అనే విషయంపై నాగం తన అనుచరులతో సంప్రదింపులు జరిపారు. తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాంతో నాగం భేటి అయ్యారనే విషయం ఈ మధ్యే తెలిసింది. ఎన్నికల లోపు కోదండరామ్ పార్టీ పెడతారని, అందులో నాగం కీలకంగా ఉంటారనే ఊహాగానాలు మొదలయ్యాయి. అటు తర్వాత నాగంను పార్టీలోకి రావాల్సిందిగా పీసీసీ చీఫ్ ఉత్తమ్ ఆహ్వానించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో నాగర్‌కర్నూలు టిక్కెట్ కేటాయించడంతో పాటు, పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇచ్చే విషయమై హైకమాండ్‌కు సిఫార్సు చేస్తామని ఉత్తమ్ హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ మధ్యనే ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ నాగం జనార్దన్ రెడ్డి తమ పార్టీలోకి రానున్నారని అన్నారు. నాగం కూడా కాంగ్రెస్‌లో చేరితే టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించవచ్చుననే భావిస్తున్నట్లు సమాచారం. మరి నాగం 'చేయి' కలిపి కేసీఆర్‌తో కాలు దువ్వుతారో... కోదండరామ్‌తో జట్టు కట్టి.. ఛీత్కారం పొందిన చోటే జై కొట్టించుకుంటారో? తెలియాలంటే ఉగాది వరకు వేచి చూడాల్సిందే!

భాగ్యనగరంలో 'ప్రపంచ ఐటీ సదస్సు'

- నగరానికి గర్వకారణం: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 11(మనం న్యూస్): అంతర్జాతీయ సదస్సులు, సమావేశాలకు చిరునామాగా మారిన భాగ్యనగరం.. ఫిబ్రవరిలో మరో సదస్సుకు వేదికగా నిలువనుంది. వచ్చే నెల 19 నుంచి 21 వరకు 'వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ' (డబ్ల్యూసీఐటీ) నగరంలోని హైటెక్స్‌లో జరుగుతుంది. మన దేశంలో ఈ సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారి. దేశ, విదేశాల నుంచి 2500 ప్రతినిధులు హాజరుకానున్నారు. వరల్డ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ అలయెన్స్ (డబ్ల్యూఐటీఎస్ఏ), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్)లు సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహిస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా వ్యవహరిస్తుంది. డబ్ల్యూఐ టీఎస్ఏ, నాస్కామ్‌ల ప్రతినిధులతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ గురువారం సమావేశమ య్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రపంచ ఐటీ కాంగ్రెస్‌కు హైదరాబాద్‌ను ఎంపిక చేయడం గర్వకారణమని అన్నారు.

స్వీట్ ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 11(మనం న్యూస్): తెలంగాణ ప్రభుత్వం, సంక్రాంతి సందర్భంగా నగరవాసులను తియ్యని వేడుకతో పలకరించేందుకు సిద్ధమైందని మంత్రి చందూలాల్ అన్నారు. జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్‌కి సమాంతరంగా వరల్డ్ స్వీట్ ఫెస్టివల్‌ని కూడా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. సచివాలయ సమావేశ మందిరంలో గురువారం నాడు మంత్రి చందూలాల్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు.

మందకృష్ణను పరామర్శించిన సండ్ర

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను టీడీపీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్రజాస్వామిక విధానాలకు వ్యతిరేకంగా గళం విప్పిన వారిపై ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ కోసం శాంతియుతంగా పోరాడుతున్న మందకృష్ణను నిర్బంధించడం సరికాదని సండ్ర విమర్శించారు.



తెలుగు రాష్ట్రాల్లో 'మనం'కు ప్రజాదరణ

- **'మనం' 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే హన్మంత్‌షిండె**

వేంసూరు, జనవరి 11 (మనం న్యూస్): తెలుగు రాష్ట్రాల్లో మనం దిన పత్రిక ప్రజాదరణ పొందుతోందని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా వేంసూరు మండలం కందుకూరులో గురువారం ఆయన మనం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడంలో మనం పత్రిక ముందుందన్నారు. జనం సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించే విధంగా మనం దినపత్రిక వారధిగా పని చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి, జెడ్పీ చైర్‌పర్సన్ గడిపల్లి కవిత, టీఆర్‌ఎస్ సత్తుపల్లి నాయకులు మట్టా దయానంద్, వేంసూరు విలేకరి కె.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ప్రజాస్వామ్యంలో పత్రికలు కీలకం..

నిజామాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర కీలకమని కామారెడ్డి జిల్లా జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండె అన్నారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్‌కుంద మండల కేంద్రంలోని ఆయన స్వ గృహంలో గురువారం జరిగిన కార్యక్రమంలో మనం 2018 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలను, ప్రజల మనో భావాలను పత్రికలు వెలుగులోకి తీసుకువస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ చైర్మన్ రాజు, పెద్దదేవాడ ఎంపీటీసీ సభ్యుడు మల్లిఖార్జున్, మండల జాగృతి అధ్యక్షుడు ఎన్‌ఎం. బాల్‌రాజు, టీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎం.హన్మాండ్లు, మనం సిబ్బంది పల్నాటి చంటి, సీ.రాజశేఖర్, పి.లక్ష్మణ్‌రావు, మక్సూద్ అలీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రయోగశాలలకు ప్రాధాన్యమివ్వండి

- **వాటితోనే విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి**
- **ఉన్నత విద్యా మండలి చైర్మన్‌తో గవర్నర్**
- **టీఎస్‌సీహెచ్‌లో ఆన్‌లైన్ ప్రవేశాలకు నిర్ణయం**

హైదరాబాద్, జనవరి 11(మనం ప్రతినిధి): విద్యార్థులు తమ ఆలోచనలను పరీక్షించుకునేందుకు మంచి ప్రయోగశాలలను అందివ్వాలని గవర్నర్ నరసింహన్ సూచించారు. అలా చేస్తేనే వారిలోని ప్రతిభ వెలుగులోకి వస్తుందని చెప్పారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి ఆధ్వర్యంలో టీఎస్‌సీహెచ్‌ఈ ప్రతినిధులు గవర్నర్‌ను కలిశారు. ఉన్నత విద్యా వ్యవస్థలో విద్యార్థుల మధ్య సమానత్వం, ఉపాధి కల్పన, నూతన ఆవిష్కరిణలను ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి గవర్నర్‌కు వివరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్(పీజీసెట్) మినహా ఏడు కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లకు ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఫలితంగా తెలంగాణలోని విద్యావ్యవస్థను జాతీయ స్థాయిలో నిలపొచ్చని, ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుకూలంగా నిలబడుతుందని చైర్మన్ పాపిరెడ్డి గవర్నర్‌తో అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అనంతరం గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ప్రవేశాలకు అవసరమయ్యే డిజిటల్ టెక్నాలజీ, ఇంటర్‌నెట్ వంటి సదుపాయాలను కళాశాలలకు కల్పించాలన్నారు. అందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందించే నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని చెప్పారు. ఎంహెచ్‌ఆర్డీ ద్వారా అందించే డిజిటల్ ఇనిషియేటివ్స్ ప్రయోజనాలను కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పొందాలని పేర్కొన్నారు. అనంతరం 'టూరిజం, హాస్పిటాలిటీ'పై వి.వెంకటరమణ రచించిన 'పారాడైమ్స్' పుస్తకాన్ని గవర్నర్ ఆవిష్కరించారు. పర్యాటక ప్రదేశాలపై మరింత పరిశోధన జరపాలని గవర్నర్ సూచించారు. విదేశాలల్లో ఉత్తమ కోర్సులుగా విరాజిల్లుతున్న వాటిని ఇక్కడ ప్రవేశపెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ఆర్.లింబాద్రి, ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాసరావు, వి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మేడారం ప్రత్యేక అధికారిగా కరుణ

- **పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి : ఎస్పీ సింగ్**



హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మేడారం జాతర ఏర్పాట్లపై సీఎస్ సమీక్షించారు. దీనికి మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అరవింద్ కుమార్, పర్యాటక, సాంస్కృతిక కార్యదర్శి బుర్ర వెంకటేశం, దేవాదాయశాఖ కమిషనర్ శివశంకర్, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ, నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. జనవరి 31 నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చూడాలని, కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయాలన్నారు. అంతర్జాతీయ చానళ్లు, బ్లాగులు, సోషల్ మీడియాను విరివిగా వినియోగించుకోవాలని, జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. విదేశీ యాత్రికుల కోసం అత్యున్నత సదుపాయాలతో పాటు ప్రత్యేక బస ఏర్పాట్లను చేయాలన్నారు. ముఖ్యంగా సాంస్కృతిక శాఖలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి, జాతర కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. గతంలో వరంగల్ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కరుణను జాతర కోసం ప్రత్యేక అధికారిణిగా నియమిస్తూ ఉత్తర్వులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ జాతరకు దేశంలోని అన్ని రాష్ట్రాల గిరిజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రులను, సెక్రటరీలను, గిరిజన పార్లమెంట్ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానించాలని ఆదేశాలు చేశారు.

'ప్రైవేట్' ఆగడాలు అరికట్టాలి

- **నిబంధనలకు విరుద్ధంగా నడిచే బస్సులపై చర్యలు**
- **టికెట్ ధరలు పెంచితే చర్యలు: శ్రీనివాస్‌గౌడ్**

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రైవేట్ బస్సు యాజమాన్యాల ఆగడాలు ఇక సాగవని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పండగ సందర్భంగా తెలంగాణ నుంచి ఆంధ్రకు, హైదరాబాద్ నుంచి తెలంగాణలోని దూర ప్రాంతాలకు ప్రజలు పయనమవుతారని, దీనిని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ బస్సులు అధిక రేట్లు పెంచి ప్రయాణికులను దోచుకుంటున్నారని ఆరోపించారు.నిబంధనలకు విరుద్ధంగా బస్సులను నడిపించడంతోపాటు 700 రూపాయల టిక్కెట్టుకు రూ.2000పైగా పెంచుతున్నారని పేర్కొన్నారు. దీంతో సామాన్య ప్రజల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు, అయినా ప్రైవేట్ బస్సుల ఆగడాలను అరికట్టడంలో అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శించారు.

రైతు సమస్యలపై సమరం

- 17న జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలు
- జిల్లాల వారీగా రైతు సదస్సులు
- స్పీకర్‌కు విజ్ఞాపనలు: కాంగ్రెస్



హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17న జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలను సమర్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ అనుసబంధ కిసాన్ మజ్దూర్ సంఘ్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమాశానికి సంఘ్ రాష్ట్ర చైర్మన్ కోదండరెడ్డి, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. అనంతరం పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ... టీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు, వడ్డీ చెల్లింపుపై తమ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి త్వరలో స్పీకర్‌కు వినతి పత్రాలు సమర్పించనున్నట్టు చెప్పారు. జిల్లాల వారీగా రైతు సదస్సులను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వివరిస్తూ రైతులను చెతన్య పర్చనున్నట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించిన ఆర్మూర్ డిక్లరేషన్‌ను రైతులకు వివరించనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని 570 మండలాల్లో కిసాన్‌సంఘ్ కమిటీలను రెండు వారాల్లో వేయనున్నట్టు తెలిపారు. రైతులకు రుణమాఫీ దశలవారీగా చేయటం వల్ల డబ్బులు వడ్డీకే సరిపోయా యని విమర్శించారు. వడ్డీ డబ్బులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాల పరిస్థితి అంచనా వేయకుండా 24 గంటల కరెంటు సరఫరాతో రైతులకు ఏం లాభమన్నారు. మూడున్నరేండ్లలో రైతుల ఆత్మహ త్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర అడిగిన రైతులకు బేడీలు వేసిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ నిత్యం పోరాడుతుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జీవన్‌రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

'మునిసిపాలిటీల్లో గ్రామాల విలీనం వద్దు'

- **ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పబడుతున్న ఎమ్మెల్యేలు**
- **అనుచరగణంతో కేసులు వేయించేందుకు యత్నం**
- **గ్రామాలపై పట్టుపోతుందని నేతల ఆందోళన**

హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): హైదరాబాద్ శివారులోని కొన్ని గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేయనున్న మున్సిపాలిటీల్లో విలీనం చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా అధికార పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యే పావులు కదుపుతున్నారు. ఆయా ఎమ్మెల్యేలు తమ అనుచరులైన సర్పంచ్‌లతో కోర్టును ఆశ్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసే మున్సిపాలిటీల్లో శివారు గ్రామాలను విలీనం చేస్తే తమ పట్టు సడలుతుందనే ఉద్దేశ్యంతోనే ఆయా ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు తెరవెనుక పావులు కదుపుతున్నారని తెలిసింది. తమ పేరు బహిర్గతం అయితే సీఎం కేసీఆర్‌తో ఇబ్బంది కలుగుతుందనే ఆలోచనతో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, తమ సర్పంచ్‌లతోపాటు ప్రతిపక్ష పార్టీలకు చెందినవారితో కోర్టుకు వెళ్లేందుకు సూచనలిస్తున్నట్టుగా సమాచారం. కాగా గ్రామాల విలీనానికి ఇప్పటికే ప్రభుత్వం రంగం సిద్ధం చేసినట్టుగా తెలిసింది. నగర శివారులోని గ్రామాల్లో భూ క్రయవిక్రయాలు ఇన్నాళ్లు ఎమ్మెల్యేల అండతో సర్పంచ్‌ల ద్వారానే పూర్తి జరిగేవి. దీంతో భారీగా డబ్బు వచ్చేది. మున్సిపాలిటీల్లో ఈ గ్రామాల విలీనం జరిగితే తమకు వచ్చే ఆదాయానికి గండి పడడంతో పాటు ప్రజల్లో పట్టు పోతుందనే భయం ఎమ్మెల్యేలను వెంటాడుతోంది. దీంతో గ్రామాల విలీనాన్ని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారు.

ఆ నలుగురు వస్తేనే...!

- **పీసీసీ లేదా సీఎల్పీ నేతలు వస్తే రెడీ**
- **రేవంత్ రెడ్డితో చర్చలకు నో: టీఆర్‌ఎస్**



హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రత్యేక ప్రతినిధి): విద్యుత్ విషయంలో బహిరంగ చర్చకు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానారెడ్డి, షబ్బీర్ అలీ, జీవన్ రెడ్డి మాత్రమే వస్తే తాము బహిరంగ చర్చలో పాల్గొంటామని టీఆర్‌ఎస్ స్పష్టం చేసింది. రేవంత్‌కు విశ్వసనీయత లేదని, అందుకే ఆయనతో తాము బహిరంగ చర్చకు తాము దూరమని ప్రకటించింది. గురువారం టీఆర్‌ఎస్‌ఎల్పీలో టీఆర్‌ఎస్ ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడి, భానుప్రసాద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని, ఓటుకు నోటు కేసులో నోట్ల కట్టలతో అడ్డంగా దొరికిపోయారని బాల్క సుమన్ ఆరోపించారు. అలాంటి వ్యక్తి నిన్నటి వరకు టీడీపీలో ఉన్నాడని, ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. మరోనేత టీఆర్‌ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌లో చేరారని చెప్పారు. అలాంటి వారికి కాంగ్రెస్‌లో ఎలాంటి స్థాయి ఉండదని, అలాంటి వారితో తాము చర్చలు జరపబోమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే తన రాజీనామాలను స్పీకర్‌తో ఆమోదింపజేసుకోవాలని సవాల్ విసిరారు. బహిరంగ చర్చలకు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా సిద్ధమని ప్రకటించారని, అసలు చర్చకు ఎవరు వస్తారో కాంగ్రెస్ నేతలు తేల్చుకోవాలని పల్లా రాజేశ్వరరెడ్డి పేర్కొన్నారు. కరెంట్ విషయంలో కోమటి రెడ్డి చేసిన ఆరోపణలు ఏమాత్రం నిజం కావని అన్నారు. తమతో చర్చకు ఉత్తమ్ కుమార్‌రెడ్డి వస్తే సరేనని అన్నారు. సీఎం కేసీఆర్ చర్చకు రావాలని డిమాండ్ చేస్తే తాము కూడా కాంగ్రెస్ అధిష్ఠానం చర్చకు రావాలని అంటామని అన్నారు. దేశ వ్యాప్తంగా రెండున్నర రూపాయలకు యూనిట్ విద్యుత్ ఎంతంటే అంత దొరుకుతుందనే వారి మాటలు... నేతి బీర కాయలో నెయ్యి లాంటిదేనని ఎద్దేవాచేశారు. విద్యుత్ ఒప్పందాలనేవి అప్పటికపుడు చేసుకునేవి కావని హితవు పలికారు. కాంగ్రెస్, టీడీపీ హాయంలో ఇబ్బడి ముబ్బడిగా గ్యాస్ ఆధారిత విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకున్నరని తీవ్రంగా మండిపడ్డారు.

తోక ముడిచారు: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ : విద్యుత్ కొనుగోళ్లు, ఒప్పందాల విషయంలో బహిరంగ చర్చకు సవాల్ చేసిన అధికార టీఆర్‌ఎస్ నేతలు మరుక్షణమే తోక ముడిచారని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపించారు. విద్యుత్ రంగంపై అవాస్తవాలు మాట్లాడుతున్నామని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని టీఆర్‌ఎస్ నేతలు సవాల్ విసిరారని గురువారం ఓ ప్రకటనలో రేవంత్ పేర్కొన్నారు. టీఆర్‌ఎస్ నేతల సవాల్‌ను హుందాగా స్వీకరించామని తెలిపారు. సవాల్ విసిరిన మరునాడే తోక ముడిచారని ఆరోపించారు.

కాంగ్రెస్‌లోకి గుర్నాథరెడ్డి

హైదరాబాద్ : కొడంగల్‌లో టీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుతం టీఆర్‌ఎస్‌లో ఉన్న గుర్నాథరెడ్డి త్వరలో కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించారు. సంక్రాంతి తరువాత పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ మేరకు రేవంత్‌రెడ్డితో సమాలోచనలు జరిపారు. టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే టికెట్ తన కుమారుడికి ఇచ్చే అవకాశం లేకపోవడంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

యాదాద్రి ప్లాంట్‌లో స్కాం


- 24 గంటల విద్యుత్‌లో మోసం
- కుంభకోణంపై సీఎంతో చర్చకు సిద్ధం
- తప్పయితే రాజకీయాలకు గుడ్‌బై: కోమటిరెడ్డి



హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్‌లో పక్కాగా స్కామ్ జరిగిందని సీఎల్పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. రైతులకు 24 గంటల విద్యుత్‌లోనూ మోసం దాగి ఉందని పేర్కొన్నారు. ఈ కుంభకోణంపై చర్చకు ఎవరు వచ్చినా, ఎక్కడికి వచ్చినా తాను సిద్ధమని ప్రకటించారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఈ కుంభకోణంపై విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డితో తాను చర్చించబోనని, పవర్‌లేని మినిష్టర్‌తో తనకు అవసరం లేదని అన్నారు. తన ఆరోపణలు తప్పని తేలితే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని, స్పీకర్‌కు నేరుగా రాజీనామా అందజేస్తానని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. ఈ స్కామ్ విషయాన్ని సీఎం కేసీఆర్ బహిర్గతంగా ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఇకనైనా మోసాలు ఆపాలని అన్నారు. యాదాద్రి ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి రూ.32 వేల కోట్ల పనులను నామినేషన్‌పై ఇచ్చారని, దీనిపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా అనుమానాలు వ్యక్తం చేశారని చెప్పారు. బీహెచ్‌ఈఎల్‌కు 16 వేల కోట్ల పనులే ఇచ్చారని పేర్కొన్నారు. సోలార్ ప్రాజెక్టుల నిర్మాణానికి హడావిడిగా టెండర్లు పిలిచారని, అధికారులు వద్దన్న సంస్థకే సీఎం ఆ టెండర్లు ఖరారు చేశారని చెప్పారు. ఈ ఒప్పందం వల్ల 4 వేల కోట్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్లతో ప్రజలపై మరో 4 వేల కోట్లు పడనుందని అన్నారు. కుంభకోణాల విషయంలో జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకరరావుతో తాను చర్చకు సిద్ధమని పేర్కొన్నారు.

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటు

- **28 పార్టీలు సహా, ప్రజా సంఘాల కలయిక**
- **సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధే అజెండా**
- **చైర్మన్‌గా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా తమ్మినేని**
- **వచ్చే ఎన్నికల్లో 119 స్థానాల్లో పోటి చేస్తాం**
- **విధివిధానాలపై 25న బహిరంగ సభ**



హైదరాబాద్, జనవరి 11 (మనం ప్రతినిధి): సామాజిక న్యాయం సమగ్ర అభివృద్ధి అజెండాగా, 28 రాజకీయ పార్టీలు సహా ప్రజా, మహిళా సంఘాల కలయికతో బహుజన లెఫ్ట్ ఫ్రంట్(బీఎల్‌ఎఫ్) ఏర్పాటు చేస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. బీఎల్‌ఎఫ్ ఏర్పాటుకు సంబంధించి టీ మాస్ నేత, ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆయా పార్టీల నేతల సన్నాహక సమావేశం జరిగింది. బహుజన రాజ్యాధికార పార్టీ నేత నల్లా.సూర్యప్రకాశ్ బీఎల్‌ఎఫ్ చైర్మన్‌గా, తమ్మినేని వీరభద్రం కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని, రాజకీయ అధికారాన్ని మార్చేందుకే బీఎల్‌ఎఫ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా.. కార్పొరేట్లకు, సంపన్నులకు కొమ్ముకాస్తున్నాయని, ఆ విధానాన్ని మార్చడమే ఫ్రంట్ లక్ష్యమని తెలిపారు. పుష్కలంగా సహజవనరులు, మానవ వనరులు ఉన్నా తెలంగాణ అగ్రకుల పాలనలో ఏండ్లుగా వెనుకబాటుతనానికి గురయిందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే జీవితాలు మారుతాయనుకున్న ఆశలు ఇప్పుడు ఆవిరవుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడి మూడున్నరేండ్లైనా అదే అగ్రకుల పోకడ, అప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందని, ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులే నేటికీ ఉన్నాయని తమ్మినేని దుయ్యబట్టారు. 2019 ఎన్నికల్లో బీఎల్‌ఎఫ్ ద్వారా 119 స్థానాల్లో పోటీ చేసి అధికారాన్ని అన్ని వర్గాలకూ చేరువ చేస్తామని ఆశాభావం వ్యక్తంచేశారు. 93 శాతం ఉన్న బహుజనులను అధికారంలోకి తీసుకొచ్చేందుకు చేస్తున్న ఈ ప్రయత్నంలో సీపీఐ, న్యూడెమోక్రసీ, ఇతర వామపక్ష, లౌకిక శక్తులు తమతో కలిసిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించి, బీఎల్‌ఎఫ్ విధివిధానాలను ప్రజలకు తెలియజేస్తామని తమ్మినేని తెలిపారు. ఈ సభకు సీతారాం ఏచూరి, అంబేద్కర్ మనవడు, దళిత నేత ప్రకాశ్ అంబేద్కర్ వంటి ప్రముఖులు హాజరవుతారని అన్నారు. తెలంగాణ కోసం కొట్లాడిన దళిత బహుజనులకు రాజకీయ, సామాజిక న్యాయం దక్కడం లేదని కంచ ఐలయ్య అన్నారు. టీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా సీపీఐ(ఎం) కృషితో ఏర్పాటైన బీఎల్‌ఎఫ్‌కు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వంలో ఉన్న వారందరూ ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాల్లోని వారేనని.. పార్టీ జెండాలు తప్ప వ్యక్తులు, వ్యవస్థ మారలేదని బీఎల్‌ఎఫ్ చైర్మన్‌గా ఎన్నికైన నల్లా సూర్యప్రకాశ్ విమర్శించారు. ఆ వ్యవస్థను మార్చేందుకే బీఎల్‌ఎఫ్‌ను ఏర్పాటు చేశామన్నారు. కొత్త నాయకత్వం, కొత్త పంథాతో వస్తున్న బీఎల్‌ఎఫ్‌ను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. బీఎల్‌ఎఫ్‌లో మహిళలకు సమున్నత స్థానం కల్పిస్తామని ఎంజేఎస్ పార్టీ నేత వనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయకుడు గద్దర్, వివిధ పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..


శుక్రవారం, జనవరి 12

ప్రక్షాళన పటాలం!


పాప ప్రక్షాళన తీర్థమైన గంగానది కాలుష్య ప్రక్షాళనం వివాదాస్పదంగా మారింది. యాభై కోట్ల మంది జీవనానికి వనరుగా ఉన్న గంగా నది నేడు హిందూ పురాణాలలో వర్ణించినట్లు నరకలోకంలోని చీము, రక్తం కలగలసి ప్రవహించే వైతరణి నదిలా ప్రాణాంతక కాలుష్య కాసారంగా తయారైంది. ఈ నేపథ్యంలో మందగమనంలో నడుస్తున్న మందాకిని కాలుష్య ప్రక్షాళన కార్యక్రమంపై కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక మూడు వారాల క్రితం తప్పుపట్టిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సైనిక బలగాల్ని వినియోగించాలని నిర్ణయం తీసుకుంది. గంగానది ప్రక్షాళన యుద్ధ ప్రాతిపదిక మీద చేపట్టాలని వస్తున్న డిమాండ్‌కు స్పందనగా కేంద్ర ప్రభుత్వం యుద్ధమే చేస్తున్నట్లుగా సైనిక బలగాలను నియమించడం విడ్డూరమనిపిస్తోంది. 'గంగ పునరుద్ధరణ కార్యకలాపాలు, కర్తవ్యాల' నిర్వహణ కోసం టెరిటోరియల్ ఆర్మీ బెటాలియన్ (ప్రాదేశిక సైనిక పటాలం–టీఏబీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మాజీ సైనికులతో ఏర్పాటయ్యే ఈ పటాలం గంగా నదిలోని కాలుష్య స్థాయిలపై నిరంతరం నిఘా ఉంచుతుంది. అదే సమయంలో ప్రభుత్వ కాలుష్య నియంత్రణ కార్యకాలాపాలకు సహకరిస్తుంది. ఘాట్‌ు కలుషితం కాకుండా పర్యవేక్షిస్తున్న పోలీసు, స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి ఆసరాగా ట్యాబ్ నిలుస్తుంది. అయితే పర్యావరణవేత్తలు, కాలుష్య నియంత్రణ నిపుణుల ద్వారా చేపట్టవలసిన గంగానది ప్రక్షాళన కార్యకలాపానికి సైన్యాన్ని వినియోగించడం ఎంతమేరకు సమంజసం?

గంగ, దాని ఉపనది యమున కలసి ప్రవహిస్తున్న విశాలమైన 'గంగా–యమునా మైదానం' ఉత్తర భారతదేశం, బంగ్లాదేశ్‌లలో విస్తరించి ఉంది. మొత్తం ప్రపంచ జనాభాలో 8.5 శాతం ప్రజలకు (ప్రతి 12 మందిలో ఒకరికి) ఆవాసంగా ఉన్న ఈ మైదానం తీవ్ర కాలుష్యంలో కూరుకుపోయింది. దాంతో జనావాసాలు, పరిశ్రమలు, వ్యవసాయ కార్యకలాపాల నుంచి వెలువడే వ్యర్థాల మూలంగా గంగానదీ జలాలు విషపూరితంగా మారాయి. నీటి వనరులను కలుషితం చేస్తున్న వివిధ కారణాలను నిరోధించకుండా, నదుల ప్రక్షాళనా కార్యక్రమాలు కేవలం జనాకర్షక పథకాలుగానే మిగులుతాయి. గంగా నది ప్రక్షాళన కేవలం గంగా నదికి మాత్రమే పరిమితం కాకూడదు. గంగా యమునా మైదానంతో అనుబంధితమైన మానవకార్యకలాపాలన్నిటిని పరిగణనలోకి తీసుకొని విశాల ప్రాతిపదికపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలి. కాన్పూర్ వంటి నగరాలలోని రసాయనిక పరిశ్రమలు, తోలు పరిశ్రమలకు తోడు జనావాసాల నుంచి విడుదలవుతున్న కాలుష్య వ్యర్థ జలాలు రోజుకు 120 కోట్ల లీటర్లు గంగా బేసిన్‌లో కలుస్తున్నట్లు నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా (ఎన్ఎమ్‌సీజీ) వెబ్‌సైట్ తెలియజేస్తోంది. నదిలో కలుస్తున్న మొత్తం మురుగులో కేవలం మూడవవంతు మాత్రమే శుద్ధి అవుతోంది. అయితే ఈ కాలుష్య వ్యర్థాలు అంచనాలకు మించి ఉండే అవకాశమూ లేకపోలేదు. ఎందుకంటే, హరిద్వార్, వారణాసి, కాన్పూర్ వంటి నగరాలలోని అనేక ప్రాంతాల నుంచి వస్తున్న కాలుష్యం మురుగు కాలువల నెట్‌వర్క్ పరిధికి వెలుపలే ఉన్నాయి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు చాలా వరకు ఈ కాలుష్యాన్ని నియంత్రించగలిగే అవకాశమున్నప్పటికీ, ప్రభుత్వం వైపునుంచి అలాంటి కార్యచరణ ప్రణాళికలేవీ అమలు కాకపోవడం దురదృష్టకరం. 2500 కిలోమీటర్లు సాగే గంగా నదీ ప్రవాహంపై 40 డ్యాంలు, ఆనకట్టలు కట్టి సాగు, తాగనీరు మౌలిక సదుపాయాలను కల్పించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురుగు నీటి నియంత్రణ ప్రణాళికను నిర్లక్ష్యం చేయడం శోచనీయం.

గంగా నది ప్రక్షాళన ఫేజ్–1 కార్యక్రమం 1985లో మూడు రాష్ట్రాల్లోని 25 నదీ పరివాహక పట్టణాల పరిధిలో దాదాపు రూ.863 కోట్ల వ్యయ అంచనాలతో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రస్తుతం ఫేజ్–2 ప్రక్షాళన కార్యక్రమం అయిదు రాష్ట్రాల్లోని 59 పట్టణాల్లో రూ. 505 కోట్లకు పైగా వ్యయ అంచనాతో మోదీ ప్రభుత్వం ప్రారంభించింది. అయితే యమున, గోమతి, దామోదర్, మహానంద నదులకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు ఉన్నాయి. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ స్వప్నమైన 'నమామి గంగే' ప్రాజెక్టు కోసం కేంద్రం రూ. 20వేల కోట్లు కేటాయించగా, మురుగు నియంత్రణ, వ్యర్థ జలాల నియంత్రణ, జీవవైవిధ్య పరిరక్షణ, పొడి చెత్త నియంత్రణ, అడవుల పెంపు, గ్రామీణ పారిశుధ్యం వంటి పథకాల కోసం ఎన్ఎమ్‌సీజీ రూ.17వేల కోట్లు కేటాయించింది. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో గంగా నది ప్రక్షాళన కోసం కేటాయించిన నిధుల్లో నాలుగవ వంతు కూడా ఖర్చు కాకపోవడంపై కాగ్ తప్పుపట్టడంతో ఆ ప్రాజెక్టు అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధిపై సందేహాలు వస్తున్నాయి. అందుకు ప్రతిస్పందనగా ప్రాంతీయ సైన్యాన్ని వినియోగించాలని కేంద్రం నిర్ణయాన్ని పర్యావరణ వేత్తలు విమర్శిస్తున్నారు. అటవీ ప్రాంతాల పునరుజ్జీవనంలో గతంలో సైన్యం నిర్వహించిన పాత్ర గణనీయ మైనదే అయినప్పటికీ, మురుగు నియంత్రణ వ్యవస్థల సంస్కరణ వంటి అనేక నిర్మాణాత్మక అడ్డంకుల్ని పరిష్కారించాలని కాగ్ సూచించిన సందర్భంలో సైన్యం పాత్రపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలి.



మంచిమాట



'పని మొదలుపెడితే ఆపొద్దు. మధ్యలో వదిలిపెట్టొద్దు. ఫలితం గురించి ఆలోచించకుండా పూర్తిచేయడమే మనిషి పని'

- చాణుక్యుడు

ఆర్థిక ప్రగతికే ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లు

భారత ఆర్థిక వ్యవస్థలో బ్యాంకుల పాత్రను భారతీయ కుటుంబ వ్యవస్థలోని గృహిణితో పోల్చవచ్చు. కుటుంబ నిర్మాణంలో గృహిణి ఎలాగైతే తమ కుటుంబ మిగులు ఆదాయాన్ని సంపదగా మారుస్తుందో బ్యాంకులు కూడా ప్రజల మిగులు సొమ్మును సేకరించి ఉత్పాదక రంగాల వారికి అప్పులు ఇవ్వడం ద్వారా సంపదను సృష్టించే ప్రక్రియలో వారధులుగా ఉంటాయి. 2008లో ప్రపంచమంతా అమెరికా బ్యాంకుల దివాలా వల్ల ఆర్థిక మందగమనంలోకి కూరుకుపోయినా మనదేశపు బ్యాంకులు ఏ మాత్రం ప్రభావితం కాలేదు. అప్పుడే అందరికీ అర్థమైంది. వ్యవస్థీకృతంగా మన బ్యాంకింగ్ వ్యవస్థ ఎంత పటిష్టమైనదో. ఈ ఒరవడిని కొనసాగించడంలో కేంద్ర బ్యాంక్ అయిన ఆర్‌బీఐ పెద్దన్న పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. అయితే ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. బ్యాంకుల అసమర్థ యాజమాన్య విధానాలు, లంచగొండితనం, రుణాల మంజూరులో రాజకీయ నాయకుల మితిమీరిన జోక్యం కొందరు పారిశ్రామిక వర్గాలకు వరంగా మారింది. లేని సెక్యూరిటీలను సృష్టించి బ్యాంకుల దగ్గర రుణాలు పొంది తర్వాత బ్యాంకులకు టోకరా వేస్తున్న విజయ మాల్యాలు ఎంతోమంది తయారవుతున్నారు. ఈ రుణాలు చివరకు నిరర్థక ఆస్తులుగా మారి బ్యాంకుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. తద్వారా ఆర్థిక వ్యవస్థ పునాదులకు బీటలు వేస్తున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటురంగ బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల విలువ జూన్ 2016 నాటికి రూ.6 లక్షల కోట్లకు చేరిందంటే పరిస్థితి ఎంత జటిలంగా ఉందో అర్థంచేసుకోవచ్చు.

దేశ ఆర్థిక వ్యవస్థనే డోలాయమానంలో పడేస్తున్న నిరర్థక ఆస్తుల విషయంలో గత ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకున్నప్పటికీ అవేవీ అనుకున్న ఫలితాలను ఇవ్వలేదు. కేంద్ర బ్యాంక్ ఆర్‌బీఐ డిపాజిట్‌దార్ల సంక్షేమానికి, ప్రభుత్వ రంగ బ్యాంకుల పరిపుష్టికి ఎన్నో చర్యలు చేపడ్తున్నప్పటికీ అవేవీ కార్యరూపం దాల్చడం లేదు. దీనికి ప్రదాన కారణం తమ సంస్థల అభివృద్ధిలో ప్రైవేటు బ్యాంకుల యాజమాన్యాలకు ఉన్న చిత్తశుద్ధి ప్రభుత్వ బ్యాంకుల యాజమాన్యా లకు లేకపోవడమే అని భావించవచ్చు. చట్టాలలో ఉన్న లోపాలను ఆసరాగా చేసుకొని సరైన సెక్యూరిటీలు లేకుండా బ్యాంకులు అప్పులు ఇచ్చి నిరర్థక ఆస్తులను గుట్టలుగా పేరుస్తున్నాయి. నిరర్థక ఆస్తుల సమస్య బ్యాంకుల మనుగడకు ఆశనిపాతంగా మారింది. ఈ సమస్యలకు పరిష్కార మార్గంగా వస్తున్న నూతన ఆర్థిక సంస్కరణ ఫైనాన్షియల్ రీ సొల్యూషన్ అండ్ డిపాజిట్ ఇన్సూరెన్స్ (ఎఫ్‌ఆర్‌డీఐ) బిల్ 2017. 2014 లో నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు సంస్కరణల శకం ప్రారంభమైందని చెప్పవచ్చు. మొన్నటి సంస్కరణ డీమానిటైజేషన్ కావొచ్చు, నిన్నటి సంస్కరణ జీఎస్‌టీ కావొచ్చు, ప్రతిపక్షాల విమర్శల తప్పట్లకు తాళాలు అందించాయి. ఏది ఏమైనప్పటికీ పూర్వపు చట్టాల బూజును దులపాల్సిన గురుతర బాధ్యత మెజారిటీ సభ్యులు గల ప్రభుత్వాన్ని నడుపుతున్న ప్రస్తుత ప్రభుత్వానికి ఎంతైనా ఉంది. అయితే ఇప్పటివరకు మన దేశంలో ఆర్థిక సంస్థల సంక్షోభ నివారణకి సంబంధించిన వ్యూహాత్మక విధానమేది లేదు.

ముందుగా మనం ఇప్పుడున్న విధానాల గురించి కొంత తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటివరకు బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థల దివాలాకు సంబంధించిన విధివి దానాలను ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ లాంటి కేంద్ర సంస్థలు చూసుకొనేవి. ఆర్‌బీఐ అనుబంధ సంస్థ అయినటువంటి డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) లక్ష రూపాయల వరకు బ్యాంకు డిపాజిట్‌లకు బీమా సదుపాయం కల్పించేది. అయితే ఒక వ్యక్తికి వివిధ బ్యాంకులలో అనేక ఖాతాలు ఉన్నప్పటికీ ఒకే బ్యాంకులో ఒకే ఖాతా ద్వారా మాత్రమే ఈ బీమా సొమ్మును పొందుతాడు.



> సామాన్య ప్రజలకు బహుళ ప్రయోజనాలు కల్గించే ఇలాంటి బిల్లుల విషయంలో రాజకీయ పార్టీలన్నీ తమ ద్వంద్వవైఖరిని వీడి సమష్టిగా చర్చించి తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి నాంది పలకాలి.

ఇప్పుడు ప్రతిపాదిస్తున్న ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లులో రుణ హామీ బాధ్యతను డీఐసీజీసీ స్థానే రీ సొల్యూషన్ కార్పొరేషన్ అనే ఒక సంస్థను స్థాపించి దానికి బదలాయిస్తున్నారు. ఈ రీ సొల్యూషన్ కార్పొరేషన్ ఆర్థిక సంస్థల పనితీరును గమనిస్తూ, రిస్క్‌ను మదింపు చేస్తూ నష్టనివారణకు ముందస్తు చర్యలను ప్రతిపాదిస్తుంది. ఈ రీసొల్యూషన్ ఆర్థిక సంస్థల వైఫల్య ప్రమాదం ఆధారంగా సంస్థలను కేటగిరీలుగా విభజిస్తుంది. వైఫల్య ప్రమాదం ఎక్కువగా ఉన్న ఆర్థిక సంస్థలను రీసొల్యూషన్ కార్పొరేషన్ తన ఆధీనంలోకి తీసుకుని నష్ట నివారణ చర్యలు చేపడుతుంది. ఈ విధానాన్ని అమెరికాలాంటి దేశం కూడా అమలుపరుస్తుంది. ఎఫ్‌డీఐసీ అనే సంస్థ బ్యాంకుల ఆర్థిక పరిస్థితుల్ని విశ్లేషించే ప్రత్యేక సంస్థ. ఇది అమెరికా కేంద్ర బ్యాంకు అయినటువంటి ఫెడరల్ రీసర్వ్‌కి అతీతంగా ఏర్పడ్డదే.

దివాలా విధానానికి సంబంధించిన ఖర్చు, సమయం ఆదా చేయడం, సరైన ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా, మందగమన సమయంలో సరైన విధానాలు పాటించడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని సాధించడం, సులభంగా రుణాలు పొందడం ద్వారా వ్యాపారం చేసే సౌలభ్యం పెంపొందించడం, బ్యాంకు రుణాలు సామాన్య ప్రజలకు అందించడం ద్వారా ఆర్థిక ప్రగతిలో సామాన్యులను భాగస్వాములను చేయడం, తద్వారా రుణ పరిధి పరిశ్రమల సంఖ్య వృద్ధి చెంది, నూతన అవకాశాలు సృష్టించడం ద్వారా ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి రేటును పెంచడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం.

అయితే ఇప్పుడు జరుగుతున్న చర్చంతా సెక్షన్ 52 ద్వారా ప్రతిపాదించిన బైల్ ఇన్ క్లాజ్‌తోనే అని చెప్పవచ్చు. ఈ క్లాజ్ ద్వారా బ్యాంకులు ఎప్పుడైనా విలీనం, లిక్విడేషన్‌కి వెళ్ళినప్పుడు డిపాజిట్‌దార్ల అనుమతి లేకుండా డిపాజిట్ సొమ్మును వినియోగించుకునే వెసులుబాటు కల్పిస్తుంది. బ్యాంకు ఆర్థిక పరిస్థితి క్షీణించినట్లైతే ఇది ఒక అపోహ మాత్రమే అన్పించక మానదు. ప్రస్తుతం ఉన్న బీమా సదుపాయం కన్నా బైల్ ఇన్ క్లాజ్ వల్ల డిపాజిట్ దారులు ఎక్కువ ప్రయోజనం పొందుతారు. ఎందుకంటే ఇప్పుడున్న చట్టం డీఐసీజీసీ ద్వారా కేవలం లక్ష రూపాయలకు మాత్రమే బీమా కల్పిస్తుంది. ఒక వ్యక్తి బ్యాంకులో 10 లక్షల సొమ్మును ఆదా చేశాడు అనుకుందాం. ఒకవేళ బ్యాంకు దివాలా తీస్తే అతను చట్టపరంగా లక్ష రూపాయలు మాత్రమే తిరిగి పొందుతాడు. కానీ ఇప్పుడు ప్రతిపాదిస్తున్న బిల్లు లిక్విడేషన్ సమయంలో బీమా సదుపాయం లక్ష పోగా మిగిలిన 9 లక్షలకు దామాషా పద్ధతిలో సొమ్ము తిరిగి పొందే హక్కును కల్పిస్తుంది.

దేశాభివృద్ధిని పరుగు పెట్టించడంలో ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వ సంస్కరణల మంత్రాన్ని, కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిని ఏ మాత్రం తప్పుపట్టలేం. ఇప్పటికే అవినీతి రహిత మూడున్నరేళ్ళ పాలనగా మోదీ ప్రభుత్వం శ్లాఘించబడుతోంది. అయినప్పటికీ దీర్ఘకాలంలో ఘననీయమైన ప్రభావం చూపే సంస్కరణలను రూపొందించటంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించాలి. ప్రస్తుతం జాయింట్ కమిటీ ఆఫ్ పార్లమెంట్ ముందున్న ఈ బిల్లును మొదటగా ప్రతిపాదించింది యుపీఏ అధికారంలో ఉండగా జీ–20 దేశాల సమావేశంలోనే. అయితే ఇప్పుడు అదే యూపీఏ ప్రతిపక్షానికి వచ్చేసరికి ప్రజలలో అపోహలు కల్పించి ప్రతిష్టాత్మకమైన బిల్లును నీరు కార్చాలని చూస్తోంది. దీనికి తోడు ప్రైవేటు బ్యాంకులు ఇదే అదనుగా తమ డిపాజిట్‌లను పెంచుకోవడానికి ప్రజలలో ఆందోళనకర వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. సామాన్య ప్రజలకు బహుళ ప్రయోజనాలు కల్గించే ఇలాంటి బిల్లుల విషయంలో రాజకీయ పార్టీలన్నీ తమ ద్వంద్వవైఖరిని వీడి సమష్టిగా చర్చించి తద్వారా దేశ ఆర్థిక ప్రగతికి నాంది పలకాలి. ఎలాంటి కాలయాపన లేకుండా ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి సామాన్య ప్రజల అభిమానాన్ని చూరగొనాలి.

◆ వేదుల జనార్దన్
9502469464

మసకబారిన సంబరం


మన లేఖలు


డియర్ 2018,

ఎలా ఉన్నావు? నేను బాగానే ఉన్నాను. సంక్రాంతి నెల వచ్చింది. మాకు సెలవులు వచ్చాయి. ఏం చేయాలో తెలియడంలేదు. నా బాధని చెప్పుకునేందుకే నీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. ఆనాటి సంక్రాంతిని చేసుకొనే భాగ్యం మాకులేదు. కాలం ఫాస్ట్‌గా మారుతున్నట్లుగా ఆడపిల్లలు కూడా ఫాస్ట్‌గా ఎదిగిపోయారు. ఈ కాలం ఆడపిల్లలకు ముగ్గుల గురించి తెలియనే తెలియదు. ఇంటర్నెట్లో ముగ్గులు చూసి నేర్చుకోవడం, అదీ కుదరకపోతే ఇక్కడ వారానికి రెండురోజులు ముగ్గుల క్లాసులు తీసుకొని నేర్పిస్తూ ఉంటారు. అలా వాళ్లు వాళ్లకి కుదిరినప్పుడు అక్కడకు వెళ్లి నేర్చుకుంటారు. కోడిపందాలు, ఎడ్లపందాలు అంటే అసలే తెలియదు. ఆ పందాలు నెట్లో చూసి ఆశ్చర్యపోతూ ఉంటాం. మాకు ఇక్కడ కోళ్లు, ఎడ్లు బయట ఒకటి రెండు ఎప్పుడైనా ఒకసారి కనిపిస్తూ వుంటాయి. ఇంకా కొత్త అల్లుళ్ళు అంటావా కొత్తాపాతా ఏమీ ఉండదు. కనీసం మావయ్య అని కూడా పిలవరు. అంకుల్, అంకుల్ అని పిలుస్తారు. పెళ్లయిన దగ్గరి నుంచి వేరుగా ఉండటం ఎవరి దారి వారు అన్నట్లు బతుకుతుంటారు. ఇంకా పిండివంటలు అంటావా అవి తినే వారే లేరు. మీరు తినే పిండివంటల్లో సగం పేర్లు కూడా మాకు తెలీదు. ఆ పిజాలు, ఆ బర్గర్లు తింటుంటాం. చివరికు ధాన్యపు సిరులు పండించే రైతే లేడు. చెప్తే ఆశ్చర్యపోవు కదా మేము ఎనర్జీ రావటానికి రోజుకు మూడుసార్లు ట్యాబ్లెట్లు వేసుకుంటాం. ఒకసారే తింటాం. మీరు ఆవకాయ, ముద్ద పప్పు వేసుకొని కమ్మగా తినేవాళ్ళు. ఈ పిచ్చితిండి తిని మా నాలుక చచ్చిపోయింది. కనీసం మీ తిండి తినే అదృష్టం కూడా మాకు లేదు. కోలాటాలు ఆడి, గాలిపటాలు ఎగరేసే నాథుడే లేడు. ఒక పండగని, బంధువుల్ని కలుసుకోవటం మనుషుల మధ్య విలువలు అనురాగాలు, ఆప్యాయతలు ఏమీ ఉండవు. మీ రోజుల్లో సంక్రాంతి పండుగ బాగా జరిగేదంట కదా! మా తాతయ్య చెబుతూ ఉండేవారు. వారం రోజులపాటు సంబరాలు జరుపుకునే వారట కదా. కోడిపందాలు, ఎడ్లపందాలు, బొమ్మల కొలువులు, ముగ్గులు, డూడూ బసవన్నలు, ఆటలు, పాటలు, కొత్త అల్లుళ్ళు అలకలు, పిండివంటల ఘుమఘుమలు, కోలాటాలు, గాలిపటాలు, ఇంటికి వచ్చిన ధాన్యపు సిరులను చూసి రైతుల ఆనందాలు ఒకటా రెండా ఏమని చెప్పను? మాకు ఆనాటి సంక్రాంతిని చూసే భాగ్యం లేదు. ఎందుకు నేను 2118వ సంవత్సరంలో పుట్టానా అని బాధగా ఉంది. మీరు జరుపుకున్న సంక్రాంతి మా జీవితంలో ఒక్కసారైనా జరుపుకుంటామో లేదో. 2018 నువ్వు చాలా అదృష్టవంతురాలివి.

- కాసర సింధూ రెడ్డి (అకడమిక్ డైరెక్టర్)
ప్రతిభా స్కూల్, జంగారెడ్డిగూడెం
9441084064

అలిశెట్టి పదాలు అగ్నికణాలు...





కరీంనగర్ జిల్లా (ఉమ్మడి) జగిత్యాలలో 1956 జనవరి 12న అలిశెట్టి ప్రభాకర్ జన్మించారు. 1993 జనవరి 12న అలిశెట్టి తుది శ్వాస విడిచాడు. సమాజాన్ని ప్రభావితం చేసిన వ్యక్తుల్లో చాలా మంది నడివయస్సులోనే అస్తమించారు. చెగువెరా, భగత్‌సింగ్, వివేకానంద, బ్రూస్‌లీ, మైఖెల్‌జాక్సన్, చెరబండరాజు, జార్జిరెడ్డి, మారోజు వీరన్న ఇంకా మరెందరో... వారి శక్తి సామర్థ్యాల్ని భరించే శక్తి ఈ భూమికి లేకపోయింది కాబోలు! వీలయినంత తొందరగా తనలో ఇముడ్చుకుంది. నిమిషం సమయం దొరికితే ఉపన్యాసాలతో అదరగొట్టేవారు ఆచరణలో తేలిపోతారు. కానీ ఆచరణని గీటురాయిగా నిలబడినవారే చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారన్నది నిత్యసత్యం. అలిశెట్టి ప్రభాకర్ ఆచరణకు పర్యాయపదం. దేనికి తలవొంచని వ్యక్తిత్వం అతన్ని సాహిత్యంలో ఎవరెస్టులా నిలిపింది. ఒక సృజనకారుడికి ఉండాల్సిన అన్ని నిర్దిష్ట కోణాలు అలిశెట్టిలో మనకు కన్పిస్తాయి. కళాకారుడి హృదయం ఒక భావాన్ని ఎన్ని విధాలుగా ఆవిష్కరిస్తుందో అలిశెట్టి మనందరికి దృశ్యమానం చేసి చూపించారు.

1975లో పూర్ణిమ ఫొటో స్టూడియో సిరిసిల్లలో, 1979లో శిల్పి ఫొటో స్టూడియో కరీంనగర్‌లో, 1983లో చిత్రలేఖ ఫొటో స్టూడియో హైదరాబాద్‌లో సృజనాత్మక ఫొటోగ్రాఫర్‌గా జీవించారు. డ్రాయింగ్ వేయడం, పెయింటర్‌గా తన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశారు. సాహిత్యం కళలు అతనికి జీవితమైపోయాయి. 198 నుంచి తన చిత్రాలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ప్రదర్శించారు. అవి వారపత్రికల్లో ప్రచురితమై అలిశెట్టికి గొప్ప పేరును తీసుకువచ్చాయి. తనకు లభించిన పేరు వెనక అతని కఠిన శ్రమ, కఠోర పరిశ్రమ ఉంది. ఏ రోజుకారోజు వరకే అలిశెట్టి తన గురించి ఆలోచించరని, సమాజం గురించే కాని తన తపన, తన కోసం కాదన్నది అలిశెట్టి గురించి తెలిసినవారు చెప్పే కఠోరసత్యం. అతను కళను నమ్ముకున్నాడే కానీ ఏనాడు అమ్ముకోలేదు. కవిత్వం కోసం, కళే శ్వాసగా బతకడం కోసం తన ఇళ్లను సైతం అమ్ముకున్నారంటేనే అతని నిబద్ధత మనకు తేటతెల్లమవుతుంది. శాలువాలు, పురస్కారాలు పేరెత్తితేనే ఎగిరి గంతేసే రోజుల్లో అలిశెట్టి వాటిని వ్యతిరేకించారు. సత్కారాలను తోసిపుచ్చారు. అతనెప్పుడు ఐనితుడి పక్షమే కాని మరొకటి కాదని చాటి చెప్పారు. తాను ఎక్కడున్నా మావోయిస్టులకు షెల్టర్ ఇచ్చారని, పర్యవసానంగా హెచ్చరికలు, దెబ్బలు, మేధావులు ఎదుర్కొన్నారు. కవిగా అలిశెట్టి ప్రభాకర్ తెలుగు సాహిత్యంలో చెరగని ముద్రవేశాడు. అతని పదాలు అగ్గిరవ్వలు, అతని కవితలు నిప్పుగుళికలు, కన్నీటి చెలిమెలు. సామాన్య మానవుడ్ని తన కవితా వస్తువుగా నలిపి కవితా తాండవం చేశారు. ఏ విధంగానైతే తన జీవితం ఉందో తన జీవితానికి సాహిత్యం అంతే దగ్గరగా ఉంది. ఆ నిబద్ధతే అలిశెట్టిని మహాకవుల సరసన నిలబెట్టింది. దానికి ఇటీవల తెలుగు ప్రపంచ మహాసభలే సాక్షి. స్వాగత్ తోరణాలతో పాటు 'ఇందిరా ప్రియదర్శిని' ఆడిటోరియానికి 'అలిశెట్టి ప్రాంగణం' పేరు పెట్టి గౌరవించుకున్నారు. కవి తన సభలు ఎక్కడ జరిగినా అలిశెట్టి పేరు దాదాపుగా వినిపిస్తుంది. తన కవిత్వం తప్పకుండా 'కోట్' చేయబడుతుంది. అంత సహజంగా ప్రజల నాల్కెలపై నాటుకపోయింది. ప్రతి సమస్యపై శరవేగంగా స్పందించారు. ప్రతి అక్షరం ఒక తూటాగా పేల్చారు. అందుకే ఆ కవితలు సజీవంగా నిలిచాయి. 1974లో తన మొదటి కవిత అచ్చైంది. ఎర్రపావురాలు (1978), మంటల జండాలు (1979), చురకలు (1981), రక్తరేఖ (1985), ఎన్నికల ఎండమావి (1989), సంక్షోభ గీతం (199), సిటీలైఫ్ (1992)లో ప్రచురించిన సంకలనాలు. బ్రతికిన అతి తక్కువ కాలంలో కవిగా అలిశెట్టి ప్రభావం అనన్య సామాన్యమైనది. తన జీవితం ఎంత సాదాసీదాగా ఉండేదో తన కవిత అంత ఆర్తగా ఉండేది. తాను వేశ్యపై రాసిన కవిత ప్రతి ఒక్కరితో కంటతడి పెట్టిస్తుంది.

'తను శవమై / ఒకరికి వశమై / తనువు పుండై / ఒకరికి పండై... / ఎప్పుడు ఎడారై / ఎందరికో ఒయాసీస్సై' చిన్నచిన్న పదాలతో మనసులో కల్లోలం రేకెత్తించడం అతని ప్రత్యేకత. 'సీటీ లైఫ్'పై అతనిది చెరగని ముద్ర – 'సీటీ అంటే అన్నీ / బ్యూటీ బిల్డింగులు కావు / అటు భవంతులు ఇటు పూరిళ్లూ/దారిద్ర్యం, సౌభాగ్యం సమాంతర రేఖలు!' నగరం అంటే కేవలం రంగురంగుల మేడలు మాత్రమే కాదని, మేడల్ని నిర్మించే గుడిసెలు నగర అందాలని చాటిన వాడు 'మేడలు గుడిసెలపై రాళ్ళు వేస్తున్నామని' వాపోయిన వాడు అలిశెట్టి. ఇంతకన్నా నగరాన్ని ప్రేమించగల్గటం ఏముంటుంది? 'సిటీలైఫ్' అంటేనే ఠక్కున అలిశెట్టి మనకు స్ఫురిస్తున్నారంటే అతని ప్రభావాన్ని మనం అర్థంచేసుకోవచ్చు. 'మరణం నా చిన్న చరణం కాదంటూ' హృదయ ఘోష చేశారు. 'మరణం నా చివరి చరణం కాదు / మౌనం నా చితా భస్మం కాదు / మనోహరాకాశంలో విలపించే చంద్రబింబం / నా అశ్రుకణం కాదు

....

అగ్ని పద్యం నేను దగ్ధ గీతం నేను అక్షర క్షిపణి నేను
ఆయుధాలుగా రూపాంతరం చెందే ఆకలి నేపథ్యం నేను
అడవి నేను – కడలి నేను'

అంటూ చివరికి 'శత్రువు నా పాదధూళి' చెలరేగిపోయారు. ఈ కవిత్వం కాలే కడుపులో నుంచి ఈ సమాజంలో నిత్యం జరుగుతున్న కుళ్ళు కుతంత్రాల్ని చూడలే రగిలిపోయిన గుండెలో నుంచి వచ్చిందే. అతని కవిత్వం 'మంటల జండాలు' జ్వాలా ఎగిసిపడింది. ఎంత ఆగ్రహంగా అక్షరం పెల్లుబికి వచ్చిందో ఆర్తతతో కంటతడిపెట్టిస్తుంది అతని కవిత. ఆకలి అనే కవితలో – 'ఆకలి మండిపోతున్నప్పుడు / ఎదుట ఎంతటి మనోహర దృశ్యమున్నా / దగ్ధమై పోవాల్సిందే / ఆకలిని నిగ్రహిస్తున్న కొద్ది / కడుపులో పేగుల్ని / కత్తిరిస్తున్న బాధే' – అని ఆకలి బాధల్ని వర్ణించారు. ఎన్ని పస్తులు అతన్ని అంతగా కలచివేసామో ఉంటె తింటాం, లేకుంటే పస్తులుంటాం అన్న అతని నైజం ధిక్కారపు ఊపిరి. ఆ ధిక్కారమో అతన్ని ప్రభాకరుడిలా జ్వలింపజేసింది. రాజకీయాలపై అతని వ్యంగం అసాధారమైనది. 'కాసుకొ / కొసుకొ / రాజకీయమా! / ప్రజలు పసన తొనలు / మీరు కత్తి మొనలు' 'ఒక నక్క / ప్రమాణ స్వీకారం చేసిందట / ఇంకెవర్నీ వంచించనని / ఒకపులి పశ్చాత్తాపం ప్రకటించిందట / తోటి జంతువుల్ని సంహరించినందుకు / పుర్రెలూపుతూనే ఉన్నాయి' అని చురకలంటించారు.

అతని పేదరికం అతన్ని ఎంతగా ఈ సమాజం పట్ల స్పందించేటట్లు చేసిందో, అతన్ని అంతే హింసించింది. దారిద్ర్యానికి తోడు టీబి వ్యాధి అతన్ని కబళించింది. రోజు రోజుకు ఆ మహమ్మారి అతన్ని కబళిస్తున్నా లెక్క చేయలేదు. తాను చనిపోతున్నానని తెలిసీ కవిత్వం రాయడం ఆపలేదు. అది అతనికి కవిత్వంపై ఉన్న విశ్వాసం. చరిత్ర పుటల్లో అలిశెట్టి ప్రభాకర్‌ది చెరగని ముద్ర జ్వలించే అగ్నికణం అలిశెట్టి.

◆ శకుంతల కొండపరక

నవ్వులో నవ్వు లేదు

కవిత

ఒగరు పొగరు పెదాలపై తేనెపట్టు
మకిలిని పూసుకుని చిరునవ్వుల చిద్విలాసం
భావంలో జీవంలేని ప్లాస్టిక్

పువ్వుల నవ్వులు కాలుష్యం
కళేబరం కళావిహీనమైంది
యథార్థ పాలపొంగునవ్వును
మనిషి మరిచిపోయి చాన్నాళ్లయింది

నెమరు వేసుకుందామనుకొన్నా..
మదర్ బోర్డ్ మదిలో వెదికినా
ఆనవాళ్లు అదృశ్యం
అవి మరుపు పొరల బండరాళ్ళు
సమస్యల సాలె గూళ్ళు
స్వార్థ బంధాల కింద నలిగి
సమాధులైనవి

యాంత్రిక జీవన ఎడారి పాతాళంలో
ఇంకిపోయిన గుండె తడి
హృదంతరాలలో లేని
ముఖారవిందాన్ని ఆవహించని
కచ్చాగా పచ్చని మాగని ఆ నవ్వుకు
అవసరాల రసాయనాలు చల్లి
కృత్రిమ పక్వానికి తెచ్చిన బలిమి ఫలం
ఆ నవ్వు పండులో
రసం వాసన రుచి ఆనందం మృగ్యమైనవి
ఆ పండు పండలేదు
ఆ నవ్వూ పండలేదు

- యాదయ్య కొప్పోలు
9494273703

Education is The Manifestation of
The Perfection Already in Man

-Swami Vivekananda

యువజనులారా..
భారతీయ సుజనులారా!!

సంపన్నుల ఇంట పుట్టి రాజభోగాలనుభవించిన నరేంద్రనాథుడు... ఉన్నదంతా ఊడ్చుకుపోగా... ఉద్యోగం కోసం ఎక్కిన గడప ఎక్కకుండా ఊరంతా తిరిగి ఉసూరుమన్న నిరుద్యోగ పీడితుడు... ప్రపంచానికే పాఠాలు నేర్పిన ఆధ్యాత్మిక గురువయ్యాడు. బతికింది ముప్పైతొమ్మిదేండ్లే అయినా భారతీయతను భువనవ్యాప్తం చేసి విశ్వమున్నంత కాలం సరిపోయే విజ్ఞానాన్ని, వివేకాన్ని పెంచి... కాలమున్నంత వరకు కొనసాగే మానవతను పంచి...మనుషుల్లో దేవుడిని చూపి.. దానవుల్లో సైతం దైవత్వాన్ని రగిలించిన ఆధ్యాత్మికోత్తముడు... మేరునగ ధీరుడు... వివేకానంద స్వామి తరగని విద్వత్తుకు... చెరగని ఔన్నత్యానికి దోహదం చేసిన అంశాలేమిటో తెలుసుకుందాం...



వివేకులు కండి



పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు... నరేంద్రనాథ్ దత్తాకు బాల్యం నుంచే మహిమాన్విత వ్యక్తిత్వానికి అవసరమైన లక్షణాలు ఒంటబడుతూ వచ్చాయి. చిన్నతనం నుంచే ధ్యానం చేయడం అలవాటవడంతో ఏ పనైనా మొక్కవోని దీక్షతో, ఏకాగ్రతతో పని చేయడం అలవడింది. ఎన్ని కష్టనష్టాలెదురైనా, ఎట్టి పరిస్థితుల్లోనైనా అనుకున్నది పూర్తి చేయడం, గెలుపు సాధించడం అలవాటుగా మారింది. అదే అనుకున్నది సాధించుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను నేర్పింది. తీసుకోవడం కన్నా ఇవ్వడంలోనే ఎక్కువ ఆనందాన్ని అనుభవించేవాడు. ఆర్తులు అడిగితే లేదనకుండా ఇచ్చేవాడు. సహాయం కోసం అర్థిస్తే కాదనకుండా చేసేవాడు. మరీ ముఖ్యంగా సన్యాసులు, యోగులైతే ఇక చెప్పేదే అవసరం లేదు. దీనివల్ల ఆయనకు మంచివాడన్న పేరుతోపాటు పెద్దల ఆశీర్వాద బలం లభించింది. పెద్దవారితో అనుబంధం పెంచుకోవడం, వారి నుంచి తనకు కావలసినది గ్రహించడం వీలయింది. ఈ లక్షణమే ఆయనను విజ్ఞానిగా తయారుచేసింది. ఏది చేయాలో... ఏది చేయకూడదో గ్రహించే వివేచననూ వారి నుంచి నేర్చుకోగలిగాడు. వివేకవంతుడయ్యాడు.

ధ్యానం చేసే అలవాటువల్ల ఏకసంథాగ్రాహిగా మారాడు. ఒక్కసారి చదివితే, మాట వింటే చాలు.... విషయం అర్థమయ్యే శక్తి అబ్బింది. బడిలో చేరాక అందరిలాగా బట్టీపట్టో, బలవంతంగానో చదవలేదు. చదివిన దాన్ని ప్రశ్నించుకుంటూ, విశ్లేషిస్తూ అవగతం చేసుకునేవాడు. దానితో విషయం పలు కోణాల్లో సమగ్రంగా అర్థమయ్యేది. ఒక్కసారి అలా ఎక్కితే మర్చిపోయే ప్రసక్తే ఉండదు కదా! ఆ విధంగా ఆయనకు అధ్యయనం పట్ల ఆసక్తి పెరిగింది. హేతుబద్ధంగా ఆలోచించడం వల్ల మూఢనమ్మకాలు దరిజేరలేదు. ఏదైనా కార్యకారణయుక్తంగా చదవడం, సమగ్రంగా అర్థం చేసుకునే లక్షణం అలవడింది. తనకిష్టమైన చరిత్ర, సైన్సు, తత్త్వశాస్త్రాలను ఔపోసన పట్టించింది. ఈ గుణమే ఆయనను అందరికన్నా మిన్నగా నిలిపింది. అర్థమైన దాన్ని అవసరమైన రీతిలో ప్రెజెంట్ చేసి కోరుకున్న మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదు.. మంచి విద్యార్థులుగా మెప్పు పొందాలనుకునే ఎవరైనా ఈ పద్ధతిని అనుసరించాలని ఆచరణాత్మకంగా చూపాడు.

గురువును ఎంచుకోవడంలోనూ ఆయన ఈ ప్రశ్నించే పద్ధతినే అనుసరించాడు. రామకృష్ణ పరమహంసను కలుసుకున్న మొదటి సారే 'మీరు దేవుడిని చూశారా?' అని అడిగాడు. 'నిన్ను చూసినంత స్పష్టంగా భగవంతుడిని చూశాను' అని జవాబిచ్చాడాయన. ఆ మాటలను అంత సులభంగా నమ్మని నరేంద్రుడు మరిన్ని విధాలుగా ఆయన నిజాయితీని పరీక్షించాలనుకున్నాడు. పరమహంస కూర్చున్న చాపకింద ఎవరికీ తెలియకుండా నాణేలను పెట్టాడు. దానిపై కూచోగానే ఆయన ఎగిరిపడ్డారు. వెంటనే చాప కింద ఉన్న నాణేన్ని వెలికితీసి బయటకు విసిరేశారు. అయినా, నరేంద్రుడికి తృప్తి కలగలేదు. భగవంతుని గురించి తెలుసుకోవాలంటే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను వదిలించుకోవాలి. రామకృష్ణుడి గురించి లోతుగా పరిశీలిస్తే ఆయన తన భార్యనే దైవంగా పూజించాడని తెలిసింది. ఇలా ఎన్నో గుణగణాలను స్వయంగా పరీక్షించి రూఢి పరుచుకున్నాకే పరమహంసను తన గురువుగా స్వీకరించాడు నరేంద్రనాథుడు.

> యువకాలం
> పరుగెత్తే ప్రవాహం
> హోరెత్తే చైతన్య కెరటం
> తరగని జ్ఞాన తరంగం
> జీవన చోదకం
> ఉపకరిస్తే 'సర్వసాధనం
> ఉద్వేగిస్తే ఉపద్రవం
> అభ్యసిస్తే అభ్యుదయం
> అలసిస్తే దుఃఖభాజనం

MANAM MANTRA

ఇట్లా తరిచి చూసుకుని వాస్తవం తెలుసుకున్నప్పుడు చేసే పని ఏదైనా తిరుగులేని ఫలితమిస్తుందని స్వామీజీ జీవితంలోని ఈ ఘటనల ద్వారా మనం గ్రహించవచ్చు.

తండ్రి మరణంతో ఆస్తి దాయాదుల పాలైంది. పేదరికం పీడించింది. అప్పులవారి వేధింపులు ఎక్కువైనాయి. కుటుంబానికి పెద్ద దిక్కు తానే కావడంతో తల్లితోపాటు చెల్లెళ్లు, తమ్ముడిని పోషించే బాధ్యతను తనకుతానే స్వీకరించాడు. ఉద్యోగం చేయాలని నిశ్చయించుకున్నాడు. చిరిగిపోయిన దుస్తులతోనే కలకత్తా నగరమంతా కాళ్లరిగేలా తిరిగాడు. ఉద్యోగం దొరకలేదు. రోజుకో పూట తిండి కూడా దొరకడం గగనమైంది. వారి కడుపు నింపడానికి నానా కష్టాలూ పడ్డాడు. తాను మాత్రం తిండిలేక చాలా సార్లు సొమ్మసిల్లిపోయేవాడు. ఆ విధంగా ఎవరూ చెప్పకున్నా తన బాధ్యతను గుర్తెరిగి ప్రవర్తించాడు. గురువుగారితో ఆధ్యాత్మిక సంబంధాలే తప్ప ఐహిక బంధాల గురించి మాట్లాడొద్దనుకున్నాడు. కానీ, తనవారి కడుపు నింపడం కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పరమహంసను పని ఇప్పించమని కోరితే 'భగవంతుడిని చూడడానికి నేను సహాయం చేస్తాను. కానీ పని ఇప్పించలేను' అని గురువుగారు చెబుతారు. అత్యవసరంలో ఉన్నప్పుడు ఇలాంటి మాటలు విన్న ఎవరికైనా కోపం వస్తుంది. 'ఆకలి తీర్చలేడుగానీ... పెద్ద పెద్ద మాటలు చెబుతున్నాడు... ఇలాంటివాడితో మనకెందుకులే' అనుకుని సంబంధాలు తెంచేసుకుంటారు. కానీ, స్వామీజీ అట్లా చేయలేదు. ఒక్కసారి నమ్మిన గురువును జీవితకాలం నిస్సందేహంగా అనుసరించాడు. ఆయన చెప్పినదాన్నే తు.చ. తప్పకుండా ఆచరించాడు. ఆఖరికి గురువుగారు పరమపదించిన తరువాత కూడా ఆయన ఆశీస్సులు లేకుండా ఏ పనీ మొదలుపెట్టలేదు. ప్రపంచ చరిత్రలోనే ప్రత్యేకమైనదిగా గుర్తింపు పొందిన 1893 షికాగో సర్వమత సమ్మేళనంలో పాల్గొనాలా... వద్దా? అనే దాన్ని కూడా శారదామాత సహాయంతో దివికేగిన గురువుగారిని ప్రార్థించి అనుమతి పొందాడు. 'ఆ సర్వమత సమ్మేళనం నీకోసమే...' అని గురువుగారు స్పష్టం చేశాకనే బయలుదేరాడు. అంటే తను నమ్మినదానికి స్వామీజీ ఎంతగా కట్టుబడ్డాడో అర్థం చేసుకోవచ్చు. ఎట్టకేలకు ఉపాధ్యాయ ఉద్యోగం దొరికింది. ఉద్యోగం చేస్తూనే తనకిష్టమైన న్యాయవాద విద్యను పూర్తిచేశాడు. ఉద్యోగం, చదువుతోపాటు ఆధ్యాత్మిక సాధన కూడా కొనసాగించాడు. అంటే ఒకరు ఒకేసారి ఒకటి కన్నా ఎక్కువ పనులు కూడా చేయవచ్చని ఆచరించి చూపాడు స్వామిజీ. ఒక్క పని చేయడానికే అష్టకష్టాలు పడే యువత దీని నుంచి ఎంతో గొప్ప పాఠం నేర్చుకోవచ్చు.

గురువుగారి వల్ల వివేకానందుడిగా మారి, ఆయన మరణించాక ప్రజలకు సేవచేయడం, ఆధ్యాత్మిక సాధన చేయడం అనే లక్ష్యాలతో రామకృష్ణ మిషన్‌ను స్థాపించాడు. మనిషిలో దివ్యత్వం దాగుందనీ, దాన్ని ఉపయోగించుకునే తీరుగురించి చెప్పడమే ఈ మిషన్ లక్ష్యమని స్వామీజీ ప్రకటించాడు. బేలూరులో ఆయన ప్రారంభించిన ఈ మఠం నేడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి కోట్లాదిమందికి అహారం, విద్య, ఆధ్యాత్మిక సేవలనందిస్తోంది.

విషయాలను అనుభవపూర్వకంగా తెలుసుకోవడం.. దేశ పరిస్థితులను అధ్యయనం చేయాలనే ఉద్దేశంతో చేతిలో చిల్లిగవ్వ లేకుండా దేశాటన చేశాడు. కన్యాకుమారి నుంచి కాశ్మీరుదాకా ఒంటరిగా కాలినడకన పర్యటించాడు. ఒంటిపై కాషాయ వస్త్రం, చేతిలో కమండలం మాత్రమే తోడుగా ఆయన తన పర్యటనను కొనసాగించాడు. మధ్యలో ఎవరైనా శిష్యులు ఎదురై వెంట వస్తానంటే వద్దని వారించేవాడు. ధన సహాయం చేస్తానని ముందుకు వచ్చిన వారిని తప్పించుకు పోయేవాడు. ఆకలిదప్పులు భరిస్తూ లెక్కలేనన్ని అవరోధాలను దాటుకుంటూ దేశమంతా తిరిగి ఎంతో విజ్ఞానాన్ని గ్రహించాడు. దేశమంతా తిరిగి చివరగా కన్యాకుమారి చేరుకున్నాడు. భయంకరమైన హిందూ మహాసముద్రంలో రాత్రిపూట మూడు కిలోమీటర్లు ఈదుకుంటూ వెళ్లి అక్కడున్న భారీ రాతిపై తిండీతిప్పలు మాని మూడురోజులు ఏకధాటిగా తపస్సు కొనసాగించాడు. మానవసేవే లక్ష్యమన్న దైవ సందేశాన్ని పొందాడు. వేదాంత పరమ సత్యాలను సామాన్యులకు అందించనందునే దేశం ఇలా దుస్థితికి లోనయిందన్న వాస్తవం సుబోధకమైంది. ఏదైనా సాధించడానికి ఎంత ధైర్యస్థైర్యాలు అవసరమో... ఎంత కఠినంగా పనిచేయాలో... ఎంతటి త్యాగాలకు సిద్ధం కావాలో.. ఈ ఘటన ద్వారా మనం గ్రహించవచ్చు. సముద్రంలో పదడుగుల దూరం పోవడానికే భయపడి చస్తాం. అలాంటిది రాత్రిపూట భయంకరమైన సొరచేపలు కనిపిస్తే కసుక్కున మింగేసే రాత్రి పూట అంతదూరం ఈదడమంటే ఎంతటి సాహసమో!! అసాధ్యాలను సుసాధ్యం చేయగలిగాడు కాబట్టే పాశ్చాత్య దేశాల్లోనూ జైత్రయాత్రను కొనసాగించాడు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా ఆయన భారతీయతను ప్రచారం చేయడం, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని బోధించడం, భారతీయుల కోసం సహాయాన్ని అర్థించడం మాత్రం మరువలేదు.

మానవసేవే మాధవసేవ అని చాటిచెప్పాడు. దైవత్వం కన్నా మానవత్వమే గొప్పదని నిరూపించాడు. మనుషులకు సేవ చేయడమంటే దైవాన్ని సేవించడమేనని ఆచరణాత్మకంగా బోధించాడు. అందుకే పేదలను ఆయన 'దరిద్ర నారాయణు'లని అభివర్ణించారు. వారు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని స్వరూపమనీ, వారికి సహాయం చేయడమే నారాయణ సేవ అనీ బోధించాడు. దానికోసమే తన జీవితాన్ని ధారపోశాడు. కాబట్టే తరతరాలుగా ఆయన ప్రపంచ ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. నిత్యం స్ఫూర్తినిస్తూ వర్ధిల్లుతున్నాడు.

(నేడు స్వామి వివేకానంద జయంతి... జాతీయ యువజన దినోత్సవం...)



ఎంత కాలం బతికామన్నది కాదు.. ఎంత గొప్పగా జీవించామన్నదే లెక్క. ఈ భూమ్మీద జీవించింది తక్కువే కాలమే అయినా ప్రపంచవ్యాప్తంగా తరతరాలుగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తున్న వివేకానంద స్వామి నుంచి నేర్చుకోవలసినవి ఒకటో రెండో కాదు. వందలు.. వేలు.. లక్షలే కాదు. కోటానుకోట్ల విషయాలు నేర్చుకోవచ్చు. ఆ ఆదర్శ మూర్తిమత్వాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో చెప్పడానికే స్వామీజీ జీవితంలోని కొన్ని ఘటనలను ఇక్కడ స్థూలంగా విశ్లేషించాం. ఒక్కసారి ఆయన జీవితాన్ని అధ్యయనం చేయండి... అంతులేని విజ్ఞానం పొందండి. వివేచనతో కూడిన వ్యక్తిత్వంతో వివేకవంతులుగా ఎదగండి...
విష్ యూ ఏ వెరీవెరీ హ్యాపీ యూత్‌ఫుల్ డే...!!

(1893 సెప్టెంబర్‌లో షికాగో సర్వమత సమ్మేళనంలో భారతదేశ, హిందూ మత ప్రతినిధిగా స్వామీజీ చేసిన ప్రసంగం అద్భుతం. నేటికీ దాని గురించే ప్రపంచమంతా చెప్పుకుంటుంది. ఆ రోజు ఆ సభలో పాల్గొన్న వారినే కాకుండా... నేడు చదివిన వారిని కూడా ఎందుకంతగా ఆకర్షిస్తుందో తెలుసుకుంటే మనం ఎట్లా మాట్లాడాలో అర్థమవుతుంది. దీనికోసమే ఆ ప్రసంగంలోని కొన్ని అంశాలు..)



మై డియర్ యంగ్ పీపుల్ ఆఫ్ ఇండియా..!!

అప్పటివరకూ వక్తలు చేసిన ప్రసంగాలు అతిథుల చెవులను తాకితే.. నరేంద్రుడి పలకరింపు వారి మనసును తాకింది. లేడీస్ అండ్ జెంటిల్‌మెన్' అన్న రొటీన్ పిలుపులకు అలవాటుపడిన అమెరికన్లను 'మై డియర్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ ఆఫ్ అమెరికా' అన్న మాటల్లోని అప్యాయత పులకింపజేసింది. ఈ ఐదు పదాల వాక్యం తర్వాత... దాదాపు మూడు నిమిషాలపాటు సభికుల కరతాళధ్వనులతో సభా ప్రాంగణం మార్మోగిపోయింది. అప్పటివరకూ అనామకుడిగా ఉన్న వ్యక్తి.. వివేకానందుడిగా ప్రఖ్యాతుడయ్యాడు. స్వామీజీ గొంతులోని మార్దవం, మాటల్లోని మాధుర్యం వారిని సమ్మోహితులను చేశాయి. తొలి వాక్యంతోనే సభికులతో అనుబంధం పెంచుకున్నాడు కాబట్టే ప్రారంభంలో మొదలైన చప్పట్లు చివరివరకూ కొనసాగాయి. మాటలతో హృదయాన్ని కదిలించగలవారు ఎలాంటివారినైనా సులువుగా తమవైపు ఆకర్షించగలరు. 'సానుకూల హృదయస్పర్శ'తో మొదలైనాయి కాబట్టే 1893 నాటి విశ్వమత మహాసభల్లో నరేంద్రుడు చేసిన ప్రసంగాలు నేటికీ ప్రపంచమంతా మార్మోగుతూనే ఉన్నాయి. నిర్వాహకుల స్వాగతోపన్యాసానికి స్పందనగా... మతాల మధ్య భేదాభిప్రాయాలపై, హిందూ ధర్మంపై, బౌద్ధమతంపై ఎన్నో విశ్లేషణలు, ఆచరణాత్మక విషయాలు చెప్పారు. 'నదులు ఎక్కడ పుట్టినా.. ఎన్ని వంపులు తిరిగినా... చివరకు చేరేది సముద్రాన్నే కదా? అట్లాగే దైవాన్ని (ప్రశాంత చిత్తాన్ని) చేరుకునేందుకు మతం ఓ మార్గం మాత్రమే.. ఒక్కొక్కరు ఒక్కో మార్గంలో వెళ్తారు. మార్గమేదైనా గమ్యం ఒక్కటే. ఈ పరిస్థితిలో మన మధ్య ద్వేషభావాలెందుకు? అంటూ ప్రశ్నించిన స్వామీజీ సర్వమతస్థులను ఐక్యం చేసేందుకు ప్రయత్నించారు. సమష్టి తత్వంతోనే 'సాధన' చేయొచ్చని సూచించారు. ఈ మాటలు మతాధిపతుల మనసులను మార్చాయి. సర్వ మతాలు సత్యమార్గాలేనని సనాతన హిందూ ధర్మం చెబుతోందని నరేంద్రుడు చెప్పింది సమ్మతమే అనుకున్నారు. మతం కన్నా మనుషులే గొప్పవారనే సత్యాన్ని చెప్పాడు కాబట్టే వివేకానందుడు ప్రపంచానికే ఆధ్యాత్మిక గురువయ్యాడు. చెప్పదలచుకున్నదాన్ని ఎంత ఆకట్టుకునేలా చెబితే అంత ప్రయోజనం రాబట్టొచ్చని చెబుతుందీ ఘటన.

ఎదుటివారికి ఏది అవసరమో అది ఇస్తే.. వారంతటవారే మన పట్ల ఆకర్షితులవుతారు.. అప్పుడు మనం చెప్పేది వింటారు. ఈ విషయాన్ని నరేంద్రుడు క్రైస్తవ మతంలోని లోపాలను ఎత్తిచూపిన సందర్భంలో చెబుతూ.. 'క్రైస్తవేతరులను తరింపజేసేందుకు' ప్రచారం చేయడంకన్నా ఆకలి నుండి కాపాడడానికి ప్రయత్నించాలని సూచించాడు. అన్నార్తులకు తక్షణం ఇవ్వాల్సింది ఆహారమేగానీ, మోక్షం కల్పించే మాటలు కాదని వివరించాడు.

మతాల మధ్య భేదాభిప్రాయాలపై వ్యాఖ్యానిస్తూ.. నూతిలో పుట్టి పెరిగిన కప్ప ఆ నుయ్యే సమస్త ప్రపంచం అని పొరబడినట్టే వివిధ మతస్థులూ.. ఇతర మతాల్లోని మంచిని గ్రహించకుండా తమ మతమే గొప్పదన్న సంకుచిత భావంతో ఉంటున్నారని వివరించాడు. అందువల్లే మతాల మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయని తెలిపాడు. ఆ పరిధిని దాటి ఆలోచించాలని బోధించాడు. సర్వమత సమ్మేళనం పేరుకు తగ్గట్లుగా ఇదే సందేశమివ్వాలని సూచించాడు. అప్పటివరకూ తమ మతమే గొప్ప అని చెప్పుకున్న వారికి కనువిప్పు కలిగించి వారి మధ్యనున్న భేదాభిప్రాయాలు తొలగించే ప్రయత్నం చేశాడు కాబట్టే స్వామీజీ ప్రసంగానికి అంత ప్రాధాన్యం వచ్చింది.

విత్తనం నాటారు... మట్టి, నీరు, గాలి దాన్ని ఆవరించి ఉన్నాయి. మరి అది మట్టి అవుతుందా? గాలి అవుతుందా? నీరు అవుతుందా? ఏదీ కాదు.. తన స్వభావాన్ని అనుసరించి నీరు, మట్టి, గాలిని తనలో ఇముడ్చుకుని మొక్కగా అభివృద్ధి చెందుతుందని సమ్మేళనంలో చేసిన ఆఖరి ప్రసంగంలో వివరించాడు. మనం కూడా.. ఎవరినో అనుసరిస్తూ మన స్వభావాన్ని కోల్పోరాదు. మనకు కావాల్సినదాన్ని పొందాలి తప్ప మనమే పూర్తిగా మారిపోరాదు అని బోధించాడు.

ఈ విధంగా ఆయన ప్రసంగంలోని మాటలను విశ్లేషించుకుంటూ ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఆచరిస్తూ ఎంతో ప్రయోజనం పొందవచ్చు. ప్రయత్నించండి... ప్రయోజనం పొందండి... ప్రపంచాన్ని జయించండి...

- డేగ కుమార్, మల్లాడి క్రాంతితో కలిసి నేలంటి మదనయ్య

హైకోర్టు కొత్త సీజేగా రాధాకృష్ణన్!

సుప్రీం కోర్టు కొలీజియం ఆమోదం



న్యూఢిల్లీ, జనవరి 11 (మనం లీగల్): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నూతన ప్రధాన న్యాయమూర్తిగా తొట్టతిల్ బి. నాయర్ రాధాకృష్ణన్‌ను నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. ఆయన పేరును ఖరారు చేస్తూ ఆమోదం తెలిపింది. కేరళకు చెందిన ఆయన న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించి.. కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ఎంపికై.. ఆ తర్వాత పదోన్నతిపై ఛత్తీస్‌గఢ్ హైకోర్టుకు సీజేగా వెళ్లారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తుల కొలీజియం ఆమోదం పొందిన.. న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలు రాష్ట్రపతి వద్దకు చేరుతుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కొత్త సీజే నియామక ఉత్తర్వులు వెలువడతాయి. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా రమేశ్ రంగనాథన్ ఉన్నారు. ఆయన్ను వేరే రాష్ట్ర హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తారనే ఊహాగానాలు న్యాయవర్గాల్లో ఉన్నాయి. అయితే కొత్త సీజే వచ్చిన తర్వాత కూడా రమేశ్ రంగనాథన్‌ను అదే హైకోర్టులో న్యాయమూర్తిగా కొనసాగిస్తారని సమాచారం. వచ్చే జూన్‌లో ఏపీకి కొత్త హైకోర్టు ఏర్పాటు సమయంలో రమేశ్‌ను వేరే రాష్ట్రానికి సీజేగా పదోన్నతి లభించే అవకాశముందని న్యాయవర్గాలు భావిస్తున్నాం

'పేర్లు' గాయబ్!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ఆరోపించింది. ఒక్క ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలోనే 17.60 లక్షలకుపైగా ఓటర్లను జాబితా నుంచి తొలగించారని ఆరోపించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనూప్‌సింగ్‌కు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలో నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఓటర్ల నమోదు కార్యక్రమం పెద్ద కుంభకోణమని, అందంతా తప్పుల తడకగా ఉందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ అనుకూలంగా ఓటర్లే లక్ష్యంగా వారి పేర్లను జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. ఈ విషయంలో కమిషనర్ చర్యలు తీసుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు వెనుకాడబోమని హెచ్చరించారు. కాగా, తన ఓటు కూడా గల్లంతయిందని కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా పేర్కొన్నారు. పునర్విభజన నేపథ్యంలో 15 నుంచి 17 వరకు సీట్లు పెరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌లో టీఆర్ఎస్ బలహీనంగా ఉండడంతో ఈ ఓటర్ల తొలగింపు కార్యక్రమాన్ని తెరమీదకు తీసుకవచ్చారని విమర్శించారు. మరోసారి సర్వే చేసి ఓటర్ల జాబితాను సరిచేయాలని డిమాండ్ చేశారు. 2009, 2014 ఎన్నికల్లో, 2015 జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఓటు వేసిన తమ కుటుంబసభ్యుల ఓట్లను సైతం తొలగించారని పేర్కొన్నారు. మాజీ శాసన సభ్యుని ఓటే గల్లంతు అయ్యిందంటే టీఆర్ఎస్ ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. అధికార గర్వంతో రాష్ట్రంలో ఏం చేసినా చెల్లుతుందనే ధోరణిలో నేడు ప్రభుత్వపోకడలున్నాయని విమర్శించారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి మాట్లాడుతూ.. తమ నియోజకవర్గాల్లో 30 వేలకు పైగా ఓటర్లను జాబితానుంచి తొలగించారని, వీరందరూ చాలాకాలంగా ఇక్కడే నివసిస్తున్నా వారేనని పేర్కొన్నారు. అధికార పార్టీకి ఓటు వేయరనే భయంతోనే వీరిని ఓటరు జాబితా నుంచి తొలగించారని విమర్శించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి అర్హులందరికీ తిరిగి ఓటరు జాబితాలో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

ముషీరాబాద్‌లో 50 వేల ఓట్లు తొలగింపు

ముషీరాబాద్ నియోజకవర్గంలోనూ 50 వేల ఓట్లు తొలగించారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నా. గతంలో ఎప్పుడూ ఇంత అడ్డగోలుగా ఓటర్లను జాబితా నుంచి తొలగించలేదని అన్నారు. ఈ విషయంలో కేంద్ర ఎలక్షన్ కమిషన్ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు కూడా ఈ విధంగానే దాదాపు 12 లక్షల మందిని ఓటరు జాబితానుంచి తొలగించారని గుర్తు చేశారు.

ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ బ్యాంకర్లకు సూచించారు. మూతపడిన ఆ పరిశ్రమల పునరుద్ధరకు తోడ్పాటు నివ్వాలని కోరారు. గురువారం హైదరాబాద్‌లోని కోఠి ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రం స్థాయి బ్యాంకర్ల సమితితో మంత్రి సమావేశమయ్యారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు బ్యాంకుల నుంచి అందించాల్సిన సహాయంపై ప్రధానంగా చర్చించారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రతి నెల జిల్లా కేంద్రాల్లో టౌన్ హాల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశాల ద్వారా పరిశ్రమల సమస్యలు తెలుసుకోవడం, ప్రభుత్వపరమైన, బ్యాంకుల పరమైన విషయాల్లో సహకారం అందిస్తామని అన్నారు. జిల్లా పారిశ్రామిక కేంద్రాలులతో సమన్వయం చేసుకుని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల పునరుద్ధరణకు ముందుకు రావాలన్నారు. ఎంఎస్ఎంఈ పరిశ్రమల పునరుద్ధరణకు రెక్టిఫికేషన్, రీస్ట్రక్చరింగ్, రికవరీ అనే త్రీ ఆర్ (3 ఆర్) సూత్రాన్ని పాటించాలన్నారు. ఖాయిలా పడిన పరిశ్రమల పునరుద్ధరణలో యూనిట్ల సమస్యను గుర్తించి, వాటికి పరిష్కారం చూపించి, తమ రుణాలను రికవరీ చేసుకోవాలని బ్యాంకర్లకు కోరారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు పోతుందని తెలిపారు. ఇందులో భాగంగా ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ హెల్త్ క్లినిక్ కు ఆర్బీఐ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సింగ్ కంపెనీగా గుర్తింపు ఇచ్చిందన్నారు. ఇలా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం తెలంగాణే అన్నారు. ఈ ఇండస్ట్రీ హెల్త్ క్లినిక్ కంపెనీలో బ్యాంకర్లు పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధిలో బ్యాంకుల సహకారాన్ని తాము గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలు బ్యాంకుల ఉన్నతాధికారులు, తెలంగాణ పరి శ్రమ శాఖాధికారులు, పరశ్రమ సంఘాలు, సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణం మీదకు తెచ్చిన అభిమానం

పవన్ కల్యాణ్ అభిమానిపై బాలకృష్ణ అభిమాని దాడి

ఇచ్ఛాపురం, జనవరి 11(మనం ప్రతినిధి): సినిమా నటులు మీద ఉన్న అభిమానం ఒకరి ప్రాణం మీదకు తెచ్చింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం సమీపంలోని పురుషోత్తపురం గ్రామంలో గురువారం రాత్రి సినీ నటుడు బాలకృష్ణ అభిమాని, పవన్ కళ్యాణ్ అభిమానిపై బ్లేడుతో దాడి చేసి మెడ మీద కోశాడు. పురుషోత్తపురం గ్రామానికి చెందిన చాట్ల ఫకీరు బాలకృష్ణ అభిమాని, అదే గ్రామానికి చెందిన దనపాన హరిశ్చంద(37) పవన్ కళ్యాణ్ అభిమాని. అజ్ఞాతవాసి సినిమా విషయంలో గురువారం సాయంత్రం ఐదు గంటల సమయంలో వీరిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అయితే రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఫకీరు, హరిశ్చంద్రపై బ్లేడుతో దాడి చేసి మెడపై గాయపరిచాడు.



హై వోల్టేజ్!



(మొదటి పేజీ తరువాయి)

మాటల తూటాలు పేలుస్తూ రాజకీయ పోరాటాన్ని రెండు పార్టీలూ రక్తికట్టిస్తున్నాయి. ముఖ్యంగా 24 గంటల విద్యుత్ సరఫరా ఘనత తమదంటే, తమదేనని అధికార, విపక్షాలు ప్రకటించుకోవడంతో వివాదం మరింత ముదిరింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, కొత్త విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో భారీ అవినీతి చోటుచేసుకున్నదని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అలాగే నిరంతర విద్యుత్ పేరిట సీఎం కేసీఆర్ భారీ అవినీతికి తెరలేపారని విమర్శించింది. ఆయన చీకటి ఒప్పందాలు చేసుకుంటున్నారని తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ అంశంపై బహిరంగ చర్చకు రావాలన్న టీఆర్ఎస్ సవాలుకు కాంగ్రెస్ అంతే దీటుగా స్పందించడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణంలో అవినీతికి అంతులేదని కాంగ్రెస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. భద్రాద్రి ప్లాంట్ పనులను బీహెచ్ఇఎల్‌కు అప్పగించినప్పటికీ ముఖ్యమంత్రికి ఇష్టమైన వ్యక్తికే కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ఇండియా బుల్స్ అనే సంస్థ ఉపయోగిస్తున్న టెక్నాలజీని ఇంతకుముందే అధికారులు తిరస్కరించినా అదే సంస్థకు సీఎం ఈ పనులను ఎలా అప్పగించారో చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. కేంద్రం సూపర్ క్రిటికల్ టెక్నాలజీనే వాడాలని ఆదేశిస్తే పరిస్థితి ఏంటని, ఇది ప్రజలపై పెనుభారం మోపడమే కాగలదని కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. దీనిపై టీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. దమ్ముంటే విద్యుత్‌పై బహిరంగ చర్చకు రావాలని రేవంత్‌ను సవాల్ చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఒకేఒక ఒప్పందం చేసుకున్నామని, ఇందులో అవినీతికి తావులేదని వారు పేర్కొన్నారు. ఏ పనీలేని కాంగ్రెస్ నాయకులకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో అధికారంలోకి రాలేమన్న నిరాశతోనే అనవసర ఆరోపణలు చేస్తున్నారని టీఆర్ఎస్ ఇతర నాయకులు కూడా ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతి లేదని నిరూపిస్తే కాంగ్రెస్ నాయకులు అబిడ్స్‌లో ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. బహిరంగ చర్చకు తాము సిద్ధమని ఎంపీ బాల్క సుమన్‌తోపాటు ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, భానుప్రసాద్ సుముఖత ప్రకటించారు. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు తాము సిద్ధంగా ఉంటామని రేవంత్ రెడ్డి తక్షణం బదులిచ్చారు. కాంగ్రెస్ తరపున తనతోపాటు పీసీసీ అధికార ప్రతినిధి దాసోజ్ శ్రవణ్, ఎమ్మెల్యే సంపత్ కుమార్ వస్తారని ప్రకటించారు. ఇక యాదాద్రి ప్రాజెక్టులో అవినీతి లేదని సీఎం కేసీఆర్ నిరూపిస్తే రాజకీయాల నుంచే తప్పుకొంటానని నల్లగొండ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరో సవాల్ చేశారు.

రేవంత్ ప్రతిపాదనపై స్పందించిన మంత్రి జగదీష్ రెడ్డి విద్యుత్ అంశంపై అసెంబ్లీలో మాట్లాడామని ప్రతిపాదించారు. మరోవైపు సవాల్ చేసిన టీఆర్ఎస్ నాయకులు తాము రేవంత్‌తో చర్చించబోమని, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి లేదా సీఎల్పీ నేత జానారెడ్డితో మాత్రమే చర్చిస్తామని ప్రకటించారు. దీంతో విద్యుత్ ఒప్పందంలో భారీ అవినీతి ఉన్నందునే చర్చకు పిలిచిన టీఆర్ఎస్ నేతలు పారిపోయారని రేవంత్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ అవినీతిని సాక్ష్యాధారాలతో నిరూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ భయంతోనే టీఆర్ఎస్ మాట మార్చిందని రేవంత్ వ్యాఖ్యానించారు. బహిరంగ చర్చకు సవాల్ చేసి, ఇప్పుడు మెలిక పెట్టడంద్వారా టీఆర్ఎస్ నేతలు సెల్ఫ్ గోల్ చేసుకున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. దీన్నిబట్టి ప్రజల ముందు పరోక్షంగా టీఆర్ఎస్ నాయకులు తప్పును అంగీకరించినట్లేనని పేర్కొంటున్నారు. టీఆర్ఎస్ వైఖరితో ప్రజల్లో అనుమానాలు మరింత బలపడ్డాయని చెబుతున్నారు.

గ్రీన్‌కార్డులు రయ్ రయ్

(మొదటి పేజీ తరువాయి)

పెంచాలన్న చట్టాన్ని అమెరికా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. ఇది చట్టరూపం దాలిస్తే ప్రధానంగా భారతీయ టెకీలకు చాలా ప్రయోజనకరం అవుతుంది. అమెరికా భద్రతను కాపాడే చట్టంగా చెబుతున్న ఈ బిల్లు కాంగ్రెస్ ఆమోదం పొంది, అధ్యక్షుడు ట్రంప్ వద్దకు వెళ్లి ఆయన సంతకం కూడా పూర్తి చేసుకుంటే మొత్తం ఇమ్మిగ్రేషన్ స్థాయి మాత్రం ప్రస్తుతమున్న 10.5 లక్షల నుంచి ఏడాదికి 2.60 లక్షలకు తగ్గుతుంది. ప్రస్తుతం గ్రీన్ కార్డులు ఏడాదికి 1.20 లక్షలు మాత్రమే జారీచేస్తుండగా.. వీటిని 1.75 లక్షలకు పెంచాలన్నది ప్రతిపాదన. దానివల్ల ప్రస్తుతం అమెరికాలో పలు రంగాల్లో పనిచేస్తున్న భారతీయులు, ఇతర దేశాల వారికి దాదాపుగా అమెరికన్ పౌరసత్వ హక్కులు లభించే అవకాశాలు పెరుగుతాయి. హెచ్-1బి వీసాల మీద అమెరికాకు వచ్చే సాంకేతిక నిపుణులు, వైద్యులు, ఇతర రంగాల్లో ఉన్నతస్థానాలలో పనిచేసేవారు ఆ దేశంలో చట్టబద్ధమైన శాశ్వత నివాస హోదా పొందేందుకు గ్రీన్ కార్డులు కావాలని కోరుకుంటారు. ఒక అనధికారిక అంచనా ప్రకారం.. అమెరికాలో దాదాపు 5 లక్షల మంది భారతీయులు గ్రీన్‌కార్డుల కోసం వేచి చూస్తున్నారు. అవి వచ్చేరకు వాళ్లు ప్రతి సంవత్సరం తమ హెచ్-1బి వీసాలను పొడిగించుకోవాల్సి ఉంటుంది. గ్రీన్‌కార్డులు రావాలంటే చాలామందికి కొన్ని దశాబ్దాలు కూడా పడుతుంది. అమెరికాలో నిపుణులైన టెకీల సంఖ్య తక్కువగా ఉండటంతో వారికి బదులుగా ఇతర దేశాల నుంచి వచ్చే నిపుణులకు హెచ్-1బి వీసాలు మంజూరు చేస్తారు. ఇవి ఉన్నవాళ్లు వాటి కాలపరిమితి తీరేవరకు మాత్రమే అమెరికాలో ఉండి ఉద్యోగాలు చేసుకోడానికి అర్హత కలిగి ఉంటారు. గ్రీన్ కార్డుల సంఖ్య పెరిగితే వాటికోసం వేచి ఉండాల్సిన సమయం గణనీయంగా తగ్గుతుంది. అది చేతిలో ఉంటే ఇక ఎన్నాళ్లయినా భేషుగ్గా అమెరికాలోనే ఉండి, అక్కడే ఉద్యోగం చేసుకోవచ్చు. అయితే.. 'చైన్ మైగ్రేషన్'కు చెక్ పెట్టడం వల్ల తమ కుటుంబ సభ్యులను అమెరికా తీసుకురావాలని అనుకునేవారికి మాత్రం ఇబ్బందులు తప్పవు. ఈ చట్టం వల్ల తన సొంత భార్య/భర్త, మైనర్ పిల్లలు తప్ప ఇతర బంధువులను అమెరికా తీసుకొచ్చి వారికి గ్రీన్‌కార్డులు ఇప్పించడం సాధ్యం కాదు. కావాలనుకుంటే తల్లిదండ్రులకు మాత్రం తాత్కాలికంగా పొడిగించగల వీసాను మంజూరుచేస్తారు.



దినదినాభివృద్ధి ప్రాప్తిరస్తు



(మొదటి పేజీ తరువాయి)

భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడు ఆవిష్కరించారు. గురువారం తిరుమలకు వేంకటేశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసిన ఉపరాష్ట్రపతి.. స్వామివారి దర్శనం చేసుకున్న తర్వాత పద్మా వతి అతిథి గృహానికి చేరుకున్నారు. అక్కడ మనం క్యాలెండర్‌ను ఆవిష్కరించి, సకల అంశాల సమాహారంగా ఉన్న కాలమానిని బాగుం దని ప్రశంసించారు. ఈ దినపత్రిక దిన దినాభివృద్ధి చెందాలని ఆయన అభిలషించారు. అలాగే.. రానున్న మకర సంక్రాంతి తెలుగు ప్రజల జీవితాల్లో నూతన కాంతులు నింపాలని ఆకాంక్షించారు.

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం

ప్రపంచ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కేంద్రంగా భారతదేశం విరాజిల్లుతోందని, అందుకే విదేశీయులు మనదేశం వైపు చూస్తున్నారని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు అన్నారు. ఉపరాష్ట్రపతి గురువారం ఉదయం తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఉపరాష్ట్రపతిగా పదవీబాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయన వేంకటేశ్వరుని దర్శనానికి విచ్చేశారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. సంక్రాంతి పర్వదినం ముందు స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకోవడం మహాభాగ్యమన్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత మరింత పట్టుదలతో కర్తవ్యాన్ని నిర్వహించేందుకు తమ ఇలవేల్పు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సుల కోసం వచ్చినట్టు తెలిపారు. 'హిందూ' ఒక మతం కాదని, దాన్ని ఒక జీవన విధానంగా చూడాలని రామానుజాచార్యులు, వివేకానందుడు లాంటి మహనీయులు బోధించారని చెప్పారు. 'సర్వేజనా సుఖినోభవంతు' అన్నట్టు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, ఇతరులకు ఉపయోగపడేలా జీవితం సాగించాలని పేర్కొన్నారు. భారతీయ జీవనంలో వారసత్వ సంస్కృతి, జ్ఞానం, యోగా, ఆధ్యాత్మికత ఉన్నాయని, అందుకే ప్రపంచమంతా మనదేశం వైపు చూస్తోందని చెప్పారు. సమాజంలో కులవివక్ష, అంటరానితనాన్ని రూపుమాపాలని, భారతీయులు సర్వమానవ సౌభ్రాతృత్వానికి పాటుపడి వసుదైక కుటుంబంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. పురాణాల్లో చెప్పిన విధంగా ఆకలిదప్పులు లేని, అవినీతికి తావు లేని, వివక్ష లేని రామరాజ్యంగా దేశం విలసిల్లాలన్నారు. యాత్రికుల కోసం టీటీడీ చేసిన ఏర్పాట్లు బాగున్నాయన్నారు. టీటీడీ నిధులను భక్తులకు సౌకర్యాల కల్పనతో పాటు హిందూధర్మ పరిరక్షణకు వెచ్చించాలన్నారు. భక్తులందరికీ స్వామివారి దర్శనం కల్పించేందుకు ప్రముఖులందరూ సహకరించాలని కోరారు. చిన్నప్పట్లో గ్రామమంతా కలిసి 60 మంది ఒకసారి, 120 మంది మరోసారి వచ్చామని గుర్తు చేసుకున్నారు. శ్రీవారి దర్శనంతో తన్మయత్వం పొందుతామని, ఆ అనుభూతి మాటల్లో చెప్పలేనిదని అన్నారు.


సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం

ముందుగా ఉపరాష్ట్రపతి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశించారు. మహాద్వారం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. రాష్ట్ర మంత్రి అమరనాథరెడ్డి, టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు కలిసి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని ఉపరాష్ట్రపతికి అందించారు.

వరాహస్వామికి పూజలు

తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ ఉపరాష్ట్రపతి మొదటగా స్వామిపుష్కరిణి వద్ద గల వరాహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్వో ఆకె రవికృష్ణ, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

సరిహద్దుకు ఆవల..



(మొదటి పేజీ తరువాయి)

చాలు ఆయన అన్నీ పక్కన పెట్టేస్తాడు. ఆ ఫోన్ చేసిన వ్యక్తి కన్నీరు తుడిచేందుకు పరుగులు పెడతాడు. జిల్లా కలెక్టర్ నుంచి కింద స్థాయి దాకా అధికారులతో వాదిస్తాడు. పిటిషన్లతో వేధిస్తాడు. సరిహద్దు దాటివచ్చిన ఆ పాకిస్థానీకి ఆశ్రయం దొరికే వరకు, కడుపు నింపుకొనేందుకు చిరు ఉద్యోగం దొరికేవరకూ ఊరుకోడు. వారికి బ్యాంకు ఖాతాలు తెరిపించడం, శరణార్థి హోదా ఇప్పించడం, ఆ తర్వాత భారతీయ పౌరసత్వం వచ్చేదాకా నిద్రపోడు. వారికి కడుపు నొప్పి నుంచి క్యాన్సర్ దాకా ఏ వ్యాధి వచ్చినా ఉచిత చికిత్స చేస్తాడు, చేయిస్తాడు. పాకిస్థాన్‌లో దుర్భర పరిస్థితుల్లో ఉన్న హిందూ మైనారిటీలందరినీ భారత్‌కు రప్పించడానికే ఆయన కృషి చేస్తున్నాడు.

ఆయన పేరు డాక్టర్ ఓమేంద్ర రత్నూ. నివాసం రాజస్థాన్ లోని జైపూర్. సాధారణంగా కనిపించే ఈ అసాధారణ వ్యక్తితో 'మనం' ముఖాముఖి మీ కోసం!

అసలు పాకిస్థాన్‌లో ఉన్న హిందూ మైనారిటీల కోసం పనిచేయాలన్న ఆలోచన మీకెలా కలిగింది?

ఈ భావన చిన్నప్పటి నుంచే నాలో ఉండేది. మన దేశంలో ముస్లింలు చాలా మంది పాకిస్థాన్‌కు వెళ్లకుండా ఉండిపోయినట్టే పాకిస్థాన్‌లోనూ హిందువులు ఉంటారని నాకు అనిపించేది. వారి గురించి ఆలోచించేవాడిని. రాజస్థాన్ సరిహద్దు రాష్ట్రం. ఇక్కడి రాజపుత్, మేఘవాల్ వంటి వారికి పాకిస్థాన్‌లో చాలా మంది బంధువులున్నారు. వారినుంచి కూడా అక్కడి హిందువుల దుర్భర జీవన పరిస్థితులు, వారిపై మతోన్మాద దాడుల గురించి నాకు తెలుస్తూ ఉండేది. వీరి కష్టాల గురించి తెలుసుకున్నాను. 1947 నుంచి నేటి వరకూ అక్కడ జరుగుతున్న అత్యాచారాల గురించి తెలుసుకున్నాను. ఈ పనిలో నేను నిమగ్నం కావడానికి కారణం సీమాంత్ లోక్ సంఘటన్ (సరిహద్దు ప్రజల సమితి) అనే సంస్థే. ఆ సంస్థ సరిహద్దు ప్రాంతాల ప్రజల కోసం పనిచేస్తుంది. ఆ సంస్థ నుంచే శరణార్థుల గురించి, వారికి భారతదేశంలోకి వచ్చాక ఎలా సాయం చేయాలో తెలుసుకున్నాను. ఆ సంస్థ నేత హిందూసింగ్ సోధా నుంచి చాలా నేర్చుకున్నాను.

మీ సంస్థ చేసే పనేమిటి?

పాకిస్థాన్ నుంచి ప్రాణాలరచేత పట్టుకుని భారత్‌కు వచ్చే హిందువులు చాలా మంది కటిక పేదలే. వారు దేశంలోకి రాగానే వారు తమ పాస్‌పోర్టును భారత ప్రభుత్వానికి అప్పగించి, ఇక్కడ శరణార్థిగా ఉండిపోతారు. గతంలో వారు ఏ జిల్లాకు వస్తే ఆ జిల్లాలోనే ఉండిపోవాలి. ఇప్పుడు తొలి మూడు నెలలు వారు ఒక జిల్లా వరకే పరిమితమైనా, తర్వాత దేశంలో ఎక్కడంటే అక్కడికి వెళ్లవచ్చు. అయితే ముందుగా పోలీసులకు తెలియజేయాలి. వారికి భారత పౌరసత్వం ఇప్పించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, జాబ్ పర్మిట్ ఇప్పించడం, బ్యాంకింగ్ సదుపాయం కల్పించడం, వైద్యసాయం అందించడం కోసం మేము నిమిత్తేకం అనే సంస్థను స్థాపించి పనిచేస్తున్నాం. వారు తాము భారతదేశంలో సురక్షితంగా ఉండగలమన్న భరోసా కల్పించడం కోసం మేం పనిచేస్తున్నాం.

ఎక్కువగా పాకిస్థాన్ లోకి ఏ ప్రాంతం నుంచి శరణార్థులు వస్తున్నారు?

సింధ్ ప్రాంతం నుంచి ఎక్కువ మంది వస్తు న్నారు. కొందరు దక్షిణ పంజాబ్ నుంచి వస్తున్నారు. వారందరూ మేఘవాల్ వర్గానికి చెందినవారు. అక్కడ వస్త్ర వ్యాపారం చేసేవారు. మన దేశంలో మేఘ వాల్‌లు ఎస్సీలు. వీరు భారతదేశంలోకి వచ్చిన తరు వాత, పౌరసత్వం పొందితే, ఇక్కడి మేఘవాల్‌లకు ఏయే సదుపాయాలున్నాయో అవన్నీ పొందగలు గుతారు. శరణార్థులు రాజస్థాన్ మాత్రమే కాదు, పంజాబ్‌కి కూడా వెళ్తుంటారు. సిక్కులయితే పంజాబ్ కి వెళ్తుంటారు. రాజస్థాన్‌కి వచ్చేవారిలో వస్తున్న వారిలో పుష్కర్ణా బ్రాహ్మణులు, మేఘ్‌వాల్‌లు, రాజపుత్రులు, బోడా రాజపుత్‌లు ఉన్నారు.

ఈ శరణార్థులు దొంగచాటుగా వస్తారా.. లేక పాస్‌పోర్టు తీసుకుని వస్తారా?

పాకిస్థాన్ నుంచి వచ్చే వారంతా పాస్‌పోర్టుపైనే భారత్‌లోకి ప్రవేశిస్తారు. నా నలభై ఏళ్ల అనుభవంలో ఒక్క పాకిస్థానీ హిందువు కూడా దొంగచాటుగా వచ్చిన దాఖలాలు లేవు. వీరంతా మతపరమైన కారణాలతో అంటే.. ''తండ్రి అస్థికలను గంగలో కలిపేందుకో, తల్లిదండ్రులకు చార్ ధామ్ యాత్ర చేయించేందుకో'' భారతదేశానికి వస్తారు. రాగానే తమ పాస్‌పోర్టును పోలీసులకు సరెండర్ చేసి, శరణార్థులవుతారు.

> **పాకిస్థాన్ లో హిందువుల పరిస్థితి ఎలా ఉంది?**
>
> అక్కడ హిందువుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అక్కడ చాలా మందిరాలను మూత్రశాలలుగా, పశువధశాలలుగా మార్చేశారు. కొన్ని మందిరాలను కూల్చేశారు. హిందువులు కూడా బయట తిరిగేటప్పుడు తమ పేరు అన్వర్ అనో, అహ్మద్ అనో చెప్పుకుంటారు. మహిళలను బలవంతంగా వివాహం చేసుకోవడం, మతం మార్చడం సర్వసాధారణం. హిందువులు భయోత్పా తాల మధ్య జీవిస్తారు. నేటికీ సగటున ప్రతి రోజూ కనీసం ముగ్గురు యువతులను పాకిస్థాన్‌లో అపహరిస్తున్నారు. పాకిస్థాన్ హ్యూమన్ రైట్స్ కమిషన్ వెబ్ సైట్‌లో 1541 యువతుల బలాత్కారం జరిగిందని అంగీకరించారు కూడా.

పాస్‌పోర్ట్ సరెండర్ చేస్తే వీరి గురించి ప్రభుత్వం ఏం చేస్తుంది?

2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకూ పాకిస్థానీ హిందూ శరణార్థుల గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. ఇక్కడ వారిని పాకిస్థానీలుగానే పరిగణించేవారు. 2016 నుంచి వీరికి జాబ్ పర్మిట్లు, బ్యాంక్ అకౌంట్లు, డ్రైవింగ్ లైసెన్సులు లభించడం మొదలైంది. వీరి వీసాలను ఏడాదికి ఒక సారికి బదులు, ఐదేళ్లకోసారి పొడిగిస్తున్నారు. ప్రస్తుతం నెలకు 200 మందికి మాత్రమే వీసాలు ఇస్తున్నారు. ఈ సంఖ్యను పెంచాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

పాకిస్థాన్‌లో ఉన్న హిందువులతో మీరు ఎలా సంబంధాలు ఏర్పరచుకుంటారు?

మేం ఫోన్ ద్వారా సంభాషిస్తుంటాం. మా సంభాషణలను భారత గూఢచారి విభాగాలు, పాకిస్తానీ ఐఎస్ఐ వింటూంటాయి. చాలా సందర్భాల్లో పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందువులకు ఐఎస్ఐ ఆఫీసర్లు ఫోన్ చేసి బెదిరిస్తూంటారు. మా లాంటి కార్యకర్తలకు కూడా ఐఎస్ఐ ఏజెంట్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తూంటాయి. అయితే మేము దీనిని భయపడే ప్రసక్తే లేదు.

ఈ ఉద్యమానికి నిధులను ఎలా సేకరిస్తున్నారు?

ప్రస్తుతానికి స్థానికంగా మేము డాక్టర్ల నుంచి నిధులను సేకరిస్తున్నాం. దేశంలోని కోటి మంది ప్రజల నుంచి వంద రూపాయల చొప్పున సేకరించగలిగితే వంద కోట్లు సేకరించవచ్చు. తద్వారా పాకిస్థానీ హిందువులకు సాయం చేయవచ్చు.

సీబీఎస్ఈ పరీక్షల షెడ్యూల్ విడుదల

- మార్చి 5 నుంచి ఏప్రిల్ 12 వరకు టెంత్, ఇంటర్ పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 11: కేంద్ర సెకండరీ విద్యా బోర్డు(సీబీఎస్ఈ) పది, పన్నెండో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 5 నుంచి ఏప్రిల్ 12 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. అయితే 12వ తరగతి పరీక్షల షెడ్యూల్ సరిగ్గా చేయలేదని.. కొన్ని పరీక్షల మధ్యలో ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా వెంటవెంటనే పెడుతున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ అధికారులు స్పందించారు. షెడ్యూల్ మార్చడం వీలు కాదని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం.. 12వ తరగతి విద్యార్థులకు మార్చి 20న హిస్టరీ, 21న గణిత పరీక్ష ఉన్నాయి. అంతేగాక.. ఏప్రిల్ 5 నుంచి 7 వరకు వరుసగా సైకాలజీ, పొలిటికల్ సైన్స్, లీగల్ స్టడీస్ పరీక్షలు ఉన్నాయి. ఆ వెంటనే ఏప్రిల్ 9న ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఉంది. మధ్యలో ఉన్న ఏప్రిల్ 8న జేఈఈ ప్రవేశ పరీక్ష జరగనుంది. దీంతో ఇలా వరుసగా పరీక్షలు పెట్టడం వల్ల తాము ఒత్తిడికి గురవుతామని విద్యార్థులు వాపోతున్నారు. పరీక్షల మధ్య గ్యాప్ ఇస్తే చదువుకోడానికి అవకాశం ఉంటుందని కోరుతున్నారు. అయితే దీనిపై సీబీఎస్ఈ అధికారులు స్పందించారు. పోటీపరీక్షలు తదితర అనేక అంశాలను పరిగణనలోకి తీసుకునే షెడ్యూల్‌ను ఖరారు చేశామని చెప్పారు. ఇప్పుడు దాన్ని మార్చడం సాధ్యం కాదన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 11.86లక్షల మంది విద్యార్థులు 12వ తరగతి పరీక్షలు రాయనున్నారు.

సూర్య నమస్కారం చేయండి

- విద్యా సంస్థలకు మధ్యప్రదేశ్ సర్కార్ ఆదేశం

భోపాల్, జనవరి 11: ఆధ్యాత్మికవేత్త స్వామి వివేకానంద జయంతి సందర్భంగా శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని అన్ని విద్యా సంస్థలలో సూర్య నమస్కారం, ప్రాణయామ్ కార్యక్రమాలు నిర్వహించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. కాగా, ఈ ప్రాణయామ్ కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి కాదని, స్వచ్ఛందంగా పాల్గొనవచ్చని స్పష్టం చేసింది. సూర్య నమస్కార్, ప్రాణయామ్ కార్యక్రమాలను శుక్రవారం ఉదయం 9 గంటలకు అన్ని విద్యా సంస్థలలో నిర్వహించాలని ఓ ప్రకటనలో పేర్కొంది. భోపాల్‌లో ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమక్షంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొంటారు.

నింగిలోకి నూరో ఉపగ్రహం

ప్రయోగానికి సర్వం సిద్ధం.. మరికొద్ది గంటల్లో ప్రయాణం

- వెంట మరో 30 శాటిలైట్లు
- ఇందులో 28 విదేశీ అతిథులు
- కొత్త ఏడాదిలో తొలి ప్రయోగం
- గురువారమే ప్రారంభమైన కౌంట్‌డౌన్
- విఫల ప్రయోగం తర్వాత 4 నెలలకు
- షార్ మొదటి ప్రయోగ కేంద్రమే వేదిక
- ఇస్రో విజయాశ్వం పీఎస్ఎల్వీ-సి 40

బెంగళూరు, చెన్నై, న్యూఢిల్లీ, శ్రీహరికోట, జనవరి 11: మరో చరిత్రాత్మక ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. సుమారు నాలుగు నెలల విరామం తర్వాత, కొత్త ఏడాదిలో ఇస్రో సరికొత్త ప్రయాణా న్ని ఈ ప్రయోగంతో ప్రారంభించనుంది. మరికొద్ది గంటల్లో వందో ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి ప్రవేశపెట్టనుంది. దీంతో పాటే మరో 30 ఉపగ్రహాలను పంపించనుంది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం షార్ ప్రథమ ప్రయోగ వేదిక నుంచి శుక్రవారం ఉదయం 9.28 గంటలకు పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్-సి40 నింగిలోకి దూసుకెళ్లనుంది. షార్‌లో జరిగిన మిషన్ రెడీనెస్ రివ్యూ సమావేశంలోను, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్ ఆధ్వర్యంలో లాంచ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశంలోనూ శాస్త్రవేత్తలు ప్రయోగానికి పచ్చజెండా ఊపారు. ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ప్రయోగం విఫలమైన తర్వాత పొరపాట్లను దిద్దుకొని, మార్పులు చేర్పులతో ఈ రాకెట్‌ను ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. శుక్రవారం(నేడు) ఉదయం 9.28 నిమిషాలకు పీఎస్ఎల్వీ-సి40 రాకెట్ ప్రయాణం ప్రారంభించనుంది. ఈ ప్రయోగం కోసం 28 గంటల కౌంట్‌డౌన్‌ను శాస్త్రవేత్తలు గురువారం తెల్లవారుజామునే ప్రారంభించారు. ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహ ప్రయోగం విఫలం కావడంపై సమగ్ర దర్యాప్తు జరిపి, కారణాలను కూలంకషంగా పరిశీలించాక ఈసారి ఆ పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ తెలిపారు. చివరిసారి చేపట్టిన ప్రయోగం విఫలం కావడానికి కారణాన్ని కనుగొన్నాం.. అవసరమైన మార్పులు చేసి ఇక్కడే ప్రయోగాత్మకంగా పరీక్షించి చూశామని వివరించారు. ఫలితాలపై సంతృప్తి చెందాకే ప్రయోగం చేపడుతున్నట్లు తెలిపారు. విజయాశ్వంగా పిలుచుకునే పీఎస్ఎల్వీ రాకెట్‌తో 42వ సారి ఇస్రో చేపడుతున్న ఈ ప్రయోగంలో మొత్తం 31 రాకెట్లు అంతరిక్షంలోకి చేరనున్నాయి. ఇందులో మనదేశానికి చెందిన కార్టోశాట్-2ఇ సహా ఒక నానో, మైక్రో శాటిలైట్లు, విదేశాలకు చెందిన 28 మైక్రో, నానో శాటిలైట్లను కక్ష్యలో ప్రవేశపెడుతుంది. వీటిలో 710 కిలోలు ఉన్న కార్టోశాట్ ఉపగ్రహంతో భూ పరిశీలనతో పాటు వాతావరణ అధ్యయనం చేయనున్నట్లు సమాచారం. కార్టోశాట్‌తో పాటు మిగతా ఉపగ్రహాల మొత్తం బరువు 1,323 కిలోల పేలోడ్‌తో 320 టన్నుల బరువున్న పీఎస్ఎల్వీ రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లనుంది. దాదాపు రెండు గంటల ఇరవై నిమిషాల పాటు జరిగే ఈ సుదీర్ఘ ప్రయాణంలో తాను మోసుకెళ్లిన ఉపగ్రహాలను రెండు విభిన్న కక్ష్యలలోకి ప్రవేశపెడుతుంది. దశలవారీగా సాగే ప్రయాణంలో నాలుగో దశలో సరికొత్త ఆపరేషన్‌ను చేపట్టనున్నట్లు సమాచారం. ఈమేరకు మిషన్ రెడీనెస్ రివ్యూ కమిటీ భేటీలో రాకెట్ ప్రయోగానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి శాస్త్రవేత్తలు కౌంట్‌డౌన్‌కు అనుమతిచ్చారు. దీంతో గురువారం ఉదయం 5.29 నిమిషాలకు రాకెట్ ప్రయోగానికి 28 గంటల కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

ఆ ఉపగ్రహాలు ఇవే..

కార్టోశాట్-2, ఓ మైక్రో శాటిలైట్‌తో పాటు మరో నానో శాటిలైట్ సహా ఆరు దేశాలకు చెందిన 3 మైక్రో శాటిలైట్లు, 25 నానో శాటిలైట్లు

ఏయే దేశాలు..

కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, యుకె, యుఎస్

ప్రత్యేకతలు

మొత్తం 31 రాకెట్లు,
1323 కిలోల పేలోడ్..
రాకెట్.. పీఎస్ఎల్వీ సి40
పొడవు.. 44.4 మీటర్లు
బరువు.. 320 టన్నులు
వేదిక.. షార్ ప్రథమ ప్రయోగ వేదిక





కార్టోశాట్ ఉపగ్రహం..


కార్టోశాట్ పేరు కార్టొగ్రాఫి, శాటిలైట్ పదాల కలయికతో పుట్టింది. ఈ ఉపగ్రహంలో అత్యాధునిక పాంక్రోమాటిక్, మల్టీ-స్పెక్ట్రల్ కెమెరాలను అమర్చారు. ఈ కెమెరాల సాయంతో హైరిజల్యూష న్ చిత్రాలను తీయవచ్చు. దీంతో ఉపగ్రహ చిత్రాలలో మరింత స్పష్టత రానుంది. వీటితో భూ పరిశీలనతో పాటు వాతావరణ అధ్యయనం చేపట్టనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. గ్రామీణ, పట్టణా లలో వివిధ ప్రాంతాలకు సంబంధించిన స్పష్టమైన మ్యాప్‌లను గీయవచ్చని, తీరప్రాంతాల్లో భూమి ఉపయోగం, నియంత్రణ, నీటి పంపిణీ, రోడ్ నెట్‌వర్క్ పర్యవేక్షణ తదితర ఉపయోగాలు ఉంటాయని వివరించారు. ముఖ్యంగా జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) అప్లికేషన్‌కు ఈ ఉప గ్రహం ఎంతగానో ఉపయోగకరమని పేర్కొన్నారు. హై రిజల్యూషన్ చిత్రాలను తీసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన ఉపగ్రహాలే కార్టోశాట్-2 సిరీస్ శాటిలైట్లు.. ఇందులో కార్టోశాట్-2ఎ, 2బి ఉపగ్రహాలను ఇప్పటికే విజయవంతంగా ప్రయోగించామని శాస్త్రవేత్తలు తెలిపారు.

పొరపాట్లు దిద్దుకుని..

నావిక్ సిరిస్‌లో భాగంగా పంపించిన ఉపగ్రహం మొరాయించడంతో గత ఏడాది ఆగస్టు 31న ఇస్రో ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ శాటిలైట్ ప్రయోగం చేపట్టింది. స్వదేశీ, విదేశీ ఉపగ్రహాలతో నింగికె గిసిన పీఎస్ఎల్వీ-సి39 రాకెట్ హీట్ షీల్డ్ తెరుచుకోలేదు. దీనిని తెరిచేందుకు శాస్త్రవేత్తలు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో ఉపగ్రహ ప్రయోగం విఫలమైందని ప్రకటించారు. వరుస విజయాలతో దూసుకెళుతున్న ఇస్రో ఈ ఓటమికి కారణాలను అన్వేషించింది. నిపుణుల ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీతో విచారణ జరిపించి రాకెట్‌లోని హీట్‌షీల్డ్ విచ్చుకోకపోవడానికి కారణాల ను కనుక్కుంది. ఈ పొరపాట్లను సరిదిద్దుకొని, పలుమార్లు పరీక్షించి సంతృప్తి చెందాకనే తాజా ప్రయోగం చేపట్టింది. ఈమేరకు ఇస్రో చైర్మన్ విలేకరులకు తెలిపారు. ఉపగ్రహ ప్రయోగం నేపథ్యం లో చైర్మన్ ఏఎస్ కిరణ్ కుమార్ షార్‌కు చేరుకున్నారు.

దయతలిస్తే దద్దోజనం తింటా!

- మరేం పర్లేదు.. జైల్లోనే పెట్టిస్తా
- లాలూ వినతి... జడ్జి జవాబు



రాంచీ, జనవరి 11: మకర సంక్రాంతికి ఇంట్లో దద్దోజనం తినే అదృష్టం బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్‌కు లభించలేదు. ''ఏటా మా ఇంట్లో ఘనంగా వేడుక నిర్వహించి అందరికీ దద్దోజనంతో విందివ్వడం మా సంప్రదాయం. ఇందుకు అనుమతించండి.. ప్లీజ్'' అని ఈ సాకుతోనైనా బెయిలు పొందాలని చూశారు. కానీ, ''మరేం పర్లేదు.. జైల్లోనే దద్దోజనం పెట్టిస్తా''నని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి శివపాల్ సింగ్ భరోసా ఇచ్చారు. పెరుగు, అటుకులతో చేసే దద్దోజనం (దహీ చుర్రా) అంటే పాపం... లాలూకెంతో ఇష్టం! కాగా, దాణా కుంభకోణానికి సంబంధించిన రెండో కేసులో శిక్షపడి బిర్సాముండా జైల్లో ఉన్న లాలూ బుధవారం మూడో కేసులో విచారణ కోసం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జిని మంచి చేసుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ ప్రయత్నాల్లో భాగంగా... తనను కలిసేందుకు వారానికి ముగ్గురు సందర్శకులను మాత్రమే జైలు అధికారులు అనుమతిస్తున్నారని, ఈ సంఖ్య పెంచాలని అభ్యర్థించారు. పైగా... ''మీకు అపరిమిత అధికారం ఉంది.. మీరు తలచుకుంటే ఏ నిబంధనైనా తలవంచుతుంది'' అని గుర్తుచేశారు. కానీ, ఆ పొగడ్తకు ఉబ్బిపోని న్యాయమూర్తి ''ఆ శక్తి నాక్కాదు... చట్టసభకే ఉంటుంది'' అని స్పష్టం చేశారు. ఇక తనకు తక్కువ శిక్ష విధించాలని వేడుకున్నా కనికరించకపోవడంపై లాలూ నిష్ఠురమాడారు. ''నాకు మూడున్నరేళ్ల శిక్ష విధించినా కోర్టును నేను పల్లెత్తు మాటైనా అనలేదు'' అని మరోసారి ప్రసన్నం చేసుకునేందుకు యత్నించారు. దీనిపై జడ్జి స్పందిస్తూ- ''నిజమే... మీరు ఒక్కమాటా మాట్లాడలేదు.. కానీ, మీ మద్దతుదారులు తమ చూపులు, హావభావాలతోనే మీ స్పందనేమిటో చూపించేశారు'' అని వ్యాఖ్యానించారు. ఇక చివరి ప్రయత్నంగా- ''నేనో లాయర్‌ను. సుప్రీం-హైకోర్టులలో న్యాయవాదిగా నా పేరు నమోదై ఉంది. నా ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని శిక్ష వేస్తానని చెప్పారు. కానీ ఏ మాత్రం కనికరం లేకుండా మూడున్నరేళ్ల జైలు శిక్ష విధించారు'' అని వాపోయారు. ఈ వాదనను జడ్జి కొట్టిపారేస్తూ... ''మరి మీరు ఆ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదుగా... అందుకే మూడున్నరేళ్ల శిక్ష వేశాను'' అని తేల్చేశారు. అంతేకాకుండా ''మీకు సేవ చేయడం కోసం మీ అనుచరులిద్దరు స్వచ్ఛందంగా అరెస్టయి జైలుకు వచ్చారటగా? ఆ వార్తలు నేను చూశాను'' అని వ్యాఖ్యానించారు. అయితే, అదంతా మీడియా సృష్టే తప్ప వాస్తవం లేదని లాలూ ఖండించారు. ఇక లాలూ జైలు పాలవడం ఇది ఎనిమిదోసారి కాగా, ఇంతకుముందు రాజభోగాలు కొనసాగాయి. ఇప్పుడు తొలిసారి జైలు అధికారులు ఆయనకు నిబంధనల పుస్తకం ముందుపెట్టి చుక్కలు చూపిస్తున్నారు.

ఇంటర్‌లో అఫ్జల్ కొడుకు డిస్టింక్షన్

శ్రీనగర్, జనవరి 11: పార్లమెంట్‌పై ఉగ్రవాద దాడి కేసులో దోషి అఫ్జల్ గురు కొడుకు గాలిబ్ గురు ఇంటర్‌లో డిస్టింక్షన్‌లో పాసయ్యాడు. జమ్మూ కశ్మీర్ బోర్డు ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ గురువారం ఫలితాలను విడుదల చేసింది. 12వ తరగతి పరీక్షలో గాలిబ్ 88 శాతం మార్కులు సాధించాడు. బంధువులు, స్నేహితులు, పలువురు ప్రముఖులు అతనికి అభినందనలు తెలిపారు. మొత్తం 58.92 శాతం బాలురు, 64.31 శాతం బాలికలు ఉత్తీర్ణులయ్యారు. కాగా 2001లో పార్లమెంట్‌పై జరిగిన దాడి కేసులో దోషిగా తేలిన అఫ్జల్ గురుకు 2013లో ఉరిశిక్ష అమలు చేశారు.

శుద్ధ దండగ!

ఆధార్ కల్పిత సంఖ్యపై పిటిషనర్లు

- 17న సుప్రీం కోర్టులో వ్యతిరేకిస్తాం
- గుర్రాలు పారిపోయాక గేటుకు తాళం
- కాంగ్రెస్ నేత చిదంబరం పరిహాసం
- అన్నీ కట్టుకథలే.. భద్రతకు ఢోకాలేదు
- యూఐడీఏఐ మాజీ చైర్మన్ నీలేకని



న్యూఢిల్లీ, జనవరి 11: 'ఆధార్'కు అదనపు భద్రత పేరిట విశిష్ట గుర్తింపు సంఖ్య ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) ప్రకటించిన 16 అంకెల 'కల్పిత సంఖ్య' (వర్చ్యువల్ ఐడీ) పరిజ్ఞానం 'శుద్ధ దండగే'నంటూ గురువారం విమర్శలు వెల్లువెత్తాయి. ఇదొక 'పనికిరాని... రుజువుకాని పరిజ్ఞాన'మని ఆధార్‌పై సుప్రీం కోర్టులో పోరాడుతున్న పిటిషనర్లు స్పష్టం చేశారు. ఈ నెల 17నాటి వాయిదాలో విచారణ సందర్భంగా దీన్ని పూర్తిస్థాయిలో వ్యతిరేకిస్తామని ప్రకటించారు. సమాచార భద్రతకు ఇప్పటికే ముప్పు ఏర్పడిందని, తీరా ఇప్పుడు దాన్ని పూడుస్తామని యూఐడీఏఐ బయల్దేరిందని ఎద్దేవా చేశారు. దీనికితోడు ప్రపంచ ప్రామాణీకరణ ఏజెన్సీలు... ప్రత్యేకించి ప్రభుత్వ సంస్థలకు కూడా ఈ-కేవైసీ ధ్రువీకరణ వెసులుబాటును యూఐడీఏఐ కల్పించడం గమనార్హం. ఇక 16 అంకెల కల్పిత సంఖ్యపై బుధవారం నాటి ప్రకటనను కేంద్ర మాజీ మంత్రి చిదంబరం దుయ్యబట్టారు. ఇది ''గుర్రాలు పారిపోయాక గుర్రపుశాలకు తాళం వేసినట్లు''ందని పరిహాసం చేశారు. జరగకూడని నష్టం వాటిల్లిన తర్వాత నివారణ చర్యలు తీసుకుని ప్రయోజనం ఏమిటని సామాజిక మాధ్యమం ట్విట్టర్‌లో ప్రభుత్వాన్ని నిలదీశారు. ''మెడమీద కత్తిపెట్టినట్లు ప్రభుత్వం అన్నిటికీ ఆధార్‌ను తప్పనిసరి చేసింది. ఫలితంగా గత్యంతరం లేక కోట్లాది ప్రజలు తమ ఆధార్ సంఖ్యను వివిధ సేవాప్రదాతలకు అందజేశారు. ఇంతమంది ప్రజల బయోమెట్రిక్ వివరాలు సదరు సేవాప్రదాతల రికార్డుల్లో చేరిపోయాక భద్రత ఎలా సాధ్యం?'' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి మనీష్ తివారీ కూడా ఓ ట్వీట్‌లో ప్రభుత్వ చర్యను తప్పుబట్టారు. ''వ్యక్తిగత గుర్తింపుద్వారా భారత పౌరులు ప్రాథమిక సేవలను అందుకునే వీలు కల్పించడమే ఆధార్ లక్ష్యం. అంతేతప్ప ప్రభుత్వ పెద్దన్న ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో జనంపై నిఘా వేయడానికి ఉపకరణంగా ఉపయోగపడటానికి కాదు. కానీ, ఇప్పుడు జరుగుతున్నది ఇదే. సాంకేతిక పరిజ్ఞానం రెండంచుల కత్తివంటిదనడానికి ఇదే తిరుగులేని రుజువు'' అని వ్యాఖ్యానించారు. ప్రజలకు సౌకర్యం కోసం రూపకల్పన చేసిన ఈ సదుపాయాన్ని ప్రతిచోట, ప్రతిసారి వెల్లడించాల్సిన దౌర్భాగ్యం ఏమిటని తివారీ విమర్శించారు.

'ఆధార్‌కు గండి'పై విదేశీ మీడియాలోనూ వార్తలు


ఆధార్ సమాచారం గల్లంతైనట్లు వార్తా కథనం ప్రచురితమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఈ వ్యవస్థకు అదనపు భద్రత కల్పిస్తున్నదని విదేశీ మీడియా సంస్థలు కూడా పేర్కొంటున్నాయి. ''డిజిటల్ వ్యాలెట్‌ద్వారా కేవలం 8 డాలర్లు చెల్లిస్తే ఓ గుర్తుతెలియని సంస్థ లక్షలమంది భారతీయుల ఆధార్ సమాచారం ఇచ్చేసిందట'' అని వివరించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 16 అంకెల కల్పిత సంఖ్యతో తాత్కాలిక గుర్తింపు ఇచ్చే సాఫ్ట్‌వేర్‌ను రూపొందించిదని పేర్కొన్నాయి. అలాగే బ్యాంకులు, కంపెనీలకు నిర్దిష్ట ధ్రువీకరణ ఏజెన్సీ పరిమిత 'విశిష్ట టోకెన్' ఇవ్వడంద్వారా వినియోగదారుల ఆధార్ సమాచారం వారి రికార్డులలో నిల్వకాకుండా చూస్తుందని వివరించాయి. అయితే, సదరు సమాచారం దుర్వినియోగం అవుతున్నందున ఇప్పటికే వాటిల్లిన నష్టాన్ని నివారించడం ఎలా సాధ్యమని కార్నెగీ ఇండియా పరిశోధక విశ్లేషకుడు సక్షమ్ ఖోస్లా ప్రశ్నించారు. పైగా 'కల్పిత సంఖ్య సృష్టి' సేవలందించే సంస్థలకు చెల్లింపులు తప్పనందువల్ల వ్యయభారం పెరుగుతుందన్నారు.

వందశాతం కట్టుకథలే — యూఐడీఏఐ మాజీ చైర్మన్

ఆధార్‌పై వినవస్తున్న వార్తలన్నీ వందశాతం కట్టుకథలేనని యూఐడీఏఐ మాజీ చైర్మన్ నందన్ నీలేకని అన్నారు. ఈ మేరకు ట్రైబ్యూన్ పత్రికలో వచ్చిన వార్తను ఆయన ఖండించారు. గోరంతను కొండంతలు చేస్తున్నారని, ఆధార్‌కు పలు అంచెల భద్రత కవచం ఉందని ఆయన పేర్కొన్నారు. ఆధార్‌పై ప్రతికూల అభిప్రాయాలవల్ల ప్రతికూల ప్రభావాలుంటాయని హెచ్చరించారు. దేశంలో ఇప్పటికే 119 కోట్లమంది ప్రజలకు ఆధార్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. అంతేకాకుండా 55 కోట్లమంది ఆధార్‌ను తమ బ్యాంకు ఖాతాలతో సంధానించారని, ప్రత్యక్ష నగదు బదిలీద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇప్పటివరకూ రూ.95వేల కోట్లు జమ అయిందని పేర్కొన్నారు. ఆధార్ పటిష్ఠతకు ఇదే రుజువని, ఈ నెల 17నాటి విచారణలో సుప్రీం కోర్టు కూడా సానుకూల తీర్పు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యూఐడీఏఐ భాండాగారం అంత పటిష్ఠమైనదే అయితే, తాజాగా కల్పిత సంఖ్య భద్రత ఎందుకన్న ప్రశ్నకు- 'వ్యక్తిగత గోప్యతకు మరింత రక్షణనివ్వడం కోసమే'నని బదులిచ్చారు.

కేరళ సీఎంకు సుప్రీం నోటీసు

- 4 వారాల్లో వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశం
- విజయన్‌ను వెంటాడుతున్న ఎస్ఎన్‌సీ కేసు



న్యూఢిల్లీ, జనవరి 11: ఎస్ఎన్‌సీ-లావలిన్ అవినీతి కేసులో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు సుప్రీం కోర్టు నోటీసు జారీ చేసింది. నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు నుంచి విజయన్‌కు కేరళ హైకోర్టు విముక్తి కల్పించడాన్ని సవాల్ చేస్తూ సీబీఐ చేసిన అప్పీలును సుప్రీం కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ కేసులో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని, విముక్తి పొందిన నిందితులందరికీ నోటీసు జారీ చేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విన్నవించారు. సీబీఐ విన్నపాన్ని అంగీకరిస్తూ విజయన్‌తో పాటు మరో ఇద్దరికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు విచారణపై స్టే విధించింది. కేరళ రాష్ట్ర విద్యుత్ సంస్థకు, కెనడాకు చెందిన ఎస్ఎన్‌సీ లావలిన్‌కు మధ్య జరిగిన మూడు హైడ్రోఎలెక్ట్రిక్ ప్రాజెక్టుల కాంట్రాక్టు ఒప్పందంలో అవినీతి చోటు చేసుకుందని ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసి విచారణ జరుపుతోంది. 1997లో కేరళ విద్యుత్ శాఖ మంత్రిగా విజయన్ హయాంలో ఈ ఒప్పందం జరిగిందని, అవకతవకలు జరిగాయని సీబీఐ అభియోగం నమోదు చేసింది. కాగా కేరళ హైకోర్టు ఈ కేసు నుంచి విజయన్ సహా ముగ్గురికి విముక్తి కల్పించగా.. సీబీఐ సుప్రీం కోర్టును ఆశ్రయించింది.

ఆవులు దొంగలించారని దళితులకు గుండు కొట్టించి.. ఊరేగించారు

బాలియా(ఉత్తరప్రదేశ్), జనవరి 11: ఆవులు దొంగతనం చేశారనే నెపంతో హిందూ యువ వాహిని కార్యకర్తలు, ఇద్దరు దళితులకు గుడ్డు కొట్టించి, ఊరేగించిన ఘటన ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని రాసరా పోలీసు స్టేషన్ ప్రాంతంలో జరిగింది. ప్రవీణ్ శ్రీవాస్తవ అనే వ్యక్తి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరు దళితులను దొంగతనం కేసులో అరెస్టు చేశారు. అరెస్టు అయిన దళితుల్లో ఒకరైన ఉమారామ్, సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి హిందూ యువ వాహిని కార్యకర్తలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోను అనే వ్యక్తితో కలిసి తాను ఆవులను తీసుకువస్తుండగా, హిందూ యువ వాహిని కార్యకర్తలు తమని అడ్డగించి, గుడ్డు గీయించారన్నారు. అనంతరం మెడకు టైర్లు తగిలించి, 'హమ్ గాయ్ చోర్ హై'(మేము ఆవుల దొంగలం) అని ఉన్న ప్లకార్డులను తగిలించి రాసరా గ్రామంలో తిప్పారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మొత్తం 16 మందిపై కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు జరుగుతోంది.

బీజేపీ, ఆర్ఎస్సెస్ సభ్యులు ఉగ్రవాదులు

- కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యాఖ్య

బెంగళూరు, జనవరి 11: బీజేపీ, ఆరెస్సెస్ సభ్యులను ఉద్దేశించి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ రెండు సంస్థల్లోని సభ్యులు ఉగ్రవాదుల వంటివారని, అలాంటి వారు సమాజంలో సమస్యలు సృష్టిస్తుంటే సహించేది లేదని హెచ్చరించారు. ఆరెస్సెస్‌తోపాటు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా లాంటి సంస్థల కార్యకర్తలు ఉగ్రవాదుల్లా మారి సమాజంలో అశాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడేందుకు వారు చేసింది ఏమీ లేదని, అందుకే వారు హిందూత్వం గురించి తరచూ మాట్లాడుతుంటారని ఎద్దేవా చేశారు. తన పేరులోనే హిందువునని గుర్తింపు ఉందని తాను మానవత్వమున్న హిందువునని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. తన జీవితంలో రాజకీయాలతో కులం, మతాన్ని ఎప్పుడూ వాడలేదని సిద్ధరామయ్య అన్నారు. కర్ణాటకలో బీజేపీ ఓడిపోతుందని అందుకే వారు మతాలపరంగా సమాజాన్ని చీల్చేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు.



'ఇంతలో ఎన్నెన్ని వింతలో' ట్రైలర్ విడుదల

నందు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇంతలో ఎన్నెన్ని వింతలో'. హరిహర చలన చిత్ర సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఎస్ శ్రీకాంత్ రెడ్డి, ఇప్పిలి రామమోహనరావు నిర్మాతలు. వరప్రసాద్ వరికూటి దర్శకత్వం వహిస్తున్నారు. నందు హీరోగా సౌమ్య వేణుగోపాల్ నాయికగా పూజ రామచంద్రన్ కీలక పాత్రలలో వస్తున్న ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ని వి వి వినాయక్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వి వి వినాయక్ మాట్లాడుతూ ''ఈ చిత్ర దర్శకుడ వరప్రసాద్ నా శిష్యుడు. సినిమా చాలా బాగా వచ్చిందని విన్నాను. ట్రైలర్ కూడా బావుంది. వరప్రసాద్‌కి మంచి హిట్ వచ్చి పెద్ద హీరోలతో తీసేంతగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని తెలిపారు. నిర్మాత ఇప్పిలి రామమోహన రావు మాట్లాడుతూ ''మా ''ఇంతలో ఎన్నెన్ని వింతలో '' చిత్ర థియేటరికల్ ట్రైలర్ ను .వి.వి వినాయక్ గారు మేం అడగ్గానే విడుదల చేయడం సంతోషంగా ఉంది. సినిమా ఉత్కంఠభరితమైన కథనంతో విభిన్నంగా ఉంటుంది. ఫిబ్రవరిలో సినిమాను తెరపైకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఈ నగరానికి ఏమైంది?



• తరుణ్ భాస్కర్

2016లో విడుదలైన 'పెళ్ళిచూపులు' చిత్రం ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాను చక్కగా తెరకెక్కించిన దర్శకుడు తరుణ్ భాస్కర్‌కు చాలా మంచి పేరు వచ్చింది. దర్శకుడిగా తరుణ్‌కు మంచి అవకాశాలే వచ్చాయి. అయితే వెంటనే సినిమాను స్టార్ట్ చేయకుండా తరుణ్ మంచి స్క్రిప్ట్‌ను తయారు చేయడానికి సమయం తీసుకున్నారు. ఇప్పుడు ప్రముఖ సంస్థ సురేష్ ప్రొడక్షన్స్ పతాకంపై తరుణ్ సినిమా చేయబోతు న్నారు. ఇందులో 'వెళ్ళిపోమాకే' ఫేమ్ విశ్వక్, అనీషా అంబ్రోస్ హీరో హీరోయి న్లుగా నటిస్తారు. ఫ్రెండ్ షిప్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్న ఈ సినిమాకు 'ఈ నగరానికి ఏమైంది' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని సమాచారం.




• పరిణీతి చోప్రా

కేసరితో పరిణీతి

కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ పాత్రలతోనూ మెప్పించిన కథానాయిక పరిణీతి చోప్రా. సెకండ్ ఇన్నింగ్స్‌లో.. 'గోల్‌మాల్ ఎగైన్' రూపంలో బ్లాక్‌బస్టర్ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్న ఈ ముద్దుగుమ్మ.. ప్రస్తుతం అర్జున్ కపూర్‌తో 'సందీప్ ఔర్ పింకీ పరార్' సినిమా చేస్తోంది. తాజాగా ఈ బ్యూటీని ఓ బంపర్ ఆఫర్ వరించింది. అదేమిటంటే.. 'కేసరి' పేరుతో అక్షయ్ కుమార్ కథానాయకుడిగా ఓ హిందీ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కథానాయికగా నటించే ఛాన్స్ కొట్టేసింది పరిణీతి. అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ధర్మ ప్రొడక్షన్స్ పతాకంపై కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని హోలీ పండుగ సందరేంగా వచ్చే ఏడాది ఏప్రిల్ నెలలో విడుదల చేయనున్నారు.

'అసాధ్యుడు'కి 50 వసంతాలు



• అసాధ్యుడులో కృష్ణ

కృష్ణ హీరోగా నటించి.. సంక్రాంతికి తొలిసారి విడుదలైన సినిమా 'అసాధ్యుడు'. 1968 జనవరి 12న ఈ చిత్రం విడుదలై ఘనవిజయం సాధించడంతో కృష్ణకు సంక్రాంతి సెంటిమెంట్ మొదలైంది. ఈ చిత్రం నేటికి 50 వసంతాలను పూర్తి చేసుకుంది. టైగర్ ప్రొడక్షన్స్ పతాకంపై వి.రామచంద్రరావు దర్శకత్వంలో నెల్లూరు కాంతారావు, ఎస్.హెచ్.హుస్సేన్మ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. క్రైమ్ నేపథ్యంలో రూపొందిన చిత్రమైనప్పటికీ కథలోని కొత్తదనం వల్ల ఘనవిజయాన్ని అందుకుంది. అడ్వంచర్ సినిమాల్లో ఒక కొత్త ఒరవడిని తీసుకొచ్చిన సినిమా 'అసాధ్యుడు'. ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా ఒక బ్యాలేని రూపొందించారు దర్శకుడు రామచంద్రరావు. ఇందులో కృష్ణ తొలిసారి అల్లూరి సీతారామరాజు'గా నటించారు. ఈ చిత్రం ద్వారా ప్రముఖ ఛాయాగ్రాహకుడు వి.ఎస్.ఆర్.స్వామి పరిచయం కావడం విశేషం. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ ''ఈ జనవరి 12కి 'అసాధ్యుడు' రిలీజ్ అయి 50 సంవత్సరాలు పూర్తయింది. మొట్టమొదట సంక్రాంతికి విడుదలైన చిత్రమిదే. అందులోనే 15 నిమిషాలు ఉండే బ్యాలేలో అల్లూరి సీతారామరాజుగా నేను యాక్ట్ చేశాను. అప్పటి నుంచి అల్లూరి సీతారామరాజు ఫుల్ పిక్చర్ చెయ్యాలని మనసులో ఓ కోరిక వుండేది. ఈ బ్యాలేని దర్శకుడు రామచంద్రరావుగారే పిక్చరైజ్ చేశారు. ఆ తర్వాత 'అల్లూరి సీతారామారాజు' చిత్రానికి కూడా ఆయన్నే డైరెక్టర్‌గా సెలెక్ట్ చేసుకొని ప్రారంభించడం జరిగింది'' అన్నారు.

సరికొత్త పాత్రలో..




• శర్వానంద్

కొత్త తరహా కథలకు స్వాగతం పలికే యువ కథా నాయకుల్లో శర్వానంద్ ఒకరు. ఇటీవలే 'మహాను భావుడు'లో ఓసీడీ ఉన్న యువకుడిగా కనిపించి ఘన విజయాన్ని అందు కున్నాడు శర్వా. ప్రస్తుతం ఈ యంగ్ హీరో రెండు చిత్రాలతో బిజీగా ఉన్నాడు. వాటిలో ఒకటి సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతుండగా.. మరోటి హను రాఘవపూడి డైరెక్షన్‌లో రూపొందుతోంది. ఈ రెండు సినిమాలు కూడా ఇటీవలే పట్టాలెక్కాయి. ఇదిలా ఉంటే.. సుధీర్ వర్మ చిత్రంలో శర్వా కొత్త లుక్‌తో దర్శనమివ్వనున్నారని టాలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పాత్ర కోసం ఆయన తెల్ల జుట్టు, ముడతలు పడిన ముఖంతో కనిపించనున్నారని.. ఇప్పటికే ఈ లుక్ తాలుకూ స్పెషల్ ఫొటో షూట్ కూడా నిర్వహించారని సమాచారమ్. శర్వా లుక్‌కి చిత్ర యూనిట్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చిందని.. శర్వా ఖాతాలో మరో మంచి పాత్ర చేరడం ఖాయమని ఇన్‌సైడ్ సోర్స్ చెప్పుకొస్తోంది. నిత్యా మీనన్, కాజల్ అగర్వాల్ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదిలోనే తెరపైకి రానుంది.

లఘు చిత్రాల్లో...



• రాజమౌళి



• ఎన్టీఆర్



• విజయ్ దేవరకొండ

ప్రజలకు వారి చుట్టూ.. జరుగుతున్న నేరాలను తెలియజేసి..వాటి పట్ల అప్రమత్తతను పెంచేందుకు తెలంగాణ పోలీసులు వినూత్నమైన పనికి శ్రీకారం చుట్టారు. అదే లఘు చిత్రాలను రూపొందించడం. సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న నేరాలు, క్రెడిట్, డెబిట్ కార్డుల్లో జరుగుతున్న మోసాలు, మార్కెటింగ్‌లో జరుగుతున్న మోసాలు.. ఇలా పలు విషయాల పట్ల అవగాహన పెంపొందించడానికి లఘు చిత్రాలను చిత్రీకరించారు. ఈ చిత్రాల్లో ఎస్.ఎస్.రాజమౌళి, ఎన్టీఆర్, విజయ్ దేవరకొండలు కనిపించనున్నారు. చిత్ర ప్రముఖులు లఘు చిత్రాల్లో నటించడం ద్వారా ప్రజలకు చేరవేయాలనుకున్న విషయం త్వరగా రీచ్ అవుతుందని పోలీసులు భావిస్తున్నారు.



• రకుల్ ప్రీత్ సింగ్

నాని జతగా రకుల్

వరుస విజయాలతో దూసు కుపోతున్న కథానాయకుడు నాని. తాజాగా 'ఎం.సి.ఎ'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం 'కృష్ణార్జున యుద్ధం' చేస్తున్న నాని.. నాగార్జునతో ఓ మల్టీస్టారర్ మూవీ చేయడానికి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించనున్న ఈ సినిమాలో నానికి జోడీగా రకుల్ ప్రీత్ సింగ్ నటించే అవకాశముందని వార్తలు వినిపిస్తున్నాయి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం త్వరలోనే పట్టాలెక్కనుంది.

త్వరలో 'శీనుగాడి ప్రేమ'

శ్రీనివాసరావు, ప్రణవి, చాందిని, కావేరి హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'శ్రీనుగాడి ప్రేమ'. సుష్మ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్‌పై ధరిమిశెట్టి సత్యేశ్వరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆర్.కె.డి దర్శకుడు. ఈ సినిమా రీ రికార్డింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ ''మా చిత్రం రీరికార్డింగ్ కార్యక్రమాలు పూర్తయ్యాయి.

సంగీత దర్శకుడు రమణ మంచి సంగీతం, నేపథ్య సంగీతం అందించారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అన్ని ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. త్వరలోనే విడుదలకు ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.



• శ్రీనివాసరావు

హెలి టూరిజం తుస్!

పర్యాటకులు కానరాక వెలవెల.. పార్కింగ్‌కే చాపర్ పరిమితం

- 9 నిమిషాలకు రూ. 2500 టికెట్
- రోప్‌వే.. బోటుషికారు విజయవంతం
- అవే నయమంటున్న పర్యాటకులు
- అరకు వరకు తిప్పాలని ఆలోచన
- ఈశాన్య రాష్ట్రాల్లో ధర బాగా తక్కువ



విశాఖపట్నం, జనవరి 11 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఒకసారి, మంత్రి గంటా శ్రీనివాసరావు చేతుల మీదుగా మరోసారి అట్టహాసంగా ప్రారంభమైన హెలి టూరిజం ఈగలు తోలుకుంటోంది. విశాఖ ఉత్సవ్ సందర్భంగా డిసెంబర్ 29వ తేదీన వుడా పార్క్ హెలిప్యాడ్ నుంచి ప్రారంభమైన ఈ హెలి టూరిజానికి నాలుగు రోజులుగా ఒక్క పర్యాటకుడు కూడా లేక ఆగిపోయింది. వుడా పార్క్ నుంచి హెలికాప్టర్‌లో పర్యాటకులను ఎక్కించుకొని ఆకాశంలో తిప్పుతూ నగర అందాలను చూపించేందుకు పవన్ హన్స్ సంస్థతో వుడా ఒప్పందం కుదుర్చుకొంది.

టికెట్ ధర ఎక్కువైందా?

మనిషికి రూ. 2499 చొప్పున టికెట్ ధరను నిర్ణయించారు. ఒకసారి ఆరుగురు ప్రయాణించే సింగిల్ ఇంజన్ హెలికాప్టర్‌ను ఇక్కడ ఏర్పాటుచేశారు. సరిగ్గా తొమ్మిది నిమిషాల్లో మొత్తం పర్యటన అయిపోవడం, టికెట్ ధర కూడా చాలా ఎక్కువగా ఉండటంతో పర్యాటకులు ముఖం చాటేస్తున్నారు. విశాఖలో ఇప్పటికే విజయవంతమైన రోప్‌వే, బోటు షికారుతోనే సరిపెట్టుకొంటున్నారు. ప్రారంభమైన వారం రోజుల పాటు హెలికాప్టర్ బాగానే నడిచింది. తరువాత బేరాలు లేక వుడా పార్క్‌లో పార్కింగ్‌కే పరిమితమైంది. జనవరి ఒకటిన 92 మంది పర్యటించగా, రెండున 49 మంది హెలికాప్టర్ ఎక్కారు. మూడు నుంచి ఐదు వరకు, ఎనిమిది నుంచి పదోతేదీ వరకూ ఒక్కరు ఎక్కితే ఒట్టు. దీంతో వుడా పునరాలోచనలో పడింది.

అరకు తిప్పితే?

విశాఖపట్నంలో హెలికాప్టర్‌కు డిమాండు లేదు కాబట్టి.. ఇక్కడి నుంచి అరకుకు తిప్పితే ఎలా ఉంటుదన్న దానిపై అధికారులు ఆలోచన చేస్తున్నారు. విశాఖ నుంచి అరకుకు టికెట్ ధర రూ. 6 వేలు పెడితే జనం వస్తారా అన్నదానిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. నగరంలో తిరగడానికి రెండున్నర వేలు చెల్లించేవారే లేనప్పుడు అరకుకు రూ. 6 వేలు పెట్టేవాళ్లెవరన్న భయం వెంటాడుతోంది. హెలిప్యాడ్ నిర్మాణానికి వుడా రూ. 6 లక్షలు ఖర్చుచేసింది. ఇందుకు కొంత స్థలం కూడా కేటాయించింది.

ఈశాన్యంలో రేటు తక్కువ

సిక్కిం, మేఘాలయ లాంటి ఈశాన్య రాష్ట్రాల్లో రూ. 1800కే 13 నిమిషాల వరకూ తిప్పుతుండగా ఇక్కడ ధరలు ఎక్కువ, విహరించే సమయం తక్కువగా ఉండని పర్యాటకులు విముఖత చూపిస్తున్నారు. టికెట్ ధర కొంత తగ్గిస్తే పర్యాటకులు వచ్చే అవకాశముందని పర్యాటక సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు. హెలి టూరిజాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైతే ప్రభుత్వం కొంత రాయితీని ఇవ్వాలని వారు డిమాండు చేస్తున్నారు.



జగన్, చంద్రబాబుకు భయం

- అందుకే మోదీని ఏమీ అనరు: నారాయణ



అమరావతి, జనవరి 11 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రతిపక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ఇద్దరూ కేసులకు భయపడి ప్రధాని మోదీని ఏమీ అనలేక పోతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. లేకుంటే రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కులపై ఎందుకు పోరాడటం లేదని నిలదీశారు. భయపడి, బతిమాలితే నిధులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. గురువారం సచివాలయం బయట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంపై పోరాడితే బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ మాదిరి జైల్లో పెట్టిస్తారామోనని వీరు భయపడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. దక్షిణాది రాష్ట్రాల్లో మోదీ సత్తా ఏ పాటిదో ఇటీవల జరిగిన తమిళనాడు ఉప ఎన్నికల్లో తేలిపోయిందన్నారు.

సైకిల్‌పై సవారీ

రాజధాని ప్రాంతాల్లో నారాయణ సైకిల్‌పై సవారి చేశారు. ఉండవల్లి, పెనుమాక, మందడం మీదుగా సచివాలయానికి వచ్చారు. సైకిల్‌పై ఉదయాన్నే వచ్చిన నారాయణను ఎస్పీఎఫ్ సిబ్బంది లోపలకి అనుమతించలేదు. అక్కడ ఉన్న ఎన్టీఆర్ క్యాంటీన్‌లో అల్పాహారం చేసి వెనుతిరిగారు. సీపీఐ సమితి సమావేశాలు ముగియడంతో రాజధాని నిర్మాణ పనులు చూద్దామని వచ్చినట్లు నారాయణ తెలిపారు.

పనీపాట లేకే జగన్ పాదయాత్ర

- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్



అమరావతి, జనవరి 11 (మనం ప్రతినిధి): ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పనీపాట లేక పాదయాత్ర చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ విమర్శించారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పట్టిసీమ ప్రాజెక్టు పూర్తి చేయటం ద్వారా రైతుల ఆదాయం పెరిగిందన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌తో విద్యుత్ సంస్కరణలు తీసుకురావటం వల్ల, విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. హ్యాపీ ఇండెక్స్‌లో కూడా ఏపీ మంచి ర్యాంకు సాధించిందని, ఇదంతా చంద్రబాబు వల్లే సాధ్యమైందని ఓ పత్రిక ప్రధానంగా ప్రచురించిందని ఆయన పేర్కొన్నారు.

జన్మభూమి కాదు జాదూభూమి

- వైసీపీ నేతలు వెల్లంపల్లి, మల్లాది

అమరావతి, జనవరి 11 (మనం ప్రతినిధి): జన్మభూమి-మా ఊరు కార్యక్రమం అంతా అవినీతిమయమని, రాష్ట్రం ప్రభుత్వం దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని వైసీపీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు డిమాండ్ చేశారు. ఇది జన్మభూమి కార్యక్రమం కాదని, జాదూభూమి అని వారు విమర్శించారు. వైఎస్ పాలనకు, చంద్రబాబు పాలనకు చాలా తేడా ఉందన్నారు. చంద్రబాబు చేపడుతున్న జన్మభూమి నిజానిజాలపై కాణిపాకం వినాయకునిపై ఒట్టు వేయగలరా? అని ప్రశ్నించారు.

నాది పేదల కులం

ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి

- 'అనంత'ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తా
- జన్మభూమి-మా ఊరులో చంద్రబాబు
- బుక్కపట్నం చెరువుకు సీఎం జలహారతి

అనంతపురం, జనవరి 11: తన కులం పేదల కులమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. పేదలు ఆర్థికంగా ఎదగడమే తమ లక్ష్యమన్నారు. జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన అనంతపురం జిల్లాలో పర్యటించారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి చేరుకున్న చంద్రబాబుకు మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు ఇతర నేతలు ఘనస్వాగతం పలికారు. ధర్మవరంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. రోడ్డు మార్గంలో చంద్రబాబు కొత్త చెరువుకు చేరుకొని బుక్కపట్నం చెరువును పరిశీలించారు. పెద్దదైన బుక్కపట్నం చెరువును హంద్రీనీవా నీటితో నింపిన నేపథ్యంలో అక్కడ ప్రత్యేకంగా నిర్మించిన పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. నిండుకుండలా ఉన్న బుక్కపట్నం చెరువులో జలహారతి ఇచ్చారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యే ప్రతిపక్ష నేత ఎలాంటి పరిపాలన అనుభవం లేకుండా తనపై విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తిలను కలుపుతూ చెరువు చుట్టూ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతపురం జిల్లాను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి మొదటి స్థానంలో నిలబెట్టడానికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పుట్టపర్తి సమీపంలో జరుగుతున్న హంద్రీనీవా పనులను పరిశీలించారు.



నేడు మోదీతో చంద్రబాబు సమావేశం

నియోజకవర్గాల పునర్విభజన, విభజన చట్టం తదితర అంశాలపై చర్చ

అమరావతి, జనవరి 11: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీతో సమావేశం కానున్నారు. జన్మభూమి కార్యక్రమ ముగింపు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాత్రి బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. మోదీతో జరిగే సమావేశంలో నియోజకవర్గాల పునర్విభజన, రెవెన్యూ లోటు, పోలవరంపై సీఎంల సమావేశం, విభజన చట్టంలోని అంశాలపై చంద్రబాబునాయుడు చర్చించనున్నారు.

చంద్రబాబు, కరువు కవల పిల్లలు

- కరువు మండలాల ప్రకటనకు వెనుకంజ
- అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటాం
- ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్



చిత్తూరు. జనవరి 11: చంద్రబాబునాయుడు, కరువు కవల పిల్లలు అని, చంద్రబాబు సీఎం కావడంతో ఆయన వెంటే కరువు కూడా వచ్చిందని ప్రతిపక్ష నేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా నెమళ్లగుంటపల్లిలో గురువారం వైఎస్ జగన్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ నాలుగేళ్ల పాలనలో చంద్రబాబు ఓ దళారిలా మారి రైతులను మోసం చేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతుల కోసం ప్రత్యేక పథకాలు అమలు చేస్తానని హామీ ఇచ్చారు. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో ఏ ఒక్క పంటకు గిట్టుబాటు ధర రాలేదని, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని జగన్ ధ్వజమెత్తారు. ఎన్నికల్లో గెలుపు కోసం అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. బాబు పాలనలో కరువు తాండవిస్తోందన్నారు. కరువు మండలాల్లోని రైతులకు సాయం అందించకుండా ప్రభుత్వం ముఖం చాటేస్తోందన్నారు. వర్షాలు లేక రైతులు అల్లాడుతున్నారని, నేటికి ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వాల్సి వస్తుందని ప్రభుత్వం వెనుకాడుతోందన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే రైతులను ఆదుకుంటామని, వ్యవసాయానికి పగటి పూట ఉచిత విద్యుత్ అందిస్తామని చెప్పారు.

రాజ్యాధికారం ఆ రెండు కులాలకేనా?

- ప్రజాస్వామ్యం అంటే ఇదేనా
- బీసీ, ఎస్సీ, ఎస్టీలంతా ఏకం కావాలి
- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



శ్రీకాకుళం, జనవరి 11 (మనం న్యూస్ బ్యూరో): ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర విభజనకు ముందు, ఆ తర్వాత ఏడు దశాబ్దాల నుంచి రాజ్యాధికారం రెండు కులాల చేతిలోనే ఉందని కేంద్ర మాజీమంత్రి, సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ డాక్టర్ చింతా మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మార్పు కోసం ఆ రెండు కులాలను పక్కన పెట్టి బీసీ, ఎస్సీ, ఎస్టీ జాతుల చేతిలోకి అధికారం రావాలన్నారు. గురువారం శ్రీకాకుళం వచ్చిన ఆయన.. విలేకరులతో మాట్లాడారు. దేశంలో అన్ని ప్రాంతాల్లో సామాజిక న్యాయం జరుగుతోందని, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రెడ్డి, కమ్మ కులాల చేతిలో అధికారం కేంద్రీకృతం కావడం అన్యాయమన్నారు. రాష్ట్ర జనాభాలో 80 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అధికారం దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాధికారం కోసం పోరాటం తప్పదన్నారు. కేవలం 2 శాతం జనాభా ఉన్న కులాలు శాసిస్తుండడాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని చింతా విమర్శించారు. మూడున్నరేళ్లలో రాష్ట్రానికి ఏమీ చేయలేదన్నారు. ఇక 'నవరత్నాల' పేరుతో ప్రతిపక్ష జగన్‌మోహన్ రెడ్డి సైతం మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

2019లో టీడీపీదే విజయం

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం.. కరెంటు కష్టాలు లేవు: లోకేశ్



కర్నూలు, జనవరి 11 (మనం న్యూస్ బ్యూరో): 2019లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయదుందుబి మోగిస్తుందని మంత్రి నారా లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రగామిగా నిలుపుతామని అన్నారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలు లేకుండా చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధిలో బనగానపల్లె భేష్ అని కితాబిచ్చారు. బనగానపల్లె ప్రాంత రైతాంగానికి అవసరమైన దద్దానాల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జీవో జారీ చేశామన్నారు. కర్నూలు జిల్లా బనగానపల్లె నియోజకవర్గంలో గురువారం జన్మభూమి కార్యక్రమంలో లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. ఆర్థికంగా లోటుబడ్జెట్ ఉన్నా అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రజలు టీడీపీ ప్రభుత్వాన్ని ఆదరించారని, వారిని అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

జన్మభూమి ఓ మహాయజ్ఞం

- లక్షలాది ప్రజల సమస్యలు పరిష్కారం: పరకాల



అమరావతి, జనవరి 11 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం 10 రోజుల పాటు 13 జిల్లాల్లో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఒక మహాయజ్ఞం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది ప్రజలు తమ సమస్యలను కేవలం 24 గంటల్లో పరిష్కరించుకోగలిగారని వెల్లడించారు. గురువారం విజయవాడలో సీఎం క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జన్మభూమిలో రాష్ట్ర వ్యాప్తంగా 92,618 గ్రామ సభలు నిర్వహించగా, 11 లక్షల 53 వేల అర్జీలు వచ్చాయన్నారు. సభలలో 60 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారని వెల్లడించారు. 1.80 లక్షల రేషన్‌కార్డులు, 1.10 లక్షల పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రభాకర్ చెప్పారు. 17,714 ఆరోగ్య శిబిరాలు నిర్వహించి, 13 లక్షల మంది రోగులను పరీక్షించి, 50 వేల కంటి అద్దాలు అందజేశామన్నారు.

కానుకకు 'ఈ-పోస్' కష్టాలు!

ఐదు జిల్లాల్లో పనిచేయని మిషన్లు.. పేదలకు అందని చంద్రన్న కానుక

- గంటలో అప్‌డేట్ అన్న కంపెనీలు వారం గడిచినా అతీగతీ లేని వైనం
- సర్వర్ల మొరాయింపు.. పంపిణీ ఆలస్యం
- ఆందోళన చెందుతున్న కార్డుదారులు

అమరావతి, జనవరి 11 (మనం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న 'చంద్రన్న సంక్రాంతి కానుక' ఐదు జిల్లాల్లో ఇంకా పేదలకు అందలేదు. నాసిరకం ఈ-పోస్‌లతో పాటు సర్వర్ మొరాయించడంతో రేషన్ అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ-పోస్ మిషన్లు సక్రమంగా పనిచేయటం లేదు. దీంతో ఉదయం 7 గంటల నుంచి క్యూలో నిలబడినా రేషన్ అందని పరిస్థితి నెలకొంది. దీనికితోడు రేషన్ తీసుకునేందుకు ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ గడువు విధించింది. దీంతో తమకు గడువులోగా రేషన్ అందుతుందా?లేదా అని కార్డుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలను నివారించడానికి రాష్ట్రంలోని 29 వేల రేషన్ షాపుల్లో దశల వారీగా ఈ-పోస్‌లను ఏర్పాటు చేసింది. మిషన్ల కొనుగోలు, సర్వీస్ కోసం ప్రైవేటు కంపెనీలకు ప్రభుత్వం విడతల వారీగా కోట్ల రూపాయిలు చెల్లిస్తోంది. అయితే ఐదు జిల్లాల్లో కంపెనీలు నాసిరకం ఈ-పోస్‌లు సరఫరా చేయడం వల్లే కీలకమైన సమయాల్లో పనిచేయకుండా మొరాయిస్తున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మిషన్ రిపేరుకు వచ్చిన గంటలోపే బాగు చేస్తామని నాడు బాసలు చేసిన కంపెనీలు.. నేడు ఆ మాట మర్చిపోయాయి. వారం గడిచినా రిపేరు చేయడానికి సాంకేతిక సిబ్బంది రావడం లేదని రాష్ట్రవ్యాప్తంగా డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసలుకు మించి.. కొసరు

రెండున్నరేళ్ల క్రితం ఈ-పోస్ మిషన్లను ఒక్కొక్కటి 49,500 రూపాయలకు కొన్నారు. వాస్తవానికి ఈ-పోస్ మిషన్ కొనుగోలుకు రూ. 21 వేలు మాత్రమే ఖర్చువుతుంది. అయితే ఐదేళ్లలో దానికి ఏమైనా రిపేరు, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయాల్సి వస్తే.. కంపెనీ ప్రతినిధులు వచ్చి బాగు చేయడానికి (సర్వీస్ కోసం) మరో రూ. 28,500 ప్రభుత్వం చెల్లిస్తోంది. రిపేరు చార్జీలు అంతమొత్తంలో చెల్లించటానికి.. అప్పట్లో ఏపీలో పనిచేసి తెలంగాణకు బదిలీ అయిన ఒక ఉన్నతాధికారి కారణమని, ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి కొనుగోళ్లు జరిపించారనే విమర్శలు వచ్చాయి. నిబంధనల ప్రకారం మిషన్లు సరఫరా చేసిన కంపెనీలు ప్రతి మండలంలో సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలి. మిషన్ రిపేరుకు వచ్చిందని తెలిసిన గంటలోపే అక్కడికి వెళ్లి బాగు చేస్తామని, ప్రతి జిల్లాలో వెబ్‌బేస్‌డ్ హెల్ప్‌లైన్ పెడతామని, ఏ చిన్న సమస్యవచ్చినా తాము ఉన్నామని కంపెనీ ప్రతినిధులు అప్పట్లో చెప్పి టెండర్లు దక్కించుకున్నారు. ఇప్పుడు జిల్లాలో ఒకరిద్దరు సాంకేతిక సిబ్బంది మాత్రమే అందుబాటులో ఉంటున్నారు.


వేలిముద్రలు పడని వారికి ఇక్కట్లు

ఉపాధి హామీ పనికి వెళ్లేవారు, వృద్ధులు, మహిళల్లో చాలా మందికి ఈ-పోస్ మిషన్‌లో వేలిముద్రలు పడవు. దీనిని గుర్తించిన ప్రభుత్వం ఐరీష్ మిషన్ల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించింది. ఇప్పుడు ఐరీష్ మిషన్‌లు పనిచేయకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలిముద్రలు పడని వారు తహశీల్దార్ దగ్గరికి వెళ్లి సంతకం చేయించుకోవాలి. ఆ తర్వాత డీఎస్‌వో లాగిన్‌లోకి వెళ్లి ఆ గ్రామానికి సంబంధించిన వీఆర్‌వోకు అథంటకేషన్ ఇవ్వాలి. అప్పుడు మాత్రమే డీలర్, సంబంధిత కార్డుదారునికి రేషన్ సరఫరా చేస్తారు. అధికారులంతా జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో రోజుకో ఊరులో పాల్గొనడంతో కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సరుకులు లేకుండా 'కానుక 'చంద్రన్న సంక్రాంతి కానుకలో ఒక్కో జిల్లాలో ఒక్కో వస్తువు(సరుకు) తక్కువగా ఉంటున్నాయి. కొన్ని జిల్లాల్లో బెల్లం ఇంకా కార్డుదారులకు అందలేదు. మరికొన్ని జిల్లాల్లో గోధుమపిండి అందలేదని డీలర్లు చెబుతున్నారు. బెల్లం, గోధుమపిండి, నెయ్యి నాసిరకం సరుకులు సరఫరా చేశాయని, అందువల్లే ఆ లోడ్‌లు తిప్పి పంపించామని అధికారులు చెబుతున్నారు. ఆయా కంపెనీలు తిరిగి కొత్త సరుకులు పంపించిన వెంటనే అందజేస్తామని పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.




ఐరీష్ మిషన్లు ఉన్నా నిరుపయోగం

కార్డుదారుల్లో వేలిముద్రలు పడని వారి కోసం ఐరీష్ మిషన్ (కంటిపాప) ద్వారా రేషన్ ఇవ్వాలంటూ ప్రభుత్వం వాటిని రేషన్ షాపులకు సరఫరా చేసింది. కాగా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసే ఇబ్బందులతో పేదలకు చంద్రన్న కానుక ఇవ్వలేకపోతున్నారు. ఐరీష్ మిషన్లను ఐరీష్ టెక్, విప్రో కంపెనీలు రేషన్ షాపులకు సరఫరా చేశాయి. ఈ-పోస్ మిషన్‌తో ఐరీష్ మిషన్లు కనెక్ట్ చేసిన తర్వాత పనిచేస్తున్నాయా? లేదా అని నిర్ధారించుకున్న తర్వాతే, ఆ కంపెనీలకు డబ్బులు చెల్లించాలి. అధికారుల అత్యుత్సాహంతో ఐరీష్‌టెక్ కంపెనీ సరఫరా చేసిన వెంటనే 90 శాతం డబ్బు చెల్లించారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయమని పౌరసరఫరాల శాఖ అధికారులు వెంటబడుతున్నా.. డబ్బు అందిన కంపెనీ పట్టించుకోవటం లేదని తెలుస్తోంది.










నూతన శిఖరారోహణ

కొత్త జీవిత-కాల గరిష్ఠ స్థాయిల్లో ముగిసిన 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు



ముంబయి: 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు రెండూ గురువారం నూతన జీవిత-కాల గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. ఇన్ఫోసిస్ లిమిటెడ్ వంటి ఐ.టి. కంపెనీల షేర్ల, హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ఫైనాన్షియల్ సంస్థల షేర్ల ధరలు పెరగడంతో దేశీయ స్టాక్ మార్కెట్లకు చెందిన రెండు సూచీ లు లాభపడ్డాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల సున్నిత సూచి 70.42 పాయింట్లు లాభపడి 34,503.49 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 19 పాయింట్లు లాభపడి 10,651.20 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం, సెన్సెక్స్ ఆరంభం అప్రమత్తంగానే ఉన్నా, తర్వాత, వేగం పుంజుకుని, ఒక దశలో 34,558.88 పాయింట్ల స్థాయిని కూడా తాకింది. అది జనవరి 9 నాటి 34,443.19 పాయింట్ల గరిష్ఠ రికార్డును గురువారం బద్దలు కొట్టింది. అలాగే, నిఫ్టీ కూడా జనవరి 9 నాటి 10,637 పాయింట్ల గరిష్ఠ స్థాయి రికార్డును బద్దలు కొడుతూ ఒక దశలో 10,651.20 పాయింట్ల స్థాయిని తాకింది. ''కొన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఈరో జు వెల్లడవనున్నాయి. అవి ఇచ్చే సంకేతాల కోసం మదుపరులు చూస్తున్నారు. డిసెంబరుతో ముగిసిన త్రైమాసిక ఫలితాలు కీలకం. అవి వారి అంచనాలకు తగ్గట్లు ఉండకపోతే, ప్రతికూల అంశాలు బలపడడం ప్రారంభిస్తాయి'' అని శాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ ఛీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అధికారి సునీల్ శర్మ చెప్పారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లపై గుబులు అలాగే ఉందని ఆయన అన్నారు. దేశ రిటైల్ ద్రవ్యోల్బణ రేటు డిసెంబరులో గత 17 నెలల్లో ఎన్నడూ లేనంత ఎక్కువగా ఉండవచ్చని ఒక వార్తా సంస్థ నిర్వహించిన 'పోల్' వెల్లడించింది. దాంతో ద్రవ్య విధానాన్ని మరిం త కట్టుదిట్టం చేసేట్లుగా కేంద్ర బ్యాంక్‌పై ఒత్తిడి పెరగవచ్చు. ''ముడి చమురు ధరపై కూడా ఆందోళన ఉం ది. ప్రాథమికంగా, మదుపరులు, ముడి చమురు ధరల ప్రభావం మార్జిన్లపై ఏ విధంగా ఉంటుందోనని చూస్తున్నారు'' అని శర్మ చెప్పారు.

బలహీనపడిన ర్యాలీ

ఆసియాలోని ఇతర మార్కెట్లలో మొదలైన నూతన సంవత్సర ర్యాలీ గురువారం ఆ ఊపును, ఉత్సాహాన్ని కోల్పోయింది. అమెరికా పాలకుల సంరక్షణ వైఖరి అక్కడి వాల్ స్ట్రీట్‌పై ప్రభావం చూపింది. చైనా కొనుగోళ్ళకు కోతపెట్టుకోవచ్చునే ఊహాగానంతో అమెరికా బాండ్ల విలువలు తగ్గాయి. జపాన్ మినహా ఆసియా-పసిఫిక్ ప్రాంత కంపెనీల షేర్ల విలువల్లో హెచ్చు తగ్గులను ప్రతిబింబించే విస్తృతమైన సూచి ఎం.ఎస్.సి.ఐ. 0.1 శాతం క్షీణించింది. జపాన్ నికెయి 0.6 శాతం క్షీణించింది. ఉత్తర అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒడంబడిక నుంచి ఉపసంహరించుకోవాలన్న అభిమతాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ త్వరలోనే ప్రకటించవచ్చని కెనడాలో అనుమానం బలపడుతోందని వార్తలు వెలువడిన తర్వాత, కెనడియన్ డాలర్, మెక్సికన్ పిసోల మారక విలువలు తగ్గాయి. అమెరికా షేర్ల ధరల్లో కొత్త ఏడాది సందర్భంగా మొదలైన ర్యాలీకి బుధవారం బ్రేక్ పడింది. డౌజోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 0.07 శాతం, ఎస్ అండ్ పి 500 సూచి 0.11 శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.14 శాతం క్షీణించాయి.

తగ్గిన టి.సి.ఎస్ నికర లాభం

ముంబయి: సమాచార సాంకేతిక పరిజ్ఞాన రంగ పెద్ద సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి.సి.ఎస్) 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం 3.6 శాతం క్షీణించి రూ. 6,531 కోట్లకు తగ్గినట్లు ప్రకటించింది. ముంబయి ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ కంపెనీ గత ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో రూ. 6,778 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అయితే, ఇండియన్ ఎకౌంటింగ్ స్టాండర్డ్ ప్రకారం కంపెనీ ఆదాయం గత ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికం రూ. 29,735 కోట్లు కాగా 2017 డిసెంబరు త్రైమాసికంలో అది 3.9 శాతం పెరుగుదలను కనబరుస్తూ రూ. 30,904 కోట్లకు పెరిగింది. కంపెనీ షేర్‌కు 7 రూపాయల డివిడెండ్ ప్రకటించింది. ''డిసెంబరు క్వార్టరులో పటిష్టమైన పనితీరుతో మేం 2017కు ముగింపు పలికాం..మా పోర్ట్‌ఫోలియోలో మందగిస్తున్న విభాగాలకు తిరిగి దశ ఎత్తుకుంది. దుర్బలంగా ఉన్న విభాగాలు తగ్గాయి. ముమ్ముందు పటిష్టమైన వృద్ధి సాధించగల స్థితిలో మేం ఉన్నాం'' అని కంపెనీ సి.ఇ.ఓ., మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ గోపీనాథన్ చెప్పారు. ఈ క్వార్టరులో మొదటిసారిగా 'డిజిటల్'లో 5 కోట్ల డాలర్లకు పైగా విలువైన ఒప్పందంపై కంపెనీ సంతకాలు చేసిందని ఆయన తెలిపారు. సీజనుపరంగా బలహీనమైన క్వార్టరులో పెరిగిన కొత్త ఒప్పందాలు, డిజిటల్‌లో పెరిగిన ఉనికి, రిటైల్‌లో పుంజుకున్న డిమాండ్ బలమైనదిగా ఉండడం, టి.సి.ఎస్. పరిశ్రమ వెర్టికల్స్ చాలా వాటిలో కొనసాగుతున్న వేగ గతి కంపెనీకి బలమైన వాల్యూముల వృద్ధిని ప్రసాదించాయని టి.సి.ఎస్. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సి.ఓ.ఓ. ఎన్. గణపతి సుబ్రమణియం చెప్పారు. కంపెనీ రాబడులలో డిజిటల్ విభాగ రెవిన్యూ గత ఆర్థిక సంవత్సర క్యూ 3 నాటి 22.1 శాతం నుంచి ఈ క్యూ 3కి సుమారు 40 శాతానికి పెరిగింది. 2017 డిసెంబరు క్వార్టరులో టి.సి.ఎస్. నుంచి ఇతర కంపెనీలకు వెళ్ళేవారి సంఖ్య తగ్గింది. అది ఈ క్వార్టరులో (స్థూలంగా) 12,534 మంది ఉద్యోగులను జోడించుకుంది. దీంతో కంపెనీలో మొత్త ఉద్యోగుల సంఖ్య 3,90,880కి పెరిగింది.

పెరిగిన ఇండస్ లాభం

ముంబయి: ఇండస్‌ఇండ్ బ్యాంక్ 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 25 శాతం పెరుగుదలను కనబరుస్తూ రూ. 936 కోట్ల నికర లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో అది రూ. 751 కోట్ల నికర లాభాన్ని మాత్రమే నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3తో పోలిస్తే, 2017 అక్టోబరు-డిసెంబరు కాలంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 20 శాతం పెరుగుదలతో రూ. 1895 కోట్లుగా, ఇతర ఆదాయం 17 శాతం పెరుగుదలతో రూ. 1187 కోట్లుగా నమోదైంది. స్థూల నిరర్థక ఆస్తులు, స్థూల రుణాల మధ్య నిష్పత్తి 0.94 శాతం నుంచి 1.16 శాతానికి పెరిగింది. ఈ బ్యాంక్‌కూ మొండి బాకీలు పెరిగాయి. ఈ బ్యాంక్ షేర్ ధర బి.ఎస్.ఇ.లో 0.69 శాతం తగ్గి రూ. 1722.85 వద్ద కోట్ అయింది.

నామమాత్రంగా వాహన ఎగుమతులు

న్యూఢిల్లీ: భారతదేశపు పాసింజర్ వాహనాల ఎగుమతులు 2017లో చప్పగానే ఉన్నాయి. ఆటోమొబైల్ తయారీ సంస్థలు రావలసిన జి.ఎస్.టి. రిఫండు సమస్యతో బాధపడుతున్నాయి. ఈ మొత్తం ప్రస్తుతం రూ. 2000 కోట్లకు చేరింది. దేశం నుంచి 2016లో 7,38,137 యూనిట్లు ఎగుమతి కాగా, గత ఏడాది 0.1 శాతం అతి స్వల్ప వృద్ధితో 7,38,894 యూనిట్లు ఎగుమతి అయ్యాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్ (సియాం) వెల్లడించింది. ''జి.ఎస్.టి. రిఫండు వ్యవస్థ సరిగ్గా పనిచేయడం లేదు. అది పాసింజర్ వాహనాల ఎగుమతులపై ప్రభావం చూపింది. ఐదారు టాప్ ఎగుమతి సంస్థలతో డిసెంబరులో మేం ఒక సమావేశం నిర్వహించాం. పెండింగులో ఉన్న రిఫండు మొత్తం దాదాపు రూ. 2,000 కోట్ల వరకు ఉందని ఆ సందర్భంగా తేలింది'' అని 'సియాం' డిప్యూటి డైరెక్టర్ జనరల్ సుగతో సేన్ చెప్పారు. దేశీయ మార్కెట్‌లో విక్రయించడం కన్నా ఎగుమతులు ఎక్కువ చేసే కంపెనీలపై ఈ అంశం ప్రభావం చూపిందని ఆయన చెప్పారు. ఒక నిర్దిష్ట కంపెనీకైతే ఏకంగా రూ. 800 కోట్ల జి.ఎస్.టి. రిఫండు పెండింగులో ఉందని సేన్ చెప్పారు. దేశంలో అమ్మకాలు గణనీయంగా ఉన్న కంపెనీలు మూలధనం చిక్కుకుపోయినా నెట్టుకురాగలుగుతున్నాయని ఆయన తెలిపారు. జి.ఎస్.టి. వ్యవస్థ కింద, ముందే చెల్లింపులు జరిపి, వాహనాల తయారీ సంస్థలు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రిఫండుకు ఆ తర్వాత క్లెయిమ్ చేస్తున్నాయి. పాసింజర్ వాహనాల ఎగుమతులు 2017 జూలై నుంచి వేగంగా తగ్గిపోయాయి. ఫోర్డ్ ఇండియా, ఫోక్స్‌వ్యాగన్ దీనిపై నవంబరులోనే ఆందోళన వ్యక్తం చేశాయి. రిఫండు సమస్యను పరిష్కరించకపోతే ఎగుమతులపై పునరాలోచన చేసుకోవలసి ఉంటుందని కూడా ఫోక్స్‌వ్యాగన్ ప్రకటించింది. హ్యూందయ్ వంటి ప్రధాన ఎగుమతి సంస్థ దేశీయ మార్కెట్‌పైకి దృష్టి మళ్ళించడం కూడా ఎగుమతులు తగ్గడానికి మరో కారణమని సేన్ చెప్పారు.


ఆడిటింగ్ సంస్థలపై నిషేధం



ముంబయి: సత్యం కంప్యూటర్ల సంస్థ కుంభకోణంలో ఆడిటింగ్ సంస్థ ప్రైస్ వాటర్‌హౌస్‌ను భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజ్ బోర్డ్ (సెబి) బుధవారంనాడు దోషిగా కనుగొంది. దాని నెట్‌వర్క్ సంస్థలు భారతదేశంలో లిస్ట్ అయిన ఏ కంపెనీకీ రెండేళ్ళపాటు ఆడిట్ సర్టిఫికెట్లు జారీ చేయడానికి వీలు లేకుండా 'సెబి' నిషేధం విధించింది. 'బిగ్ ఫోర్' లోని సంస్థపై మరి ఏ ఇతర నియంత్రణా సంస్థా ఇంత అత్యంత కఠినమైన ఆదేశాలు జారీ చేయలేదని భావిస్తున్నారు. ఆర్థర్ ఆండర్సన్, ఎర్నెస్ట్ యంగ్, ప్రైస్ వాటర్‌హౌస్, డెలాయిట్‌లను ఆడిట్ రంగానికి చెందిన 'బిగ్ ఫోర్'గా భావిస్తారు. ఆ సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐ.టి) కంపెనీ పద్దులు చూసిన ఆ ఆడిటింగ్ సంస్థ, దాని ఒకప్పటి భాగస్వాములైన రెండు సంస్థలు అక్రమంగా సంపాదించిన రూ. 13 కోట్లను బయటకు కక్కాలని 'సెబి' ఆదేశించింది.

ప్రైస్ వాటర్‌హౌస్ బెంగళూరు, దాని భాగస్వాములైన ఎస్. గోపాలకృష్ణన్, శ్రీనివాస్ తాళ్ళూరి సంయుక్తంగా లేదా విడివిడిగా మొత్తంమీద రూ. 13,09,01,664 చెల్లించాలని ఆదేశించింది. చెల్లింపు జరిపే తేదీ వరకు ఆ మొత్తంపై 2009 జనవరి 7 నుంచి 12 శాతం చొప్పున వార్షిక వడ్డీ లెక్కగట్టి చెల్లించాలని తెలిపింది. వారా మొత్తాన్ని 45 రోజులలోగా చెల్లించవలసి ఉంటుంది. లేని లాభాలను పెంచి చూపించినట్లు అప్పటి సత్యం అధిపతి రామలింగ రాజు 2009 జనవరి 7న అంగీకరించారు. కాకతాళీయంగా సెబి ఆదేశం కూడా జనవరి నెలలోనే జారీ అయింది. సత్యం కంప్యూటర్ సర్వీసెస్‌లో కుంభకోణం మొదటగా వెలుగుచూసి తొమ్మిదేళ్ళు అయిన తర్వాత, ఈ ఆదేశం జారీ అయింది. అంగీకారయోగ్యమైన యంత్రాంగం ద్వారా ఈ కేసును పరిష్కరించుకునేందుకు ప్రైస్ వాటర్‌హౌస్ సంస్థ చేసిన రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి. ''సెబి దర్యాప్తులో కనుగొన్న అంశాలతో, న్యాయనిర్ణయ ఆదేశంతో మేం అసంతృప్తి చెందాం...ఈ ఆదేశం అమలులోకి రావడానికి ముందు దీనిపై స్టే తెచ్చుకోగలమని మేం విశ్వాసంతో ఉన్నాం'' అని ప్రైస్ వాటర్‌హౌస్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రైస్ వాటర్‌హౌస్ నెట్‌వర్క్‌లో భాగమైన సంస్థలు 2017-18 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఆడిట్ అసైన్‌మెంట్లపై ఈ ఆదేశం ప్రభావం చూపదని 'సెబి' పేర్కొంది. అంతర్జాతీయంగా పేరు ప్రతిష్ఠలు గడించిన సంస్థ మోసపూరిత అకౌంటింగ్ విధానాలకు పాల్పడింది. ఈ ఆదేశాల పరిధిలోకి ప్రైస్ వాటర్ హౌస్ బ్రాండ్ పేరును కూడా తీసుకురాకపోతే అటువంటి తప్పుల తడకల పద్దుల నుంచి సెక్యూరిటీల మార్కెట్‌ను కాపాడాలనే లక్ష్యం నిర్వీర్యమవుతుంది. ఆ అంతర్జాతీయ అకౌంటింగ్ సంస్థ నెట్‌వర్క్‌లో వివిధ ఆడిటింగ్ సంస్థలు పనిచేస్తున్నాయి. నెట్‌వర్క్ బ్రాండ్ పేరిట జారీ చేసిన సర్టిఫికేషన్ల వల్ల ఉత్పన్నమైన న్యాయపరమైన పర్యవసానాల నుంచి కాపాడుకునేందుకు నెట్‌వర్క్‌గా పనిచేస్తున్నామని చెప్పి తప్పించుకోబోవడం సరికాదని 'సెబి' తన ఆదేశంలో పేర్కొంది.

'విదేశాలను గుడ్డిగా అనుసరించొద్దు'



న్యూఢిల్లీ: పట్టణీకరణకు చైనా వంటి విదేశీ మోడళ్ళను భారత్ అనుసరించకూడదని, దేశవ్యాప్తంగా వృద్ధి కేంద్రాలను సృష్టించుకోవాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్ చెప్పారు. అది పదార్థాలైనా లేదా పర్యావరణమైనా ఏదైనా సరే స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి)లో ప్రతి యూనిట్‌కి దేశం తక్కువ వనరులను ఉపయోగించుకోవలసిన అవసరం ఉందని ఆయన చెప్పారు. ''మన సొంత పట్టణీకరణకు మనం బయట మోడళ్ళను వెతకవలసిన అవసరం లేదు. వాటిని తెచ్చి, యాథాతథంగా అమలు చేసేందుకు మనం బయట మోడళ్ళ కోసమే అన్వేషిస్తూపోవడం దయనీయం. మన దేశంలోని భిన్నత్వం, బహుళత్వాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే, అసమానతలతో కూడిన లేదా సమతౌల్యం లేని పట్టణీకరణను మనం భారతదేశంలో అనుమతించలేం. చైనా చేసిందని భారత్ కూడా అదే పని చేయడాన్ని మనం సమ్మతించలేం'' అని రాజీవ్ కుమార్ గురువారం ఇక్కడొక కార్యక్రమంలో అన్నారు. చైనాలో అభివృద్ధి, ఆధునికీకరణ తీరం వెంబడి చోటుచేసుకున్నాయి. ఇతర ప్రాంతాలు వెనుకబడే ఉన్నాయని ఆయన చెప్పారు. ''దాంతో, చైనా నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఏటా 40 లక్షల నుంచి 50 లక్షల మంది కోస్తా ప్రాంతాల నుంచి లోపలి ప్రాంతాలకు ప్రయాణమవుతారు. అటువంటిదాన్ని మన దేశంలో చోటుచేసుకోనివ్వకూడదు. దీపావళి, హోళీ, ఛాత్ వంటి పండుగలకు దక్షిణ, ఉత్తరాల నుంచి తూర్పునకు కదలివెళ్ళే జనం మనకు లేరు'' అని



ఆయన అన్నారు. భారత్‌లో ఇప్పటికీ సాధికారిత కలిగిన నగరాలు లేవని ఆయన వ్యాఖ్యానించారు. నగరాల్లో శక్తిమంతులైన మేయర్లు ఉండే పాత సంప్రదాయాన్ని తిరిగి నిలబెట్టుకోవలసిన అవసరం ఉందని ఆయన అన్నారు. ''భారతదేశంలో నేను మైక్ బ్లూమ్‌బర్గ్ (న్యూయార్క్ నగర మాజీ మేయర్) వంటి మేయర్ ఎవరి గురించీ వినలేదు. ఇంతకుముందు కలకత్తా మేయర్ ఒకరు, బొంబాయి షరీఫ్ ఒకరు సమర్థంగా పనిచేసిన వారుండేవారు. ఆ రోజులన్నీ పోయాయి. దాన్ని మనం తిరిగి నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉంది'' అని రాజీవ్ అన్నారు. నగరాలను విషయపరిజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ''మనం మన నగరాలను భారతదేశ జనరేటర్లుగా తీర్చిదిద్దకపోతే, మనకు మేధాపరమైన న్యాయబద్ధత లభిస్తుందని అనుకోను'' అని రాజీవ్ అన్నారు.

డీసీఐకి భారీ ఆర్డరు

విశాఖపట్నం, జనవరి 11 (మనం న్యూస్): ప్రైవేటీకరణ దిశగా సాగుతున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డీసీఐ)కి భారీ ఆర్డర్ లభించింది. అంతర్జాతీయ సంస్థల నుంచి గట్టి పోటీని ఎదుర్కొన్న డీసీఐ 2017-18 సంవత్సరానికిగాను కొచ్చిన్ పోర్టులో డ్రెడ్జింగ్ చేసేందుకు 88.51 కోట్ల రూపాయల టెండర్‌ను దక్కించుకొంది. వాస్తవానికి, 2011-12 సంవత్సరం నుంచి వరుసగా ఈ టెండర్ డీసీఐకి దక్కుతూ వస్తోంది. తక్కువ మొత్తానికి కోట్ చేయడం ద్వారా దానికి ఈ టెండర్ దక్కింది. రెండు డ్రెడ్జర్‌లతో ఏడాది పొడవునా ఇందుకు సంబంధించిన పనులు జరుగుతాయని డీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నిటినీ చేర్చవద్దు

న్యూఢిల్లీ: రెస్టారెంట్లు మినహా మిగిలిన అన్ని సర్వీసులను వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) వ్యవస్థలోని కాంపోజిషన్ స్కీము పరిధిలోకి తీసుకురావాలన్న సిఫార్సును ప్రభుత్వం నియమించిన కమిటీ ఒకటి వ్యతిరేకించింది. ఈ 10 మంది సభ్యుల చట్ట సమీక్షా కమిటీలో కేంద్ర, రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఇద్దరూ ఉన్నారు. కాంపోజిషన్ డీలరు సమకూర్చే సర్వీసుల పరిమితిని, పన్ను వేయదగిన టర్నోవరులో లేదా రూ. 5 లక్షలలో (ఈ రెండింటిలో ఏది ఎక్కువగా ఉంటే దానిలో) 10 శాతానికి పరిమితం చేయాలని కూడా ఈ కమిటీ సూచించింది. జాబ్ వర్క్ రూపంలో కాంపోజిషన్ డీలరు సరఫరా చేసే సర్వీసులకు 18 శాతం మించకుండా ఒక ప్రత్యేక కాంపోజిషన్ రేటు నిర్ణయించాలని కూడా కమిటీ సూచించింది. రూ. 1.5 కోట్ల టర్నోవరు మించని వస్తూత్పత్తిదార్లు, రెస్టారెంట్ల యజమానులు, ట్రేడర్లకు మాత్రమే కాంపోజిషన్ స్కీము వర్తిస్తుంది.

రూ. 3,500 కోట్ల బినామీ ఆస్తుల జప్తు



న్యూఢిల్లీ: ఫ్లాట్లు, దుకాణాలు, నగలు, వాహనాలతో సహా రూ. 3,500 కోట్లకు పైగా విలువైన 900లకు పైగా బినామీ ఆస్తులను జప్తు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ (ఐ.టి.డి) గురువారంనాడు ప్రకటించింది. 2016 నవంబరు 1 నుంచి అమలులోకి వచ్చిన బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం కింద చర్యలను పెంపొందించినట్లు ఐ.టి.డి. ఒక ప్రకటనలో తెలిపింది. ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసి, తర్వాత బినామీ ఆస్తులను, అవి చర, స్థిరాస్తులు ఏవైనా సరే, స్వాధీనపరచుకునేందుకు చట్టం వీలు కల్పిస్తోంది. లబ్ధిదారైన యజమానిని, బినామీదారును, బినామీ లావాదేవీలకు పురికొల్పిన వ్యక్తిని ప్రాసిక్యూట్ చేసేందుకు కూడా అది వీలు కల్పిస్తోంది. ఈ చట్టం కింద ఏడేళ్ళ కఠిన జైలు శిక్ష, ఆస్తి మార్కెట్ విలువలో 25 శాతం వరకు మొత్తాన్ని జరిమానాగా విధించవచ్చు. బినామీ ఆస్తులకు సంబంధించి సత్వరం చర్య తీసుకునేందుకు వీలుగా, దేశవ్యాప్తంగా ఇన్వెస్టిగేషన్ డైరెక్టరేట్ల కింద ప్రత్యేకించి 24 బినామీ నిషేధ యూనిట్లను (బి.పి.యులను) ఆదాయ పన్ను శాఖ 2017 మే నెలలో నెలకొల్పింది. ''శాఖ చేపట్టిన తీవ్ర ప్రయత్నాల వల్ల, ఈ చట్టం కింద 900లకు పైగా కేసులలో తాత్కాలికంగా జప్తు పూర్తి చేశాం. వీటిలో స్థలాలు, ఫ్లాట్లు, దుకాణాలు, నగరలు, వాహనాలు, బ్యాంక్ ఖాతాలలో డిపాజిట్లు, ఫిక్సెడ్ డిపాజిట్లు వంటివి కూడా ఉన్నాయి'' అని ఆ ప్రకటన వెల్లడించింది. బినామీ అంటే పేరు లేనిది అని అర్థం. లీగల్ యజమాని లేని ఆస్తిని లేదా కల్పిత యజమానిని బినామీగా పిలుస్తారు. గుప్త ధనాన్ని నివారించడానికి అసలు బినామీ చట్టాన్ని 1988లో ప్రవేశపెట్టారు. బినామీ లావాదేవీలను నిషేధించి, బినామీ ఆస్తులను స్వాధీనపరచుకునేందుకు వీలు కల్పిస్తూ ఈ చట్టాన్ని 2016లో సవరించారు. ఐదు కేసులలో రూ. 150 కోట్లకు పైగా విలువైన బినామీ ఆస్తుల తాత్కాలిక స్వాధీనాలను న్యాయనిర్ణయాధికారి ధ్రువీకరించినట్లు ఐ.టి.డి. తెలిపింది. వాటిలో ఒక కేసు వివరాల్లోకి వెళితే...ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ రూ. 110 కోట్లకు పైగా విలువైన సుమారు 50 ఎకరాల భూమిని ఏ ఆదాయమూ లేని కొందరు వ్యక్తుల (బినామీదారుల) పేరిట ఉంచినట్లు రుజువైంది. భూమిని అమ్మినవారు, దీనిలో ప్రమేయమున్న బ్రోకర్లతో కూడా ఈ విషయాన్ని నిర్ధారించుకున్నారు. మరో కేసులో, పెద్ద నోట్ల రద్దు తర్వాత, ఇద్దరు అస్సెసీలు తమ ఉద్యోగుల పేరిట ఉన్న బహుళ బ్యాంకు ఖాతాలలో, అకాలంలో, సుమారు రూ. 39 కోట్ల విలువైన రద్దయిన పెద్ద నోట్లను జమ చేశారని రుజువైంది. ఇంకో కేసులో, ఒక వాహనాన్ని అడ్డగించి రూ. 1.11 కోట్లను స్వాధీనపరచుకున్నారు. వాహనంలో ఉన్న వ్యక్తి ఆ నగదు తనది కాదని చెప్పాడు. ఆ తర్వాత కూడా, ఆ నగదు తమదంటూ ఎవరూ ముందుకు రాలేదు. న్యాయ నిర్ణయాధికారి దాన్ని బినామీ ఆస్తిగా ధ్రువీకరించారు. ''గుప్తధనానికి వ్యతిరేకంగా సమన్వయంతో కూడిన కృషిని కొనసాగించేందుకే ఆదాయ పన్ను శాఖ అంకితమై ఉంది. బినామీ లావాదేవీలపై చర్యలను తీవ్రతరం చేస్తాం'' అని ఆ ప్రకటన తెలిపింది. ఎవరో వ్యక్తి డబ్బు చెల్లిస్తే, తన పేరిట ఆస్తి ఉంచుకున్నా లేదా మూడో వ్యక్తికి బదలీ చేసినా అది బినామీ లావాదేవీ అవుతుందని బినామీ చట్టం నిర్వచిస్తోంది. ఈ నిర్వచనాన్ని 2016 నాటి బిల్లు సవరించింది. బినామీగా లెక్కకు వచ్చే ఇతర లావాదేవీలను కూడా దానిలో చేర్చారు. ఒక కల్పిత వ్యక్తి పేరుతో లావాదేవీ జరిపినా, యజమాని సదరు ఆస్తి ఉన్నట్లు తెలియదని చెప్పినా, లేదా లావాదేవీకి నగదు సమకూర్చిన వ్యక్తి జాడ తెలియక పోయినా కూడా అవి బినామీ లావాదేవీలే అవుతాయి.

మనం టెక్నాలజీ
www.manamnews.com
శుక్రవారం, 12 జనవరి 2018



చాలా మంది త్రీడీ సినిమాలు చూసే ఉంటారు. ఏదైనా మన కళ్ల ముందే, మన చుట్టూరా కదులుతున్నట్లుగా, మన ముందే అంతా జరుగుతున్నట్లు అనుభూతి చెందుతాం. త్రీడీలో మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీయే వర్చువల్ రియాలిటీ. మన ఊహకు అందని ప్రపంచంలో మనం విహరిస్తున్న అద్భుతమైన అనుభూతి మనకు వర్చువల్ రియాలిటీతో సొంతమవుతుంది. త్రీడీలో కళ్లకు గ్లాసులు పెట్టుకుని.. ఏదైనా తెరపై ఫోకస్ చేసిన చిత్రాన్ని చూస్తుంటాం. అది ఒకవైపు మాత్రమే ఉంటుంది. అదే వర్చువల్ రియాలిటీలో అయితే అన్ని కోణాల్లోనూ, కొన్నిసార్లు పూర్తిగా 360 డిగ్రీల కోణంలో సరికొత్త ప్రపంచంలో విహరించవచ్చు. అన్నీ మన కళ్ల ముందే జరుగుతున్నట్లుగా కనిపిస్తుంటాయి. సాధారణ వీడియోలు, సినిమాలను కూడా అచ్చం థియేటర్‌లో పెద్ద స్క్రీన్ పై చూసిన మాదిరిగా వీక్షించవచ్చు.ఎన్నో రకాల వీడియో గేమ్ లను ఆడుకోవచ్చు.

వర్చువల్ రియాలిటీ

వర్చువల్ రియాలిటీ గేమింగ్ మరింత అద్భుతమైనది కూడా. ఈ వర్చువల్ రియాలిటీని అనుభూతి చెందాలనుకుంటే పెద్దగా ఖర్చు పెట్టాల్సిన అవసరం కూడా లేదు. కేవలం రూ.400 నుంచి రూ.3 వేల వరకు ఖర్చుపెడితే.. వర్చువల్ రియాలిటీ హెడ్ సెట్‌లు, బాక్సులు లభిస్తుంటాయి. వాటిలో మన ఫోన్‌ను అమర్చుకుని ఎంజాయ్ చేయవచ్చు.. ఆ వివరాలేంటో తెలుసుకుందాం..

వర్చువల్ రియాలిటీ హెడ్ సెట్/బాక్స్

అత్యంత తక్కువ ధరలో అత్యంత విభిన్నమైన అనుభూతిని పొందాలంటే వర్చువల్ రియాలిటీ హెడ్ సెట్/బాక్స్‌లను తీసుకోవచ్చు. దీనిద్వారా వర్చువల్ ప్రపంచంలో విహరించవచ్చు. నిజానికి వీఆర్ హెడ్‌సెట్‌లో ప్రధానంగా ఉండేవి రెండు మ్యాగ్నిఫికేషన్ లెన్సులు మాత్రమే. కానీ లోపల పూర్తి చీకటిగా ఉండి, ఫోన్ తెరను రెండుగా విభజించి.. ఒక్కో కంటితో ఒక్కో భాగాన్ని చూసేలా ఏర్పాటు ఉంటుంది. అదే మనకు వీఆర్ అనుభూతిని ఇస్తుంది. మన కళ్లకు తగినట్లుగా లెన్సుల మధ్య దూరాన్ని పెంచుకునేందుకు, తగ్గించుకునేందుకు... ఫోన్‌కు దగ్గరగా, దూరంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు ఉంటాయి.

అతి తక్కువ ధరలో..



వర్చువల్ రియాలిటీకి విస్తృత ప్రాచుర్యం కల్పించేందుకు గూగుల్ సంస్థ అత్యంత చవకగా 'గూగుల్ కార్డ్ బోర్డ్' పేరిట వీఆర్ బాక్స్‌ల తయారీని అభివృద్ధి చేసింది. కేవలం రెండు మ్యాగ్నిఫికేషన్ అద్దాలు (భూతద్దాలు), కార్డ్ బోర్డ్ సహాయంతో ఈ 'గూగుల్ కార్డ్ బోర్డ్'లను రూపొందించవచ్చు. ఇదే పేరిట ఎన్నో వర్చువల్ రియాలిటీ వీడియోలను కూడా రూపొందించి, యూట్యూబ్ లో అందుబాటులో ఉంచింది కూడా. 'గూగుల్ కార్డ్ బోర్డ్'లను కొన్ని సంస్థలు తయారు చేసి, ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాయి. వాటిల్లో వాడే లెన్సుల నాణ్యతను బట్టి ఇవి రూ.120 నుంచి రూ.1,500 వరకు దొరుకుతాయి.

వీఆర్ బాక్సులు

'గూగుల్ కార్డ్ బోర్డ్'ను ప్రేరణగా తీసుకుని ప్లాస్టిక్, ఫైబర్, ముఖానికి, ముక్కుకు మంచి కుషన్ అందించే ఏర్పాట్లతో వీఆర్ బాక్స్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో వెర్షన్ 1, వెర్షన్ 2 అని కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఇన్ బిల్ట్‌గా ఎటువంటి సెన్సర్లు, స్పీకర్లు ఉండవు. ఫోన్‌లోని సెన్సర్లను వినియోగించుకుని ఈ వీఆర్ బాక్స్‌లు పనిచేస్తాయి. గూగుల్ కార్డ్ బోర్డ్ కంటే కొంత మెరుగైన వీఆర్ బాక్స్‌లు రూ.350 నుంచి రూ.2,000 వరకు లభిస్తున్నాయి. ఫోన్‌ను వీఆర్ బాక్స్‌లో పెట్టాక ఆపరేట్ చేసేందుకు వీలుగా బ్లూటూత్ రిమోట్‌లు కూడా లభ్యమవుతున్నాయి. వీటిని అదనంగా గానీ, వీఆర్ బాక్స్‌తో కలిపిగానీ కొనుగోలు చేయవచ్చు.

వీఆర్ హెడ్ సెట్‌లు

పూర్తి స్థాయిలో వర్చువల్ రియాలిటీ, త్రీడీ అనుభూతిని పొందేందుకు వీఆర్ హెడ్ సెట్‌లు లభిస్తాయి. వీటి ధర ఎక్కువగా ఉంటుంది. సామ్‌సంగ్ వంటి ప్రముఖ కంపెనీలు ఈ వీఆర్ హెడ్ సెట్లను తయారుచేస్తాయి. వీటిల్లో అత్యంత నాణ్యమైన లెన్సులను వాడుతారు. వీటిలో మోషన్ సెన్సర్, మ్యాగ్నటిక్ సెన్సర్, గైరోస్కోప్ వంటి సెన్సర్లు కూడా ఉంటాయి. కొన్నింటిలో ఇన్ బిల్ట్‌గా స్పీకర్లు, మైక్రోఫోన్లు కూడా ఉంటాయి. సాధారణ వీఆర్ బాక్స్‌లలో హెడ్ ఫోన్లు లేకపోవడంతో పూర్తిగా వీఆర్ అనుభూతి దక్కదు. అదే వీఆర్ హెడ్ సెట్లలో ఉండే స్పీకర్లతో త్రీడీ వీడియోలు, గేమ్‌లను ఆడితే అద్భుతమైన అనుభూతి సొంతమవుతుంది.

ఇన్ బిల్ట్ స్క్రీన్ కూడా..

ఇక హైఎండ్ వర్చువల్ రియాలిటీ హెడ్ సెట్లలో వాటిల్లోనే ఇన్ బిల్ట్‌గా స్క్రీన్ కూడా ఉంటుంది. మన మొబైల్‌కు కేబుల్ ద్వారా కనెక్ట్ చేసుకుని వాటిని వినియోగించుకోవచ్చు. ఇలాంటి వాటిల్లో అన్ని రకాల సెన్సర్లతో పాటు గేమ్ కంట్రోలర్లు, రిమోట్లు వంటివి కూడా ఉంటాయి. అయితే వీటి ధర చాలా ఎక్కువగా ఉంటుంది. పూర్తి స్థాయిలో అత్యుత్తమ వర్చువల్ రియాలిటీ అనుభూతిని పొందడానికి, వర్చువల్ రియాలిటీ గేమ్‌లు ఆడడానికి ఈ హెడ్ సెట్‌లు అత్యుత్తమంగా ఉంటాయి. అయితే ఈ వీఆర్ హెడ్ సెట్ల ధరలు చాలా ఎక్కువగా.. అంటే వేల రూపాయల్లో ఉంటాయి.


ప్రత్యేకంగా వీఆర్ వీడియోలూ ఉంటాయి..

హాలీవుడ్ సినిమాలను వర్చువల్ రియాలిటీ ఫార్మాట్‌లో కూడా విడుదల చేస్తుంటారు. ఇటీవలి కాలంలో బాలీవుడ్, టాలీవుడ్ సినిమాల ట్రైలర్లను వర్చువల్ రియాలిటీలో విడుదల చేస్తున్నారు కూడా. ఇక కొన్ని సంస్థలు ప్రత్యేకంగా వీఆర్ వీడియోలను రూపొందించి విడుదల చేస్తున్నాయి.



వాటితో అయితే పూర్తి స్థాయిలో 3డీ, వర్చువల్ రియాలిటీ అనుభూతిని పొందవచ్చు. వీటిలో కొన్ని 360 డిగ్రీల (మనం ఎటువైపు తిరిగితే అటువైపు దృశ్యం కనిపించేలా) వీడియోలూ అందుబాటులో ఉన్నాయి. యూట్యూబ్ నుంచి, కొన్ని సైట్ల నుంచి ఆ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. వీఆర్ వీడియోస్, కార్డ్ బోర్డ్ వీడియోస్ పేరిట సెర్చ్ చేసి ఈ వీడియోలను పొందవచ్చు. వీటిని డౌన్‌లోడ్ చేసుకుని నేరుగా ఫోన్‌లోని సాధారణ ప్లేయర్‌తోనే ప్లే చేసి చూడొచ్చు.

సాధారణ వీడియోలూ వీఆర్ వీడియోలుగా..



ఇక సాధారణ వీడియోలు, సినిమాలను కూడా వీఆర్‌కు అనుకూలంగా మార్చి అందించే ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. గూగుల్ ప్లేస్టోర్‌లో వీఆర్ యాప్స్‌ను సెర్చ్ చేసి ఇన్ స్టాల్ చేసుకోవచ్చు. ఈ యాప్స్ మన ఫోన్, మెమరీ కార్డ్‌లోని వీడియోలను వీఆర్ టెక్నాలజీకి అనుగుణంగా మార్చి ప్లే చేస్తాయి. అందువల్ల ఆ వీడియోలను థియేటర్‌లో పెద్ద తెరపై చూసిన అనుభూతి సొంతమవుతుంది. ఇలాంటి యాప్‌లలో 'ఏఏఏ వీఆర్ ప్లేయర్' అద్భుతంగా పనిచేస్తుంది.

వీఆర్ గేమ్స్‌తో మరింత మజా

సాధారణంగా ఫోన్‌లో ఎన్నో రకాల గేమ్స్ ఆడుతూ ఉంటాం. చిన్న స్క్రీన్ పైనే ఆ గేమ్స్ ఎంతో ఉత్కంఠభరితంగా ఉంటాయి. మరి అదే గేమ్స్‌ను పెద్ద తెరపై, త్రీడీ రూపంలో ఆడగలిగితే ఇంకా బాగుంటుంది కదా. వీఆర్ హెడ్ సెట్/బాక్స్‌ల ద్వారా ఆడగలిగే ఎన్నో ప్రత్యేకమైన గేమ్‌లు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వాటిని డౌన్ లోడ్ చేసుకుని.. గేమింగ్ మజాను అనుభూతి చెందవచ్చు.

ప్రత్యేకమైన వీఆర్ యాప్స్

వర్చువల్ రియాలిటీ అనుభూతిని పొందేందుకు కొన్ని ప్రత్యేకమైన యాప్స్ కూడా అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు రోలర్ కోస్టర్ వీఆర్ యాప్.. దీని ద్వారా రోలర్ కోస్టర్లో నిజంగానే ప్రయాణించిన అనుభూతిని పొందవచ్చు. బెంజ్ కారులో విహరిస్తున్న అనుభూతి కావాలంటే మెర్సిడెస్ వీఆర్ ఫర్ కార్డ్ బోర్డ్ యాప్‌ను, బొమ్మల గ్యాలరీని 3డీలో చూసేందుకు టిల్ట్ బ్రష్ గ్యాలరీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఇలా ఇంకెన్నో అద్భుతమైన యాప్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఏ ఫోన్లలో వాడుకోవచ్చు..

మూడున్నర అంగుళాల ఫోన్‌ల నుంచి 6 అంగుళాల డిస్‌ప్లే ఉన్న ఫోన్లు, ట్యాబ్లెట్ల వరకు వీఆర్ హెడ్ సెట్/బాక్స్ లలో వినియోగించుకోవచ్చు. అయితే కొన్ని రకాల వీఆర్ హెడ్ సెట్/బాక్స్‌లలో కొన్ని పరిమాణాలున్న ఫోన్లను పెట్టుకోవడానికి మాత్రమే అవకాశముంటుంది. అందువల్ల మన వద్ద ఉన్న ఫోన్‌కు తగిన వీఆర్ హెడ్ సెట్/బాక్స్‌ను కొనుగోలు చేయడం మంచిది. సాధారణంగా కొత్తగా వర్చువల్ రియాలిటీ అనుభూతిని సొంతం చేసుకోవాలంటే తక్కువ ధరకు లభించే వీఆర్ బాక్స్ లేదా గూగుల్ కార్డ్ బోర్డ్‌లను కొనుగోలు చేయడం బెటర్. ఇటీవల పలు కంపెనీలు తమ ఫోన్లతో వర్చువల్ రియాలిటీ హెడ్ సెట్‌లను కూడా అందిస్తున్నాయి. కొత్తగా ఫోన్ కొనదల్చుకుంటే.. ఆ ఫోన్లు తీసుకోవచ్చు.

కొన్ని బెస్ట్ వీఆర్ హెడ్ సెట్‌లు..

హెచ్ టీసీ వైవ్, ఆక్లస్ రిఫ్ట్, సోనీ ప్లేస్టేషన్ వీఆర్, సామ్సంగ్ గేర్ వీఆర్, మైక్రోసాఫ్ట్ హోలో లెన్స్, రేజర్ ఓఎస్ వీఆర్ హెచ్ డీకే, వంటివి ఖరీదైన వీఆర్ హెడ్ సెట్లు,

గూగుల్ కార్డ్ బోర్డ్, గూగుల్ డే డ్రీమ్ వ్యూ, వీఆర్ బాక్స్, జెబ్రోనిక్స్ వీఆర్, ఆరా వీఆర్ స్మార్ట్ గ్లాసెస్, ఏఎన్ టీ వీఆర్, కూల్ ప్యాడ్ కూల్ వంటివి తక్కువ ధరలో లభించే వీఆర్ హెడ్ సెట్‌లు.



పాట... పరుగు

ఓ చేతిలో ఎంపీ3 ప్లేయర్, మరో చేతికి ఫిట్‌నెస్ ట్రాకర్... ఉదయాన్నే వాకింగ్/ రన్నింగ్‌కు వెళ్తున్నప్పుడు ఇదేనా మీ పరిస్థితి. ఫిట్‌నెస్ ట్రాకర్‌తో ఆ పరిస్థితిని సింపుల్ చేయొచ్చు. పాటల పెట్టె, ఫిట్‌నెస్ ట్రాకర్‌ను కలిపి ఒకటిగా చేసిన పరికరం ఇది. చేతి గడియారం పరిమాణంలో ఉండే పెబెల్ కోర్‌ను చొక్కా కాలర్‌కు లేదంటే డ్రెస్‌కు తగిలించేయొచ్చు. దానికి ఇయర్‌ఫోన్ పెట్టుకొని పాటలు వింటూ ఉదయపు నడక కొనసాగించొచ్చు. ఇది మొబైల్ డేటా లేదా వై-ఫై ఆధారంగా జీపీఎస్ పరిజ్ఞానంతో పని చేస్తుంది. నాలుగు సెంటీమీటర్ల పరిమాణంలో, 50 గ్రాముల బరువు ఉంటుంది. వచ్చే ఏడాది ప్రారంభంలో మన దేశ మార్కెట్‌లోకి వస్తుంది. ధర సుమారు రూ.ఐదు వేలు. పెబెల్ ట్రాకర్‌పై రెండు బటన్స్ ఉంటాయి. పెద్ద బటన్‌ను ఒత్తితే మీ రన్నింగ్ యాక్టివిటీ నమోదు చేసుకోవడం మొదలవుతుంది. మీరు ఎంతసేపు నడిచారో, పరిగెత్తారో తెలియాలంటే మరోసారి ఆ పెద్ద బటన్ నొక్కాలి. యాక్టివిటీ పూర్తయినప్పుడు ఆ బటన్‌ను లాంగ్ ప్రెస్ చేస్తే సరి. దానిపైన ఉండే చిన్న బటన్‌ను ఒత్తడం ద్వారా అత్యవసర సమయాల్లో దీని నుంచి నేరుగా మీ మిత్రునికి సందేశం పంపొచ్చు. మిత్రుని నెంబరును ముందుగా నమోదు చేసుకొని ఉండాలి. ఈ మొత్తం యాక్టివిటీని సంబంధిత ఆప్ ద్వారా మీ మొబైల్‌కు కనెక్ట్ చేసుకొని చూడొచ్చు.



ఫైల్స్ పంపాలా?

ఎక్కువ మెమొరీ కూడిన ఫైల్స్‌ని పంపాలంటే? మెయిల్ ఎటాచ్‌మెంట్స్‌గా పంపడం అయితే సాధ్యం కాదు. మరి, సులభమైన పద్ధతిలో ఫైల్స్‌ని సురక్షితంగా పంచుకోవాలంటే? అందుకు 'ఫైర్‌ఫాక్స్ సెండ్' సర్వీసు సిద్ధంగా ఉంది. ఉచిత సాఫ్ట్‌వేర్ కమ్యూనిటీ ఫైర్‌ఫాక్స్ నుంచి అందుబాటులోకి వచ్చిన సర్వీసు ఇది. దీంట్లో 1 జీబీ



వరకూ డేటాని అప్‌లోడ్ చేసి ఇతరులతో పంచుకోవచ్చు.అప్‌లోడ్ చేసిన ఫైల్స్ ఎన్‌క్రిప్ట్ అయ్యి ప్రత్యేక యూఆర్ఎల్ లింక్ జనరేట్ అవుతుంది. ఆ లింక్‌ని షేర్ చేయడం ద్వారా ఫైల్‌ని ఇతరులు డౌన్‌లోడ్ చేసుకోగలరు. టిక్కెట్లు బుక్ చేయడం దగ్గరనుంచి... పీఎన్ఆర్ స్టేటస్... రైలు రూటు... ఇతర స్టేటస్ వివరాల్ని ఎప్పటికప్పుడు ఫోన్‌లోనే చెక్ చేసేస్తుంటాం. మరి, ఫోన్‌లో డేటా ప్యాక్ లేకుంటే ఏంటి పరిస్థితి? నెట్ కనెక్షన్ లేకున్నా సెల్యులర్ నెట్‌వర్క్‌తోనే లోషన్‌ని గుర్తిస్తూ లైవ్‌లోనే 'ట్రైన్ స్టేటస్' తెలుసుకోవచ్చు.8 ప్రాంతీయ భాషల్లో ఆప్‌ని వాడుకోవచ్చు.


లెన్స్ లేని కెమెరా



స్మార్ట్‌ఫోన్లలో ఉండే కెమెరాల మెగాపిక్సల్ ఎంత ఉన్నా... వాటితో తీసే ఫొటోల్లో అంత నాణ్యత ఉండదు. కారణం వాటి లెన్స్ పరిమాణం, దానికి కేటాయించిన స్థలం. మొబైల్‌లో తక్కువగా ఉంటుంది. ప్రస్తుతం మొబైళ్లు పలుచగా మారిపోతుండడంతో ఈ రోజుల్లో కెమెరా లెన్స్‌కు ఇచ్చే స్థానమూ తగ్గిపోతోంది. అందుకే లెన్స్ అవసరం లేకుండా మేలైన ఫొటోలు వచ్చేలా శాస్త్రవేత్తలు కొత్త కెమెరాను రూపొందిస్తున్నారు.

ఇందులో లెన్స్ లేకుండానే లైట్‌ను ఫోకస్ చేసుకోవచ్చు. ఈ కొత్త కెమెరాలో లెన్స్‌కు బదులు అతి పలుచని ఆప్టికల్ ఫేస్డ్ యారీ (ఓపీఏ) ఉంటుంది. ఇది లెన్స్ చేసే పనిని మరింత మెరుగ్గా చేస్తుంది. లెన్స్ లేని కెమెరాతో కూడా ఫోటోలు అద్భుతంగా తీయవచ్చని నిరూపణయ్యింది. ప్రస్తుతమున్న లెన్స్ కెమెరాలో అయితే ఇన్‌కమింగ్ లైట్ పాత్‌ను బెండ్ చేసి ఫిల్మ్ లేదా ఇమేజ్ సెన్సార్ మీద ఫోకస్ పడేలా చేస్తుంది. అదే ఓపీఏలోని యారీ మీద ఎక్కువ సంఖ్యలో లైట్ రీసీవర్స్ ఉంటాయి. ఇవి వివిధ కోణాల్లో కెమెరా ఫోకస్ వెళ్లేలా చేస్తాయి. దీని వల్ల ఫొటోలోని ప్రతి చిన్న భాగం మెరుగ్గా క్యాప్చర్ అవుతుంది.

భలే భారీ పవర్ బ్యాంక్



ఓ చేతిలో స్మార్ట్ ఫోన్... ఇంకో చేతిలో పవర్ బ్యాంక్. ఇదీ చాలామంది పరిస్థితి. మీరు కూడా అలాంటివాళ్లే అయితే ఈ భారీ పవర్ బ్యాంక్ వివరాలు తెలుసుకోండి. ఎనాక్స్ అనే ఈ పవర్ బ్యాంక్‌తో మీ స్మార్ట్‌ఫోన్‌ను పదిసార్లు ఛార్జ్ చేసుకోవచ్చు. ఎందుకంటే దీని బ్యాటరీ సామర్థ్యం 23,000 ఎంఏహెచ్. దీనిలో మరికొన్ని ప్రత్యేకతలూ ఉన్నాయి. దీనికి మూడు ఛార్జింగ్ పోర్ట్‌లుంటాయి. అందులో ఒకటి టైప్ సి యూఎస్‌బీ పోర్ట్, మరొకటి సాధారణ యూఎస్‌బీ పోర్ట్. వీటితోపాటు 110 వాల్ట్‌ల విద్యుత్తును అందించే వాల్ పోర్ట్ కూడా ఉంది. దీని ద్వారా ల్యాప్‌టాప్, ప్రింటర్, ట్రిమ్మర్, హెయిర్ డ్రయర్ లాంటివాటిని ఛార్జ్ చేసుకోవచ్చు. ఈ పవర్ బ్యాంక్‌తో ల్యాప్‌టాప్‌లను రెండుసార్లు ఛార్జ్ చేసుకోవచ్చట. అదే ట్యాబ్‌ల విషయానికొస్తే నాలుగుసార్లు ఛార్జ్ చేసుకోవచ్చు. మరి ఆ పవర్‌బ్యాంకును ఛార్జ్ చేయడానికి ఎంత టైమ్ పడుతుంది అంటారా... కేవలం రెండు గంటలే. అవును రెండే గంటల్లో పవర్ బ్యాంక్‌ను ఫుల్ ఛార్జ్ చేసుకోవచ్చు. బరువు తక్కువగా ఉండటం దీని మరో ప్రత్యేకత.



అజింక్య రహానే

పరిస్థితులను బట్టి జట్టును ఎంపిక చేయాలి: గంగూలీ



తొలి టెస్టుకు క్రికెటర్ల ఫామ్‌ను బట్టి కాకుండా అక్కడి పరిస్థితులను బట్టి టీమిండియా తుది జట్టును ఎంపిక చేయాల్సిందని మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అన్నారు. విదేశాల్లో ఇబ్బందులు పడుతున్న శిఖర్ ధావన్, రోహిత్ శర్మలను తొలి టెస్టుకు ఎంపిక చేయకుండా ఉంటే బాగుండేదని గంగూలీ అభిప్రాయపడ్డారు. గతంలో విదేశీ పర్యటనల్లో అజింక్య రహానే, కేఎల్ రాహుల్ బాగా ఆడారని.. వాళ్లకు అవకాశం ఇవ్వాల్సిందని అయన అన్నారు. 'రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌ల విదేశీ పర్యటనల రికార్డు చెప్పుకోదగినంత లేదు. దీంతో మురళీ విజయ్, విరాట్ కోహ్లీలపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఇక చెటేశ్వర్ పుజారా గురించి చెప్పాలంటే అతను చేసిన 14 సెంచరీలకు గాను 13 సెంచరీలు ఉప ఖండంలో చేసినవే. అందులో కేఎల్ రాహుల్ గురించి ఎప్పటినుంచో చెబుతు న్నాను. అతను ఆస్ట్రేలియాతో, వెస్టిండీస్‌లో, శ్రీలంకతో మంచి స్కోర్లు చేశాడు. ఇది ఫామ్‌కు సంబంధించింది కాదు. ఎవరు, ఎక్కడ స్కోరు చేయగలరనే దానికి ఉదాహరణ. కానీ మరీ అంత భయపడాల్సిన పనిలేదు. తొలి టెస్టు ఫలితం నన్ను ఆశ్చర్య పరచలేదు. విరాట్ కోహ్లీపై నాకు పూర్తి నమ్మక ముంది. తదుపరి టెస్టులో మెరుగైన ప్రదర్శన కనబరుస్తారు' అని గంగూలీ వివరించారు.



ధావన్

రాహుల్ ద్రవిడ్ @ 45

జొహన్నెస్‌బర్గ్: టీమిండియా మాజీ కెప్టెన్, అండర్-19 జట్టు కోచ్ గురువారం 45వ పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నారు. అండర్-19 వరల్డ్ కప్ కోసం యువ జట్టుతో కలిసి ప్రస్తుతం ద్రవిడ్ న్యూజిలాండ్‌లో ఉన్నారు. అయితే తమ కోచ్ పుట్టినరోజును యువకులు విభిన్నంగా జరిపారు. ద్రవిడ్ కేక్ కట్ చేసిన అనంతరం క్రీమ్‌ను కెప్టెన్ పృథ్వీ షా సేన ద్రవిడ్ ముఖానికి పూసింది. సుదీర్ఘకాలం టీమిండియా బ్యాటింగ్‌లో ద్రవిడ్ కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. క్రికెట్ ఆడే సమయంలో సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్, సౌరవ్ గంగూలీలతో కలిసి ద్రవిడ్ టీమిండియా అత్యుత్తమ మిడిలార్డర్ లైనప్‌గా కొనసాగారు. క్రికెట్ విషయాన్ని పక్కన పెడితే నిజ జీవితంలోనూ ద్రవిడ్ మంచి పేరు తెచ్చుకున్నారు. పుట్టిన రోజు సందర్భంగా మాజీ, ప్రస్తుత క్రికెటర్లు ద్రవిడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అండర్-19 వరల్డ్ కప్‌లో భాగంగా సౌతాఫ్రికా జట్టుతో జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో తన కుర్రాళ్ల ప్రతిభపై ద్రవిడ్ సంతృప్తికరంగా ఉన్నారు.



జీవితం, కెరీర్ ఆధారంగా కామిక్

టెర్రరిస్ట్ గ్యాంగ్‌తో తలపడే సునీల్ గవాస్కర్‌కు చెందిన 'సూపర్‌స్లూత్', యాక్షన్ 'కింగ్ కపిల్', 'సూపర్ మ్యాన్ సచిన్', 'బ్యాట్‌మన్ ధోనీ', 'ఐరన్ మ్యాన్ కోహ్లీ', గేల్, హల్క్ వంటి లెజెండరీ క్రికెటర్లకు చెందిన ప్రముఖ కార్టూన్లు యువకులను ఆకట్టుకున్నాయి. భారత అభిమానులు తమ క్రికెటర్లు దేవుళ్లుగా ఆరాధిస్తారు. కొంత మంది క్రికెటర్లు కామిక్ బుక్స్‌లో హీరోలుగా మరో అడుగు ముందుకేశారు. దిగ్గజ క్రీడాకారుల జీవిత చరిత్రను సినిమాలుగా తీయడం కొత్తేమీ కాదు. కానీ ఇటీవలి కాలంలో క్రికెట్ కామిక్ సిరీస్‌లు క్రీడాభిమానులను మాత్రమే కాకుండా క్రికెటర్లను కూడా ఆకట్టుకుం టున్నాయి. 'ప్లేయింగ్ ఇట్ మై వే' పేరుతో సచిన్ కామిక్ త్వరలో విడుదల కానుంది. తాజా గా రాహుల్ ద్రవిడ్ కూడా ఇందులో చేరారు. 'ది వాల్' పేరుతో ద్రవిడ్ జీవితం, కెరీర్ ఆధారంగా ఓ కామిక్ సిద్ధమైంది. ఇది గురువారం స్పోర్ట్స్‌వాక్ డాట్ కామ్‌లో విడుదలైంది.

బెంగళూరు బ్లాస్టర్స్‌కు వైట్‌వాష్

చివరి లీగ్ మ్యాచ్‌లోనూ నెగ్గిన హైదరాబాద్ హంటర్స్

నేడు తొలి సెమీఫైనల్ • ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడింటన్ లీగ్ చివరి మ్యాచ్‌లోనూ హైదరాబాద్ హంటర్స్ అద్భుత విజయం సాధించింది. గురువారమిక్కడ జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ జట్టు 6-(-1)తో బెంగళూరు బ్లాస్టర్స్‌ను వైట్‌వాష్ చేసింది. దీంతో పాయింట్ల పట్టికలో హైదరాబాద్ హంటర్స్ 20 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. పోరులో భాగంగా జరిగిన ఐదు మ్యాచ్‌ల్లోనూ హైదరాబాద్ హంటర్స్ షట్లర్లు గెలిచారు. ఈ టోర్నీలో ఇది మూడో వైట్ వాష్ కాగా.. హైదరాబాద్ హంటర్స్‌కు రెండోది. ఇంతకుముందు అవధె వారియర్స్‌తో జరిగిన పోరులోనూ హైదరాబాద్ హంటర్స్ వైట్ వాష్ సాధించింది. తొలుత జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన పియా జెబదయ బెర్నాడెత్, రాంకీరెడ్డి జోడీ 2-1 (15-6, 14-15, 15-9)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన ఎన్. సిక్కి రెడ్డి, మను అత్రి జంటను ఓడించింది. దీంతో హైదరాబాద్ హంటర్స్ జట్టు 1-0 ఆధిక్యంతో నిలిచింది. తర్వాత జరిగిన పురుషుల సింగిల్స్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన సాయి ప్రణీత్ 2-1 (10-15, 15-7, 15-14)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన చాంగ్ వీ ఫెంగ్‌పై గెలిచాడు. దీంతో హైదరాబాద్ హంటర్స్ ఆధిక్యం 2-0కు పెరిగింది.

తర్వాత జరిగిన మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన కరోలినా మారిన్ 2-0 (15-9, 15-7)తో బెంగళూరు బ్లాస్టర్స్‌కు చెందిన క్రిస్టీ గిల్‌మోర్‌ను ఓడించింది. దీంతో హైదరాబాద్ హంటర్స్ 3-0 ఆధిక్యంతో నిలిచింది. తర్వాత హైదరాబాద్ హంటర్స్ ఎంచుకున్న కీలకమైన పురుషుల సింగిల్స్ ట్రంప్ మ్యాచ్‌లో లీ హ్యున్-ఇల్ 2-1 (15-11, 11-15, 15-11)తో బెంగూళురు బ్లాస్టర్స్‌కు చెందిన శుభాంకర్ డేపై నెగ్గాడు. దీంతో హైదరాబాద్ హంటర్స్‌కు (5-0) అదనంగా 2 పాయింట్లు లభించాయి. ఇక చివరిగా బెంగళూరు బ్లాస్టర్స్ ఎంచుకున్న కీలకమైన మిక్స్‌డ్ డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో కిమ్ స రాంగ్, మటియాస్ బోయె జంట 1-2 (15-10, 11-15, 15-7)తో హైదరాబాద్ హంటర్స్‌కు చెందిన మార్కిస్ కిడో, యూ యియాన్ సియాంగ్ ద్వయం చేతిలో ఓటమిపాలైంది.

రోడ్డు ప్రమాదంలో రెజ్లర్ మృతి

పాటియాలా: ప్రముఖ రెజ్లర్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, కోచ్ సుఖ్‌చైన్ సింగ్ చీమ బుధవారం పొద్దుపోయాక జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. పాటియాలా బైపాస్ రోడ్డులో సుఖ్‌చైన్ నడుపుతున్న కారు ప్రమాదానికి గురైంది. 'సుఖ్‌చైన్ (68) నడుపుతున్న కారు పాటియాలా సంగ్రూర్ బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి 7 గంటల ప్రాంతంలో మరో కారును గుద్దుకుంది. సుఖ్‌చైన్‌ను వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందారు' అని సుఖ్‌చైన్ కుమారుడు పల్విందర్ సింగ్ సీమ తెలిపారు. సుఖ్‌చైన్ తండ్రి కేసర్ సింగ్ చీమ కూడా రెజ్లరే. పల్విందర్ సింగ్ కూడా రెజ్లరే. సుఖ్‌చైన్ సింగ్ 1974లో టెహ్రాన్‌లో జరిగిన ఆసియన్ గేమ్స్‌లో కాంస్య పతకం గెలిచారు. ఎన్ఐఎస్ పాటియాలాకు దగ్గర్లో సుఖ్‌చైన్ కోచింగ్ సెంటర్ నడుపుతున్నారు. ఇందులో 70 మంది రెజ్లర్లు శిక్షణ తీసుకుంటున్నారు.



కేఎల్ రాహుల్

రహానే, రాహుల్‌ను ఆడించాలి

పెరుగుతున్న మాజీ క్రికెటర్ల డిమాండ్

న్యూఢిల్లీ: సౌతాఫ్రికా చేతిలో తొలి టెస్టు ఓటమి తర్వాత ఇప్పుడు అందరూ అడుతున్న ప్రశ్న ఒక్కటే. ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్ టైటిల్ బరిలో నిలిచేందుకు టీమిండియా మేనేజ్‌మెంట్ రెండో టెస్టుకు ఎటువంటి మార్పులు చేయబోతోంది? అయితే సెంచూరియన్ టెస్టుకు వైస్ కెప్టెన్ అజింక్య రహానే, ఓపెనర్ కేఎల్ రాహుల్‌లను తుది జట్టులో ఆడాంచాలన్న డిమాండ్ పెరుగుతోంది. 'తదుపరి టెస్టుకు రహానే, రాహుల్‌లను తుది జట్టులో ఆడించాలి. ఐదుగురు లేదా ఆరుగురు బ్యాట్స్‌మెన్‌తో బరిలోకి దిగాలని టీమిండియా భావిస్తుండొచ్చు. కానీ తొలి టెస్టు ఓటమి తర్వాత మన బ్యాటింగ్ మరింత బలోపేతంగా ఉండాలన్న విషయం అర్థమైంది' అని మాజీ వికెట్ కీపర్, సెలెక్షన్ కమిటీ మాజీ చీఫ్ కిరణ్ మోరే అన్నారు. సిరీస్‌ను గెలిచే గొప్ప అవకాశాన్ని కేప్‌టౌన్‌లో టీమిండియా చేజార్చుకుందా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'అవును! ఖచ్చితంగా చేజారింది. బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి చేతికందించిన విజయాన్ని కోహ్లీ సేన చేజార్చింది. మరో 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పివుంటే టీమిండియా గెలిచేది' అని మోరే అన్నారు. అంతేకాదు షార్ట్ పిచ్ బంతులను ఎదుర్కోవడంలో శిఖర్ ధావన్ టెక్నిక్‌ను ఆయన ప్రశ్నించారు. 'టాప్-5 బ్యాట్స్‌మెన్‌లో ఒక్కరు కూడా 50 పరుగుల చేయలేదు. సౌతాఫ్రికా పిచ్‌లపై వీళ్లు ఎలా ఆడాలను కుంటున్నారు?' అని 25 ఏళ్ల క్రితం డర్బన్‌లో సెంచరీతో సునామీ సృష్టించిన మాజీ బ్యాట్స్‌మన్ ప్రవీణ్ ఆమ్రే ప్రశ్నించారు. 'మేము సౌతాఫ్రికా పర్యటనకు వెళ్లినప్పుడు ప్రస్తుతమున్న బౌలింగ్ అటాక్ మాకు లేదు. నిజం చెప్పాలంటే ప్రత్యర్థిని 140 పరుగులలోపు ఆలౌట్ చేయడమన్నది గొప్ప విషయం. కనుక జట్టు ఇప్పటికైనా పాజిటివ్ మైండ్ సెట్‌తో ఆడాలి. హార్దిక్ పాండ్యా మాదిరిగా లూజ్ బంతులకు బౌండరీలు బాదాలి. అలా ఆడితే తప్ప సౌతాఫ్రికాలో స్కోర్ చేయలేం' అని ఆమ్రే అన్నారు. సౌతాఫ్రికాకు చెందిన ఏబీ డివిలియర్స్ బ్యాటింగ్ శైలిని అనుసరించాలని ఆయన ఉదాహరణగా చెప్పారు. ఫీల్డింగ్‌లో కోహ్లీ దూకుడు జట్టుకు ఉపయోగపడుతోందా? అన్న ప్రశ్నకు మోరే సమాధానిమిస్తూ.. 'అది కోహ్లీ సహజసిద్ధమైన స్వభావం. ప్రతి ఒక్కరికీ తమ సొంత శైలి ఉంటుంది. కోహ్లీ దూకుడు జట్టులో ధైర్యాన్ని నింపలేకపోతోంది. విషయమేంటంటే.. తొలి టెస్టు ఓడిపోయిన తర్వాత ఈ సిరీస్‌ను గెలవాలంటే శక్తికి మించి పోరాడాలి' అని చెప్పారు.

పుంజుకోవడం కష్టమే: సెహ్వాగ్



తొలి టెస్టు ఓటమి తర్వాత సౌతాఫ్రికా గడ్డపై టీమిండియా పుంజుకునే అవకాశం 30 శాతం మాత్రమే ఉందని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నారు. 'ప్రస్తుత పరిస్థితిని చూస్తుంటే టీమిండియా పుంజుకునే అవకాశాలు 30 శాతం మాత్రమే కనిపిస్తున్నాయి. ఇకనుంచి కోహ్లీ సేనకు మరిన్ని కఠినమైన సవాళ్లు ఎదురవుతాయి. అంతేకాకుండా టీమ్ మేనేజ్‌మెంట్ సెంచూరియన్ వాతావరణ పరిస్థితులను గమనించి తుది జట్టును ఎంపిక చేయాలి' అని సెహ్వాగ్ చెప్పారు. రెండో టెస్టులో ఆరుగురు స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్, నలుగురు బౌలర్లతో బరిలోకి దిగాలని సెహ్వాగ్ అభిప్రాయపడ్డారు. 'ఎక్స్‌ట్రా బ్యాట్స్‌మన్‌గా అజింక్య రహానేను తీసుకుంటే మంచిది. నలుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో బరిలోకి దిగాలి. ఈ మ్యాచ్ గెలవాలనుకుంటే కోహ్లీ, రోహిత్ కీలక పాత్ర పోషించాలి. అఫ్ స్టంప్ బయటికి వెళ్లే బంతులను కెలకొద్దన్నది నా సలహా. స్ట్రెయిట్‌గా ఆడాలి. అంటే స్ట్రెయిట్ డ్రైవ్, ఫ్లిక్ వంటి షాట్స్ ఆడితే మంచిది. షార్ట్ పిచ్ బంతులు ఆడేందుకు సిద్ధపడాలి. వాటిని ఆడే బదులు మీ శరీరానికి తాకించుకోండి' అని సెహ్వాగ్ సూచించారు. సౌతాఫ్రికాలో టెన్నిస్ బంతి మాదిరిగా బౌన్స్ అయ్యే పిచ్‌లపై బ్యాట్స్‌మన్ క్లీన్ బౌల్డ్ కావడం చాలా కష్టమని, పాజిటివ్ మైండ్ సెట్‌తో కనీసం ఓవర్‌కు 3 సగటుతో పరుగులు చేసేందుకు సిద్ధపడాలని ఈ మాజీ ఓపెనర్ అన్నారు.

సాకులు చెప్పేందుకు ఏమీ లేవు: శ్రీకాంత్



సౌతాఫ్రికాతో తొలి టెస్టులో 208 పరుగుల గెలుపు లక్ష్యాన్ని ఛేదించలేకపోయిన కోహ్లీసపై మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బార్బడోస్ (1996-97), ఎంసీజీ, ఎస్‌సీజీ (85-86)లలో తాము ఓటమిపాలైనప్పటి రోజులు గుర్తుకు వచ్చాయని, విదేశాల్లో టీమిండియా గెలవలేదని కోహ్లీ సేన మరోసారి నిరూపించిందని ఓ ఆంగ్ల దినపత్రికకు రాసిన కాలమ్‌లో శ్రీకాంత్ పేర్కొన్నారు. 'కొంత మంది టాపార్డర్ బ్యాట్స్‌మెన్ ఎటువంటి కారణం లేకుండా, నిర్లక్ష్యమైన స్ట్రోక్స్‌తో అవుటయ్యారు. హార్దిక్ పాండ్యా, ఆర్. అశ్విన్ మాత్రమే ప్రొటీస్ బౌలర్లను ఎదుర్కొన్నారు. డిఫెన్స్ ఎలా ఆడాలో భువనేశ్వర్ కుమార్ చూపించాడు' అని ఆయన అన్నారు. ప్రధాన బౌలర్ డేల్ స్టెయిన్ లేకపోయినప్పటికీ కగిసో రబాడ, మోర్నే మోర్కెల్, వెర్నాల్ ఫిలాండర్ టీమిండియా బ్యాటింగ్ లైనప్‌ను ఘోరంగా దెబ్బ తీశారని, ఇది న్యూలాండ్స్ పిచ్ ప్రభావం వల్ల కాదని శ్రీకాంత్ అన్నారు. 'మరో అవకాశం చేజారింది. బార్బడోస్, ఎంసీజీ, ఎస్‌సీజీలలో మేము ఓటమిపాలైన రోజులను గుర్తు చేసింది. డేల్ స్టెయిన్ లేకపోయినప్పటికీ 208 పరుగుల లక్ష్యాన్ని చేరుకోలేకపోయిన టీమిండియా సాకులు చెప్పేందుకు ఏమీ లేవు' అని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు.



ఇండియా, పాకిస్థాన్ ఢీ

బ్లైండ్ క్రికెట్ వరల్డ్ కప్

న్యూఢిల్లీ: ఇరు దేశాల రాజకీయ ఒత్తిళ్ల మధ్య ఇండియా, పాకిస్థాన్ జట్లు బ్లైండ్ క్రికెట్ వరల్డ్ కప్‌లో తలపడనున్నాయి. గురువారం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అజ్మన్ మైదానంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ టోర్నీ పాకిస్థాన్, యూఏఈలో జరుగుతుంది. అయితే పాకిస్థాన్‌కు రాలేమని భారత జట్టు చెప్పడంతో ఈ మ్యాచ్‌ను యూఏఈలో ఏర్పాటు చేశారు. భారత జట్టును ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ బ్లైండ్ క్రికెట జట్టు మేనేజర్ జీషన్ అబ్బాసీ అన్నారు. పాకిస్థాన్ జట్టు ఇప్పటికే బంగ్లాదేశ్, నేపాల్ జట్లపై వరుస విజయాలు సాధించింది. మరోవైపు శ్రీలంకతో జరిగిన తొలి మ్యాచ్‌లో దీపక్ మాలిక్ 103 బంతుల్లో 179 పరుగులు చేశాడు. ఆ మ్యాచ్‌లో ఇండియా 6 వికెట్లతో గెలిచింది. 359 పరుగుల గెలుపు లక్ష్యాన్ని ఇండియా 32 ఓవర్లలో ఛేదించింది.

ఐపీఎల్‌లో ఆడొద్దు

ఇంగ్లండ్ కెప్టెన్ రూట్‌కు కోచ్ విజ్ఞప్తి



లండన్: యాషెస్ సిరీస్ తర్వాత ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఇంగ్లండ్ కెప్టెన్ జో రూట్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఆదివారం తొలి వన్డే జరగనుంది. యాషెస్ ఐదో టెస్టు మ్యాచ్‌లో అనారోగ్యానికి గురైన రూట్ పూర్తిగా కోలుకున్నాడు. అయితే ఇండియా, పాకిస్థాన్ జట్లతో హోం టెస్టు సిరీస్‌లు ఉండడంతో ఈ ఏడాది ఐపీఎల్‌లో ఆడొద్దని కెప్టెన్ రూట్‌ను కోచ్ ట్రెవర్ బైలిస్ కోరారు. ఏదిఏమైనా వచ్చే ఏడాది ఇంగ్లండ్‌లో జరగనున్న 50 ఓవర్ల వరల్డ్ కప్‌కు సిద్ధపడడంపై రూట్ దృష్టి పెట్టాడు. 'రెండ్రోజుల క్రితం మేమిద్దరం మాట్లాడుకున్నాం. ఐపీఎల్‌లో ఆడొద్దని, విశ్రాంతి తీసుకోమని రూట్‌కు సూచించాను. గత రెండేళ్లలో అతను విశ్రాంతి కోరుకున్నపుడల్లా టీ20 సిరీస్‌లో ఆడాల్సి వచ్చేది. 50 ఓవర్లు, టీ20 వరల్డ్ కప్ టోర్నీల్లో ఆడాలనుకుంటున్నాడు' అని బౌలిస్ చెప్పినట్టు బ్రిటీష్ మీడియా పేర్కొంది.



హాకీ జట్టులో 12 మంది పంజాబీలు

17 నుంచి నాలుగు దేశాల టోర్నీ

చండీగఢ్: భారత హాకీకి మక్కాగా పేరొందిన పంజాబ్ రాష్ట్రం నాలుగు దేశాల టోర్నీకి ఎంపిక 20 మంది సభ్యుల జాతీయ పురుషుల జట్టులో 12 మంది ఉండడం విశేషం. ఈ టోర్నీ న్యూజిలాండ్‌లోని టారంగ, హామిల్టన్‌లలో ఈ నెల 17న ప్రారంభం కానుంది. ఇందులో భారత జట్టు ఒలింపిక్స్ రన్నరప్ బెల్జియం, జపాన్, ఆతిథ్య న్యూజిలాండ్ జట్లతో తలప డుతుంది. ఈ 12 మందిలో 10 మంది జలంధర్‌లోని సుర్జిత్ హాకీ అకాడమీకి చెందిన వారు. ఆ 12 మంది ఎవరంటే.. కెప్టెన్ మన్‌ప్రీత్ సింగ్ పవార్, రూపిందర్ పాల్ సింగ్, సత్‌బీర్ సింగ్, కృష్ణ పాఠక్, హర్మన్‌ప్రీత్ సింగ్, వరుణ్ కుమార్, గురిందర్ సింగ్, హర్‌జీత్ సింగ్, సిమ్రన్‌జీత్ సింగ్, మన్‌దీప్ సింగ్, రమన్‌దీప్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్. 'భారత హాకీకి పంజాబ్ ఎల్లప్పుడు టార్చ్ బేరర్‌గా ఉంటోంది. కానీ ఈసారి ఆ సంఖ్య పెరిగింది' అని భారత మహిళల జట్టు కోచ్ హరేంద్ర సింగ్ అన్నారు. వాళ్లల్లో చాలా మంది తన శిక్షణలో ఆడారని చెప్పారు. చాలా కాలం తర్వాత పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న జట్టును చూశానన్నారు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.